26-06Pg1exHMNWJQE.qxd:26-06Pg1exHMNWJQE.qxd 01/01/01 9:10 AM Page 1

: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM


విజయవాడ

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

26-6-2025
గురువారం సంపుటి: 31
సంచిక: 145 పేజీలు: 12
వెల: 6.50



# శుభాంశు శుక్లా అంతరిక్ష యానం

### మరో ముగ్గురితో కలిసి వ్యోమయాత్ర

### నేడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం

### రాకేష్ శర్మ తర్వాత చరిత్ర సృష్టిస్తున్న శుభాంశు

### అభినందలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ

**న్యూయార్క్,జూన్ 25:** భారత అంతరిక్ష యాత్రల చరిత్రలో మరో మైలురాయి ఆవిష్కృతమైంది. భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా యాక్సియం4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి విజయవంతంగా పయనమయ్యారు. ఈ అంతర్జాతీయ బృందానికి ఆయన సారథ్యం వహిస్తున్నారు. ఈ చారిత్రాత్మక ప్రయోగం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేస్తూ శుభాంశుశుక్లాకు, మిషన్ బృందానికి అభినందనలు తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందిస్తూ, "భారత్ నుంచి గ్రూప్ కెప్టెన్‌గా వెళ్లిన శుభాంశు శుక్లా >>2

# పెట్టుబడులు రావాలి, పేదరికం పోవాలి



● వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు పెడితే భారీ ప్రోత్సాహకాలు ● సమాజంలో అసమానతలు తొలగించడమే లక్ష్యం ● రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కండి ● ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు



బుధవారం విజయవాడలో ఫిక్కీ జాతీయకార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు, పాల్గొన్న ఫిక్కీ ప్రతినిధులు

**విజయవాడ.జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ పురోగతిలో ఐటీ కీలక పాత్ర పోషిస్తోందని సిఎం చంద్రబాబు తెలిపారు. టెక్నాలజీని ముందుకు తీసుకెళ్లడంలో ఇది ఎంతగానో ఉపయోగడుతుంద న్నారు. రానున్న రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రకాల డ్రోన్స్ అభివృద్ధితో మానవాళికి అనేక రకాలైన సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన ఫిక్కీ జాతీయ కార్యవర్గ సమావేశంలో సిఎం పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏయే రంగాలపై ఉన్నాయనే విషయాన్ని కూడా పెట్టుబడి దారుల దృష్టికి తీసుకెళ్లారు. పాలసీ మేకర్‌గా పేద రికం లేని సమాజాన్ని భావితరాలకు అందివ్వడమే తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పేదలకుధనవంతులకు మధ్య అంతరాలను తగ్గించాలంటూ చంద్రబాబు భావోద్వేగంగా ప్రసంగించారు. గత ఐదేళ్ల పాలనను పెట్టుబడిదారులు మరిచిపోవాలని.. ఆభూతం మళ్లీరాదని.. పెట్టుబడిదారులకు ఎటువంటి భయాలు లేకుండా పెట్టుబడులు పెట్టుకోవచ్చని భరోసానిచ్చారు. పెట్టుబడులు మొదలుకుని.. రాజకీయాల వరకు.. చరిత్ర మొదలుకుని.. భవిష్యత్తు అంచనాల వరకు ఇలా వివిధ అంశాలపై చంద్రబాబు తన అంతరంగాన్ని పారిశ్రామిక వేత్తలకు వివరించారు. వందేళ్ల తర్వాత టెక్నాలజీలో ఎవరూ అందుకోలేని భవిష్యత్ నగరంగా రాజధాని అమరావతి ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. నేను ఈసారి ఏమరు పాటుగా లేను. ప్రభుత్వం కొనసాగేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాను. స్వర్ణాంధ్ర విజన్ 2047ను సాకారం చేసేందుకు తమ వైపు నుంచి పూర్తి మద్దతు ఉంటుందని ఫిక్కీ జాతీయ కార్యవర్గం వెల్లడించింది. సమావేశానికి హాజరైన సిఎం చంద్రబాబుకు ఆసంస్థ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి సమావేశాన్ని ప్రారంభించారు. ఇందులో వివిధ కంపెనీల యాజమాన్యాలు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఎపిసర్కార్ చేపడుతున్న చర్యలు, చేస్తున్న పాలసీలు ఇండస్ట్రీ ఫ్రెండ్లీగాఉంటున్నాయని ఫిక్కీ ప్రతినిధులు తెలిపారు. ఎంఎస్ఎంఇల విషయంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలో >>2

## సిఎంతో నాస్కామ్ ప్రతినిధిబృందం భేటీ

**విజయవాడ,జూన్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఐటీ, సేవల రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న విస్తృత అవకాశాలను వినియోగించుకునేలా...పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాస్కామ్ ప్రతినిధులను ఆహ్వానించారు. ఐటీ, సేవల రంగంలో రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వాములు కావాలని బుధవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన నాస్కామ్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. బిఎఫ్ఎస్ఐ (బ్యాకింగ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్స్యూరెన్స్) రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు, నూతన సాంకేతికతను అందించేందుకు నాస్కామ్ ప్రతినిధులు ఆసక్తి చూపించారు. రాష్ట్రంలో ప్రజలకు సాంకేతిక ఆధారిత సేవలు అందించేలా కృషి >>2



## రెండు రోజుల సిట్ కస్టడీకి కాకాణి

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రావెల్ అక్రమ తవ్వకాల కేసులో వైఎస్సార్సీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలంటూ సిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం అయన్ను 2 రోజుల కస్టడీకి అనుమతించింది. డిఎస్సీ రామాంజనేయులు నేతృత్వంలోని సిట్ బృందం ఆయన్ని ప్రశ్నించనుంది. మరోవైపు కాకాణి అక్రమాలుపై రోజుకొక్క అభియోగం వెలుగు చూస్తోంది. అధికార అండతో దోచుకునేందుకు కృష్ణపట్నం పోర్టు దగ్గర ఏర్పాటుచేసిన అనధికార టోల్‌గేటు గుట్టు వీడిందని పోలీసులు చెబుతున్నారు. స్వలాభం కోసం సొంతంగా లాజిస్టిక్ కంపెనీ ఏర్పాటు చేసి తద్వారా రూ.కోట్లు దండుకున్న విషయాన్ని పోలీసులు గుర్తించారు.

# క్యాడర్ త్యాగాలే పార్టీకి జవజీవాలు!



బుధవారం మచిలీపట్నంలో కార్యకర్తల సదస్సులో మంత్రి లోకేష్

♦ ఉత్తమ కార్యకర్తల సదస్సులో ఐటీ,విద్యాశాఖ మంత్రి నారాలోకేష్
♦ జులై 2 నుంచి ఇంటింటి ప్రచారం
♦ కూటమి సర్కారుకు ప్రధాని సహకారం

**విజయవాడ,జూన్ 25,ప్రభాతవార్త బ్యూరో:** కార్యకర్తల అంకింత భావం,నిబద్ధత,త్యాగం తెలుగుదేశం పార్టీకి జవజీవాలుఅని,గ్రామ స్థాయి నుంచి పార్టీ పటిష్ఠతకు సరికొత్త పద్ధతిలో కార్యచరణ చేపట్టనున్నట్లు ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.మచిలిపట్నంలో బుధవారం నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇకపై పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు,తానూ ప్రతిరోజు 5గురు ప్రజలు, 5గురు కార్యకర్తలతో మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాల అమలుతీరును పరిశీలించనున్నట్లు తెలిపారు. పార్టీ అంతర్గత సమస్యలపై కార్యకర్తల ప్రతిస్పందన తెలుసుకొని, తదనుగుణంగా పార్టీ,ప్రభుత్వ కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. సమాచార లోపంవల్ల పార్టీలో అంతర్గతంగా కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని సరిదిద్ది.. కార్యకర్తల అసంతృప్తి, అభ్యంతరాలను చక్కదిద్దాల్సిన బాధ్యత తమపైఉందని లోకేష్ పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా పార్టీ కోసం కష్టపడుతూ వస్తున్న ఏ ఒక్క కార్యకర్తను విస్మరించేది లేదని, తప్పనిసరి వారిసేవలను గుర్తిస్తామని.. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ప్రకటించారు.

గత ఎన్నికలకు ముందు బాబు సూపర్ - 6, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ, ఎన్నికల తర్వాత మన టిడిపితో పాటు,పార్టీ సభ్యత్వం కార్యక్రమాల్లో కార్యకర్తలంతా చురుగ్గా పాల్గొని విజయవంతం చేశారన్నారు. వీటిని ఆమేరకు ప్రజల్లో విస్తృతంగా ప్రాచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**పార్టీ క్యాడర్ త్యాగాలను మరవబోం**

పార్టీ కార్యకలాపాలను డిజిటల్ విధానంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించి, పనిచేసిన వారిని గుర్తించాలన్నదే తమ విధానంగా ఆయన చెప్పారు. అనేక కష్టనష్టాలు ఎదొర్కొని పార్టీ అధికారంలోకి వచ్చాక పార్టీ శ్రేణుల త్యాగాలను, కృషిని మరువకుండా,అన్నింటా సముచిత స్థానం కల్పించాలన్నదే తమ అభిమతమన్నారు. తెలుగుదేశంపార్టీ ఒక సమష్టి కుటుంబమని, పార్టీ అంతర్గత సమస్యలన్నింటినీ అధినేత దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లి, తగురీతిన పరిష్కరించేందుకు తాను నిత్యం కృషి చేస్తున్నట్లు మంత్రి లోకేష్ చెప్పారు. కొన్ని నిర్ణయాల్లో ఏమరుపాటుగా తప్పులు దొర్లే అవకాశం ఉందని,వాటిని సకాలంలో తమ దృష్టికి తెస్తే, పునరావృతం కాకుండా సరిదిద్దుతామన్నారు.

**జులై 2నుంచి గడపగడపకు కార్యక్రమం**

జులై 2వతేదీ నుంచి ప్రతిఒక్క కార్యకర్త గడపగడపకు వెళ్లి, గత ఏడాది కాలంలో ప్రభుత్వం సాధించిన ఘన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ సూచించారు. బాబు సూపర్ -6 కార్యక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా >>2



ఫలితాలు విడుదల చేస్తున్న కన్వీనర్ వెంకటేశ్వర్లు తదితరులు

## పిజిసెట్‌లో 88.60% ఉత్తీర్ణత

### మహిళా అభ్యర్థులదే పైచేయి

**తిరుపతి విద్య, జూన్ 25 ప్రభాత వార్త :** ఎస్వీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలలో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన ఎపిపిజిసెట్ 2025 ఫలితాలు బుధవారం విద్యాశాఖ మంత్రి అమరావతి నుంచి ఆన్లైన్ ద్వారా విడుదల చేశారు. అనంతరం ఎస్వీయూలో పిజిసెట్ ఛైర్మన్, విసి అప్పారావు, సెట్ కన్వీనర్ పిసి వెంకటేశ్వర్లు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఫలితాల సరళిని మీడియాకు వివరించారు. >>2

## సిట్ విచారణకు మోహిత్ రెడ్డి గైర్హాజరు

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితునిగా ఉన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సిట్ వాచారణకు గైర్హాజరయ్యారు. సిట్ నోటీసులను అనుసరించి బుధవారం మోహిత్‌రెడ్డి విచారణకు హజరు కావాల్సి ఉంది, ఎపి మద్యంకుంభకోణం కేసులో సిట్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇప్పటికే ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్ట్ చేసి.. వారిని విచారిస్తున్నారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. లిక్కర్ స్కామ్ కేసులో బుధవారం సిట్ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే విచార >>2

## మంత్రి నారాయణతో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ భేటీ

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు మంచి విజన్ ఉన్న నాయకుడని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ప్రశంసించారు. ఎపి రాజధాని రూపకల్పనకు, అంతర్జాతీయ దృష్టిని అమరావతిపై కేంద్రీకరింపచేయడంలో ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు రెండు తెలుగు రాష్ట్రాల్లో బ్రిటన్ ప్రభుత్వం వ్యవహారాలు చూస్తున్న డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పురపాలక శాఖమంత్రి మంత్రి నారాయణతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న యూకే గ్రూప్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎక్స్పర్ట్ ఛైర్ పర్సన్ పర్వీస్, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్‌లు పలు అంశాలపై గారెన్‌విత్‌తో మాట్లాడారు, అమరావతి నిర్మాణం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు

### ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా

# 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'



### రాష్ట్రమంతా ఐదువారాల బృహత్తర కార్యక్రమం

### పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో జగన్

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** బాబు ష్యూరిటీ. మోసం గ్యారెంటీ ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు. అమలు చేయకపోవడాన్ని ప్రజల్లో ఎండగడుతూ.. 'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన వైయస్సార్‌సి కేంద్ర కార్యాలయంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో జగన్ ఉద్వేగంతో మాట్లాడుతూ చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకుతెస్తూ.,'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో' పేరుతో వైయస్సార్‌సి 5 వారాల బృహత్తర కార్యక్రమంచేపడదామన్నారు. ఇందుకు సంబంధించి క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ జగన్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం ఇంటింటికీ చేర్చేలా కార్యక్రమం చేపట్టాలన్నారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారి సంవత్సం అవుతోంది. ఇంత తక్కువ వ్యవధిలో ఒక ప్రభుత్వంపై వ్యతిరేకత ఈ స్థాయిలో గతంలో ఏనాడూ లేదు.

అంత తక్కువ కాలంలోనే ఇంత దారుణమైన ప్రజా వ్యతిరేకత కనిపిస్తోంది.చంద్రబాబునాయుడు ఈ వ్యతిరేకత మధ్య, ప్రజలకు మంచి చేయాల్సింది పోయి, ప్రజలను తప్పు దోవ పట్టించాలని చూస్తున్నారు. అందుకే ఈరోజు రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్‌తో పాటు, అణిచివేత చూస్తున్నాం. రెడ్ బుక్ పాలన చూస్తున్నాం. గత వైయస్సార్‌సి ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం మధ్య స్పష్టంగా తేడా కనిపిస్తోంది. మన 5 ఏళ్ల పాలనలో వివక్ష లేకుండా పథకాలు అందించాం. పార్టీ చూడకుండా మంచి చేశాం. అదే ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంలో కనిపిస్తోంది ఏమిటంటే, కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ, విచ్చలవిడిగా అన్యాయాలు కనిపిస్తున్నాయి. మన ప్రభుత్వంలో ఎప్పుడూ చూడని విధంగా విద్య, వైద్యం, వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులతో పాటు, పాలనలో పూర్తి పారదర్శకత చూపాం. దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణకల్పించాం. ఇలాఎన్నో మార్పులు చూశాం.

కానీ చంద్రబాబు ఈ ఏడాది పాలనలో మోసం, దగా తప్ప ఏమీ లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీకూడా నిలబెట్టుకోలేదు. ఈ ప్రభుత్వంవచ్చి ఏడాది పూర్తవుతుంది. ఏడాది పాలనలో చంద్రబాబు వల్ల ప్రతి కుటుంబానికి జరిగిన నష్టం ఎం? ఈఏడాది కూడా పథకాలు లేవు కాబట్టి, ఇంకా ఎంత నష్టం >>2

## 'జల హారతి' కార్పొరేషన్ ఏర్పాటు

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగురాష్ట్రాల్లో వివాదంగా మారిని బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్టును స్థాపించేందుకు పునాది వేస్తూ.. ప్రాజెక్టు నిర్మాణం కోసం తాజాగా 'జలహారతి కార్పొరేషన్ లిమిటెడ్‌చి' అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. సముద్రంలోకి వృధాగా పోతున్న గోదావరి జలాలను రాయలసీమ, పల్నాడు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. అమరావతిని జలవనరుల కేంద్రంగా తీర్చిదిద్దడం.. ఈ కొత్త జలహారతి కార్పొరేషన్" ద్వారా అమరావతి, గవర్నర్ పేట ప్రాంతంలో ఉన్న జలవనరుల శాఖ కార్యాలయం ఆధారంగా నడపబడుతుంది. ఇది పొలవరం ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వర్తించగల సామర్థ్యాన్ని అందిస్తోంది. అమరావతి కేంద్రంగా ఏర్పాటు చేసిన ఈ జలహారతి కార్పొరేషన్ ఎస్‌పీవీ స్థాపన..గోదావరి నుంచి సముద్రంలోకి వృధాగా పోతున్న నీటిని సమర్థంగా వినియోగించేందుకు పనిచేస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. జలవనరుల శాఖచే 'జలహారతి కార్పొరేషన్' అనే వంద శాతం రాష్ట్ర ప్రభుత్వ సంస్థగా ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ సంస్థని స్థాపించింది. ఈ సంస్థను పోలవరంబనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌గా విజయవంతంగా నిర్వహించడానికి ఏర్పాటు చేయవచ్చని స్పష్టంగా అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సంస్థకు ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా, జలవనరుల మంత్రి వైస్ ఛైర్మన్‌గా, ముఖ్య కార్యదర్శి బాధ్యతలు చేపట్టనున్నారు.





## కల్తీనెయ్యితో భోలేబాబా డెయిరీకి రూ.240కోట్లు లబ్ధి!

### రసాయనాలు కలిపిన నెయ్యినే సరఫరా

### 60లక్షల కిలోల నకిలీ నెయ్యి టిటిడికి పంపిణీ

**తిరుమల,జూన్ 25ప్రభాతవార్తప్రతినిధి:** తొలినుండి అంతా అనుకున్నట్లే కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూప్రసాదాల తయారీకి రసాయనాలు వాడిన నకిలీ నెయ్యి సరఫరాతో ఉత్తరాఖండ్‌లోని బోలేబాబాడెయిరీ 240కోట్ల రూపాయలు లబ్ధిపొందిందని సిబిఐ సిట్ అధికారులు తేల్చారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ హాయంలోని పాలకమండలి నేతృత్వంలో టిటిడికి 60లక్షల కిలోల నకిలీనెయ్యిని బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్‌జైన్, విపిన్‌జైన్ ప్రధాన నిందితులని సిట్ హైకోర్టుకు నివేదించింది. ఇప్పుడు ఈ నకిలీ నెయ్యి వ్యవహారం న్యాయస్థానాన్ని కూడా విస్తుబోయే రీతిలో మారింది. ఆవునెయ్యి మాదిరి రంగు, సువాసన వచ్చేందుకు పామాయిల్‌లో రసాయనాలు కలిపారనే నిర్ధారించి న్యాయస్థానానికి తెలిపింది. ఉత్తరాఖండ్‌లోని డెయిరీ నుండి వచ్చిన ట్యాంకర్ల కల్తీ నెయ్యిని తమిళనాడులోని ఎఆర్ డెయిరీ, శ్రీకాళహస్తి సమీపంలోని వైష్ణవీ డెయిరీల ద్వారా టిటిడికి సరఫరా చేశారని తెలిపింది. ఈ తతంగం పూర్తిగా బోలేబాబా డెయిరీనే నడిపించిందని ఇందుకు పొమిల్‌జైన్, విపిన్ జైన్ కీలక పాత్రపోషించారని, నకిలీ నెయ్యి సరఫరాకు సహకరించిన ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీలకు కిలోకు 3రూపాయలు కమీషన్ ముట్ట జెప్పారనే సంచలన విషయాలు దర్యాప్తులో వెల్లడైందని సిట్ తెలిపింది.

తొలుత నెయ్యిటెండర్లలో పాల్గొనేందుకు కూడా చెల్లించే ఇఎండి నగదును బోలేబాబా డెయిరీ బ్యాంకు ఖాతానుండి ఏఆర్ డెయిరీ బ్యాంకు ఖాతాకు బదిలీ అయినట్లు విచారణలో తేలిందని చెప్పారు. ఇదేగాక వివిధ ఏజెన్సీల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఆలయాలకు కాణిపాకం, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారకాతిరుమల, శ్రీశైలం, తిరుపతమ్మఅమ్మవారి ఆలయాలకు కూడా నకిలీ నెయ్యినే సరఫరాచేసిందని తాజాదర్యాప్తులో తేలిందని పేర్కొంది.ఈ సమయంలో నకిలీ నెయ్యి నిందితులు, వారి తరపు కీలక వ్యక్తులు సాక్షులను బెదిరిస్తున్నారని వారిపై కూడా కేసులు నమోదు చేశామని సిట్ పేర్కొంది. నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టివేయాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే నిందితులుగా రిమాండ్‌లో ఉన్న పొమిల్‌జైన్, విపిన్‌జైన్, అపూర్వవినయ్‌కాంత్ చావడా హైకోర్టులో బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. నిందితులకు బెయిలిస్తే సాక్షులకు ప్రమాదమని,బెయిల్ పిటిషన్లను కొట్టివేయాలని సిబిఐ తరపున న్యాయవాది సురేశ్‌కుమార్ >>2

26-06pg2exHMNWJQE.qxd:26-06pg2exHMNWJQE.qxd 01/01/01 9:13 AM Page 1





'ఆపరేషన్ సింధు'లో భాగంగా, ఇజ్రాయెల్ నుంచి వచ్చిన భారతీయులకు న్యూఢిల్లీలో స్వాగతం పలుకుతున్న కేంద్రమంత్రి శోభాకరండ్లజె

# మోహిత్ రెడ్డి గైర్హాజరు

>> ణకు హాజరు కావటానికి మూడు రోజుల సమయం కావాలని కోరారు. ఈ కేసులో ఆయన ఏ39గా ఉన్నారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే ఏసీబీ కోర్టులో మోహిత్ రెడ్డి పిటిషన్ వేశారు. ఈరోజు ఈ పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేయనుంది.
మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, మాజీ మంత్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అతని బినామీగా చెప్పుకుంటున్న వెంకటేశ్ నాయుడును సిట్ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో వారి పాత్ర ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో అధికారులు నిర్ధారిస్తూ కోర్టుకు నివేదికను సమర్పించారు. చెవిరెడ్డిని అరెస్ట్ చేసిన సమయంలోనే అతడి కుమారుడు మోహిత్ రెడ్డిని కూడా ఏ39గా ఇందులో చేర్చారు.
మద్యం కుంభకోణం కేసులో తండ్రీ కొడుకుల పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. అయితే ముందస్తు బెయిల్ కోసం గత శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పిటిషన్ వేశారు. ఈ కేసులో బుధవారానికి మోహిత్ రెడ్డిని విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు.



ఉత్తరాఖండ్‌లో యమునోత్రి వద్ద అదృశ్యమైన యాత్రికుల కోసం అన్వేషణ జరుగుతున్న దృశ్యం

# శుభాంశు శుక్లా అంతరిక్ష యానం

>> భారత అంతరిక్ష చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించారు. మీ ప్రయాణం పట్ల దేశం మొత్తం గర్వంగా, సంతోషంగా ఉంది. మీరు, యాక్సియం4 మిషన్‌లోని ఇతర దేశాల వ్యోమగాములు వసుధైక కుటుంబం అనే భావనను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారు. నాసా, ఇస్రో మధ్య నెలకొన్న శాశ్వత భాగస్వామ్యానికి ఈ మిషన్ అద్దం పడుతోంది. ఈ యాత్ర సంపూర్ణంగా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు నిర్వహించే ప్రయోగాలు, శాస్త్రీయ అధ్యయనాలు భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా ఈ అంతరిక్ష యాత్ర విజయంపై స్పందించారు. భారత్, హంగేరీ, పోలాండ్, అమెరికా దేశాలకు చెందిన వ్యోమగాములతో కూడిన ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారని ప్రధాని మోడీ అన్నారు. కోట్లాది మంది భారతీయుల కలలు, ఆశలు, ఆకాంక్షలను శుభాంశు తనతో పాటు మోసుకెళ్లారని ఆయన అభివర్ణించారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12:01 గంటలకు ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన నిమిషాలకే, వ్యోమగాములు ప్రయాణిస్తున్న వ్యోమనౌక రాకెట్‌నుంచి విజయవంతంగా విడిపోయి, భూకక్ష్యలోకి ప్రవేశించింది. సుమారు 28 గంటల ప్రయాణం అనంతరం, గురువారం సాయంత్రం భారతకాలమానం ప్రకారం 4:30గంటలకు ఈవ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం కానుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో శుభాంశు శుక్లా నేతృత్వంలోని బృందం 14 రోజుల పాటు బస చేస్తుంది. ఈ సమయంలో వారు భారరహిత స్థితిలో పలు కీలక ప్రయోగాలు నిర్వహిస్తారు. అంతేకాకుండా, అంతరిక్షం నుంచే ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో, పాఠశాల విద్యార్థులతో, ఇతర ప్రముఖులతో సంభాషించనున్నారు. ఈ యాత్ర ద్వారా అంతరిక్ష విజ్ఞాన రంగంలో మరిన్ని కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భారత గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను అంతరిక్షంలోకి సాగనంపిన ఫాల్కన్ 9 రాకెట్ భూమికి తిరిగి చేరుకుంది. ప్రయోగం మొదలైన 8 నిమిషాల్లోనే డ్రాగన్ క్యాప్సూల్‌ను అంతరిక్షంలో వదిలి తిరిగి వచ్చింది. శుక్లాతో పాటు నలుగురు వ్యోమగాములున్న డ్రాగన్ క్రూ క్యాప్సూల్ నిర్ణీత సమయానికి ఫాల్కన్ 9 రాకెట్ నుంచి విడిపోయింది. ఆ తర్వాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) వైపు తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ క్యాప్సూల్ దాదాపు 28 గంటల పాటు ప్రయాణించి రేపు సాయంత్రం 4 గంటల ప్రాంతంలో భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోఉన్న ఐఎస్ఎస్‌కు చేరుకుంటుంది. సాయంత్రం 4:30 గంటలకు ఐఎస్ఎస్‌తో అనుసంధానమవుతుందని స్పేస్ ఎక్స్ శాస్త్రవేత్తలు తెలిపారు.



శుభాంశు శుక్లా

**8 నిమిషాల్లోనే తిరిగి రాక..**

భారత కాలమానం ప్రకారం ఈ రోజు మధ్యాహ్నం 12:01 గంటలకు డ్రాగన్ క్రూ క్యాప్సూల్ తో ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి ఎగిసింది. కెన్నెడీ స్పేస్ సెంటర్‌లోని 39ఏ లాంచ్ కాంప్లెక్స్ నుంచి ఈప్రయోగం జరిగింది. నింగికెగిరిన ఫాల్కన్ రాకెట్ షెడ్యూల్ ప్రకారం ప్రయాణించింది. డ్రాగన్ క్యాప్సూల్‌ను అంతరిక్షంలోకి వదిలి తిరిగి భూమి వైపు ప్రయాణం మొదలుపెట్టింది. ప్రయోగం ప్రారంభించిన తర్వాత 8 నిమిషాలకు రాకెట్ తిరిగి భూమిని చేరుకుంది. స్పేస్ఎక్స్ కంపెనీ తయారుచేసిన ఈఫాల్కన్ 9 రాకెట్ ప్రపంచంలోనే తొలి ఆర్బిటల్‌క్లాస్ పునర్వినియోగ రాకెట్ అని శాస్త్రవేత్తలు తెలిపారు.

# సింగయ్య మృతి కేసులో హైకోర్టులో జగన్ క్వాష్ పిటిషన్ దాఖలు

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** సింగయ్య మృతికేసులో వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుతో తమకు సంబంధం లేదంటూ తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై రేపు (గురువారం) విచారిస్తామని న్యాయస్థానం తెలిపింది. పల్నాడుజిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా గుంటూరులో ర్యాలీ నిర్వహించగా ఏటుకూరు బైపాస్ ఆంజనేయస్వామి విగ్రహంవద్ద జగన్ ప్రయాణిస్తున్న వాహనం కింద నలిగి సింగయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సింగయ్య మృతి కేసులో జగన్ ఎ2గా ఉన్నారు. జగన్‌తో పాటు మాజీ మంత్రులు, వైఎస్సార్సీపీ నేతలు పేర్ని నాని (ఏ5), విడదల రజిని (ఏ6) లను నిందితులుగా పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే పేర్నినాని, విడదల రజనిలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నీ కలిపి హైకోర్టు గురువారం విచారణ జరపనుంది. సింగయ్య మృతి కేసులో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు పోలీసులు మంగళవారం నోటీసులు ఇచ్చారు. ఈ కేసులో పోలీసులు జగన్‌ను ఏ2 నిందితుడిగా చేర్చారు.

# ప్రతినిధిబృందం భేటీ

>> చేస్తున్నామని... ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా డేటా లేక్ రూపొందించామని, దీని ఆధారంగా సేవలు విస్తృతం చేయాలని భావిస్తున్నట్టు నాస్కామ్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. గత తనపాలనలో ఐటీని ప్రమోట్ చేసినట్టే ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని సంకల్పించామని.. అందరి స్కిల్ అప్‌గ్రేడ్ చేయడం ద్వారా పెట్టుబడిదారులకు కావాల్సిన మానవ వనరులు రాష్ట్రంలో అందిస్తున్నామని చెప్పారు. మరోవైపు, చంద్రబాబు నేతృత్వంలో ఎపి అభివృద్ధి దిశగా పురోగమిస్తోందని నాస్కామ్ ప్రతినిధులు ఈ సందర్భంగా కొనియాడారు.

# పిజిసెట్‌లో 88.60% ఉత్తీర్ణత

>> వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 17 వర్సిటీలలో 143 పిజి సబ్జెక్టులలో సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఎపిపిజిసెట్‌కు 21,995 మంది హాజరుకాగా 19,488 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇందులో ఎయు రీజన్ నుంచి 15,740మంది పరీక్షలకు హాజరుకాగా 14,005 మంది ఉత్తీర్ణత సాధించగా, ఎస్వీయూ రీజన్‌లో 5764మంది పరీక్ష రాయగా 5,019మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. మొత్తం 88.60 శాతం ఉత్తీర్ణత నమోదైందని, ఈ ఏడాది పురుషుల కంటే మహిళా అభ్యర్థులే పైచేయి సాధించారని తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్సిటీలలో పలు పిజి కోర్సులకు సంబంధించి 25వేలు సీట్లు ఉన్నాయి. దీంతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వాస్తవ సీట్ల సంఖ్యకు భారీతేడా కనబడుతోంది. ఈ ఏడాది పిజి ప్రవేశాలు భారీ స్థాయిలో పడిపోనున్నాయి.

**టాపర్స్ వీరే...**

ఎపిపిజిసెట్ వివిధ సబ్జెక్టుల్లో మొదటి ర్యాంక్ సాధించిన అభ్యర్థులు బోటనీలో ఒడిశాకు చెందిన హారిక, కెమిస్ట్రీలో వైజాగ్‌కు చెందిన ఎం సత్య వెంకట యశస్విని, కామర్స్‌లో వైఎస్సాఆర్ కడపకు చెందిన చిన్మయి వెంకట సాయి, కంప్యూటర్ సైన్స్‌లో విజయవాడకు చెందిన వేద అరుణ్, ఎకనామిక్స్‌లో శ్రీకాకుళంకు చెందిన శంకర్ రావు, ఎడ్యుకేషన్‌లో అనంతరపురానికి చెందిన కంబగిరి స్వామి, ఎలక్ట్రానిక్స్‌లో కర్నూలుకు చెందిన హర్షిత, ఇంగ్లీష్ లో వైఎస్సాఆర్ కడపకు చెందిన షేక్ రుస్కర్, హిస్టరీలో వైజాగ్‌కు చెందిన రవిశంకర్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో వైజాగ్‌కు చెందిన గౌరి శివలిఖిత, గణితంలో కాకినాడకు చెందిన సాయివైష్ణవి, లైఫ్సైన్స్‌లో వైజాగ్‌కు చెందిన కావ్య, ఫిజిక్స్‌లో అమలాపురంకు చెందిన మనోహర్, జువాలజీలో అనంతపురానికి చెందిన సింధుప్రియ ఉన్నారు.

# త్యాగాలే పార్టీకి జవజీవాలు!

>> అమలు చేస్తున్నామని, తల్లికి వందనం పథకం కింద ఒక్క జిఓ తో రూ.8,745 వేల కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ నిర్ణీత సమయానికే తల్లికి వందనం పథకాన్ని విజయవంతంగా అమలుచేశామన్నారు. మెగా డిఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పరిశ్రమలను రప్పించడం ద్వారా అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పనకు శాయశక్తులా కృషిచేస్తున్నామని చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా వృద్ధులకు 4వేల పెన్షన్ అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు.

**ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15నుంచి రాష్ట్రంలోని మహిళలందరికి కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయబోతుందని లోకేష్ వివరించారు. మహిళందరికి ఎంతో ఉపయుక్తమైన ఈ పథకాన్ని కార్యకర్తలు విస్తృతంగా జనాల్లో ప్రచారం చేయాలని కోరారు. కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అహంకారం, ఇగోలను విడనాడాలని ఆయన కోరారు. గత పాలకులు అహంకారంతో వ్యవహరించడం వల్లే 151 కాస్త 11కి పడిపోయి చతికిల పడ్డారన్నారు. ఎవరైనా నాయకులు తప్పుగా ప్రవర్తిస్తే ఆ ప్రభావం పార్టీపై పడుతుందని, ప్రజల్లో చిరస్థాయిగా మంచి పేరు నిలుపుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రధాని మోడీజీ కూటమి సర్కారుకు అన్నివిధాలా సహకరిస్తూ.. చతికిల పడ్డ రాష్ట్రం తిరిగి కోలుకునే విధంగా ఆక్సిజన్ అందిస్తున్నారని లోకేష్ వివరించారు. అమరావతి, విశాఖ ఉక్కు, విశాఖ రైల్వే జోన్ వంటి అన్ని కోర్కెలను ప్రధాని తీరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు తమవంతు సహకారం అందజేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే టిడిపి, జనసేన, బిజెపిల కూటమి ఏర్పాటైందని, కూటమిలో మనది పెద్దన్న పాత్ర అని లోకేష్ వివరించారు. కూటమి నేతలు, శ్రేణుల మధ్య సమస్యలుంటే కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్‌తో పాటు ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

## నైపుణ్యాభివృద్ధి,శిక్షణ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా రాష్ట్రంలో నైపుణ్య శిక్షణ అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉన్నతవిద్యలో తీసుకురావాల్సిన కొత్త కోర్సులపై అధ్యయనం చేయాలని సూచించారు. ఈ మేరకు సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 'కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగించి రాష్ట్రం, దేశం, ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగావకాశాలు ఎక్కడ ఉనానయో తెలుసుకొని నైపుణ్యం పోర్టల్‌లో పొందుపర్చాలి. యువతకు ఈ సమాచారం అందేలా చూడాలి. యువత తమ వివరాలు నమోదు చేయగానే ఆటోమేటిక్‌గా రెజ్యూమే వచ్చేలా పోర్టల్‌ను డిజైన్ చేయాలి. ఇప్పటికే రాష్ట్రంలో రూ.9.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నాం. వీటి ద్వారా 8.5 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఈ పెట్టుబడులకు అనుగుణంగా ఉద్యోగాలు సాధించేలా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. ఐటీ కోర్సులు చేసిన విద్యార్థుల నైపుణ్యాలను సైతం అంచనా వేయాలి' అని సూచించారు. 'ఎపి యువతకు గ్లోబల్ స్థాయిలో ఉద్యోగాలు లభించే లక్ష్యంతో పని చేయాలి. జర్మనీ, ఇటలీ, సింగపూర్ సహా వేర్వేరు దేశాల్లో వైద్యారోగ్యం, నిర్మాణం, పర్యాటకం, ఐటీ, లాజిస్టిక్స్, ఉత్పత్తి రంగాల్లో ఉన్న విస్తృతమైన అవకాశాలు దక్కించుకునేందుకు విదేశీ భాషా నైపుణ్యాలను పెంచాలి. ఆయా భాషల్లో శిక్షణ ఇచ్చేందుకు ఆన్‌లైన్, ఆన్‌లైన్ ప్రత్యామ్నాయాలను పరిశీలించాలి. ఆంగ్లంతో పాటు విదేశీ భాషల విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో క్లస్టర్ల వారీగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ చేపడుతున్నట్లు ముఖ్యమంత్రికి మంత్రి నారా లోకేష్ వివరించారు.
రాష్ట్రంలో ఐదు క్లస్టర్లతో నైపుణ్యాలు అందించేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. నైపుణ్య శిక్షణ, ఉద్యోగాల కల్పనలో టోనీ బ్లెయిర్ ఫౌండేషన్‌తో కలిసి ఏపీ పనిచేస్తోందన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్‌లలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజక వర్గాల్లో 1,164 ఉద్యోగ మేళాలు నిర్వహించగా....ఇప్పటి వరకు 61,991 మందికి ఉద్యోగాలు లభించినట్లు లోకేష్ వివరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన వారిలో 74,834 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు. నైపుణ్య పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు, శిక్షణ, సర్టిఫికేషన్, ఉపాధి కల్పనతో పాటు పరిశ్రమలో అనుసంధానం, విదేశీ భాషల్లో శిక్షణ వరకు వివరాలు పొందుపరుస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

# పెట్టుబడులు రావాలి, పేదరికం పోవాలి

>> ప్రభుత్వం తీసుకుంటున్న చొరవకు ఫిక్కీ అభినందనలు తెలిపింది. టెక్నాలజీతో మనం డ్రైవింగ్ చేసే విధానాన్ని సైతం కనిపెట్టగలమని చంద్రబాబు పేర్కొన్నారు. డ్రోన్స్‌తో రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, నాలెడ్జితో ఎన్నో అద్భుతాలు సృష్టిస్తున్నామని వెల్లడించారు. మోడీ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ ఆశయాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. ఆధునిక సాంకేతికతకు చిరునామాగా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్రంలో ఎన్డీఏ కొనసాగుతోంది కాబట్టే దేశం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం. ఆర్థిక అసమానతలు తొలగించేందుకు పారిశ్రామికవేత్తలు, ధనవంతులు ముందుకు రావాలి. మిలియన్, ట్రిలియన్ డాలర్ల ఆస్తిపరులు ఓవైపు, పూట గడవని పేదలు మరోవైపు. ఈ అసమానతలు తొలిగేలా పనిచేస్తున్నాం. సమాజానికి సేవ చేసే సమయమిది. పారిశ్రామిక వేత్తల సదస్సులో అసమానతలను రూపు మాపాలి. పెట్టుబడిదారులకు గత ప్రభుత్వ పాలన ఓ చీకటి అధ్యాయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆ ఐదేళ్ల పాలన గురించి ఆలోచించవద్దని చెప్పారు. ఈమేరకు పరోక్షంగా వైఎస్సార్సీపీపై విమర్శలు చేశారు. భూతాన్ని మళ్లీరాకుండా చూసుకుంటామంటూ పారిశ్రామిక వేత్తలకు సీఎం హామీ ఇచ్చారు. ఏపీకి తాను సాధించిన బ్రాండ్‌ను గత సర్కార్ ధ్వంసం చేసిందన్నారు. మళ్లీ ఆ భూతంవస్తే పరిస్థితి ఏంటని కొంతమంది తనను అడుగుతున్నారని చెప్పారు. అది మళ్లీ రాదని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తనదీ హామీ అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**పెట్టుబడులు రావాలి... పేదరికం పోవాలి**

రాష్ట్రంలో పెట్టుబడులకు చాలా అవకాశాలు ఉన్నాయని ఫిక్కి జాతీయ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా పని చేస్తోంది. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలకు పెట్టుబడులు వచ్చేలా పాలసీలు తెస్తున్నాం. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పే కంపెనీలకు ఎక్కువ ప్రోత్సాహకాలు ఇస్తాం. ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో పెట్టుబుడులు పెట్టండి. రాయలసీమ ప్రాంతం గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, డిఫెన్స్, హైటెక్ ఇండస్ట్రీస్, ఏరో స్పేస్ రంగాలకు అనువుగా ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు గూగుల్ వంటి సంస్థలు రానున్నాయి. అలాగే విశాఖకేంద్రంగా సీ కేబుల్ వేయనున్నారు. సింగపూర్‌విశాఖకు సీకేబుల్ వేస్తున్నారు. ఇక ఈ ప్రాంతంలో కెమికల్, ఫార్మా, టూరిజం, స్టీల్ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి అనువుగా ఉంటుంది. గోదావరి జిల్లాల్లో ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలకు అవకాశం ఉంటుంది. అమరావతి, ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఏఐ, క్వాంటం వ్యాలీ.. ఇన్నోవేషన్స్ వంటి అంశాలపై ఫోకస్ పెడుతున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మీకు అనువైన ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టండి. రాష్ట్రాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయండి.. మీరు అభివృద్ధి చెందండి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ప్రభుత్వానికి సంపద సృష్టి మీ ద్వారా జరగుతుంది. ఆ సంపదను పేదలకు సంక్షేమ రూపంలో అందిస్తాం. ప్రభుత్వాధినేతగా పేదరికం లేని సమాజాన్ని భావితరాలకు అందించడం నా ముందున్న ఏకైక లక్ష్యం." అని చంద్రబాబు అన్నారు.

**సాయం చేయండి..**

ఆర్థిక అసమానతలు తొలగించేందుకు పారిశ్రామికవేత్తలు.. ధనవంతులు ముందుకు రావాలంటూ ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. మిలియన్, ట్రిలియన్ డాలర్ల ఆస్తిపరులు ఓవైపు... పూట గడవని పేదవాడు మరోవైపు అన్నట్టుగా ఉన్న అసమానతలు తొలిగేలా పని చేస్తున్నాం. సంపన్నులు సమాజానికి సేవ చేసే సమయమిది. సమాజం నుంచి ఎంతో తీసుకుని.. అభివృద్ధి చెందారు.. ఇప్పుడు పేదలకు సేవ చేయాల్సిన సమయం వచ్చింది. సమాజంలో ఆర్థిక అసమానతలు పోయేలా చేయడమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. ఒకే సమాజంలో మిలియన్ డాలర్ల ఆస్తిపరులు.. పూటకు అన్నం దొరకని నిర్భాగ్యులు ఉన్నారు. ఈ అసమానతలను తగ్గించేందుకు ప్రభుత్వం వారధిలా వ్యవహరిస్తోంది. అసమానతలను రూపుమాపేందుకు ప్రభుత్వం పి4 విధానాన్ని ప్రమోట్ చేస్తోంది. దీనికి పారిశ్రామిక వేత్తలంతా సహకరించాలి." అని ముఖ్యమంత్రి పిలుపిచ్చారు.

**డిజిటల్ కరెన్సీ రావాలి**

పారిశ్రామిక వేత్తల సదస్సులో ఎన్నికల్లో డబ్బు ప్రభావం మీద చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ కరెన్సీపై నేనే నివేదిక ఇచ్చాను. 500 నోట్లు రద్దు చేయాలని కోరుతున్నా. దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్నికల్లో డబ్బులు పంపిణీ ఎక్కువగా ఉంది. రాజకీయాలు కలుషితం అవుతున్నాయి.. దీంతో అన్ని వ్యవస్థలు కలుషితం అవుతున్నాయి. కేవలం 100, 200 నోట్లే ఉండాలి. అప్పుడు ఎన్నికల్లో డబ్బు ప్రభావం తగ్గేందుకు అవకాశం ఉంటుంది. ఎపికి నేను తీసుకొచ్చిన బ్రాండును గత ప్రభుత్వం ధ్వంసం చేసింది. వాళ్లు వస్తే.. మా పరిస్థితి ఏంటని కొంత మంది అడుగుతున్నారు. నాదీ హామీ...నేను ఈసారి ఏమరుపాటుగా లేను.. ప్రభుత్వం కంటిన్యూ అయ్యేలా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాను. కేంద్రంలో ఎన్డీఏ కంటిన్యూ అయింది కాబట్టే దేశం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోంది. కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం. గత ప్రభుత్వం మళ్లీ వస్తుందనే విషయం గురించి భయపడకుండా.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి." అని చంద్రబాబు పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు.

**స్వర్ణాంధ్ర విజన్ 2047కు సంపూర్ణ మద్దతు - ఫిక్కీ**

స్వర్ణాంధ్ర విజన్-2047ను సాకారం చేసేందుకు తమ వైపు నుంచి పూర్తి మద్దతు ఉంటుందని ఫిక్కి జాతీయ కార్యవర్గం వెల్లడించింది. విజయవాడలో నిర్వహించిన ఫిక్కి జాతీయ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. వివిధ కంపెనీల యాజమాన్యాలు ప్రతినిధులు సమావేశాన్కిఇ హాజరయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, పాలసీలు ఇండస్ట్రీ ఫ్రెండ్లీగా ఉంటున్నాయని ఫిక్కి ప్రతినిధులు తెలిపారు. ఎంఎస్ఎంఈల విషయంలో చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వంతీసుకుంటున్న చొరవకు ఫిక్కి అభినందనలు తెలిపింది. ఫిక్కీ నేతలు హర్షవర్ధన్ అగర్వాల్, ఎం ప్రభాకరరావు, అనంత గొయింకా, విజయశంకర్, జ్యోతి విజ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 26-06-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
శుక్ల పాడ్యమి మ. 1.29
ఆరుద్ర ఉ. 8.48
వర్జ్యం రా. 8.06-9.36
దు. ఉ. 10.00-10.52, 2) మ. 3.15-సా. 4.07
శుభసమయం: సా. 6.15-7.00
రాహుకాలం - మ. 1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వస్తు, వస్త్రా సేకరణ.

**వృషభం :** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. వాహనయోగం.

**మిథునం:** సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంతానంనకు నూతన అవకాశాలు.

**కర్కాటకం :** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**సింహం:** రాజకీయ, పారిశ్రామిక రంగాలలోనివారికి అనుకోని ఆహ్వానాలు అందుతాయి.

**కన్య :** వత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. స్వల్ప ధనలాభం.

**తుల :** సన్నిహితులనుండి కీలక సమాచారం అందుకొంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** రుణాలు తీరి ఊరటచెందుతారు. వాహనాలు, గృహాలు కొనుగోలుచేస్తారు.

**ధనుస్సు:** ఉద్యోగాలలో ఉన్నత హోదాలు పొందుతారు. ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది.

**మకరం:** రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాలవారికి ప్రభుత్వరంగాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**కుంభం:** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి సాధిస్తారు. పట్టింది బంగారంగా వుంటుంది.

**మీనం :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

>> జరుగుతోంది. మరోవైపు మన ప్రభుత్వం ఉండి ఉంటే, ఎంతెంత ప్రయోజనాలు అనేది చెప్పాలి. చంద్రబాబు మోసాలపై ప్రజలను చైతన్యం చేయాలి. చంద్రబాబు తానిచ్చిన హామీల రిబ్బన్ కూడా కట్ చేయకుండా, అన్నీ అమలు చేశామని చెబుతున్నాడు. ఎవరైనా ప్రశ్నిస్తే, నాలుక మందం అంటున్నాడు.
ఈరోజు ఇక్కడ ఒక కార్యక్రమం ప్రారంభం. చంద్రబాబు మ్యానిఫెస్టోలో ఏం చెప్పాడు? ఇప్పుడు ఎలా మోసం చేస్తున్నాడు? అన్నింటిపై గ్రామ గ్రామాన, తీసుకుపోయేదే ఈ కార్యక్రమం. దీని పేరు.. 'రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెసో'. అదే తెలుగులో.. చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తెస్తూ. ఎన్నికల ముందు చంద్రబాబు ఏమన్నాడు? జగన్ చేస్తున్నవే కాకుండా. అంతకు మించి ఇస్తానన్నాడు. జగన్‌కన్నా ఎక్కువ చేస్తానన్నాడు. ఆ మాటలు చెప్పడమే కాకుండా, ప్రతి ఇంటికి తన నాయకులు, కార్యకర్తలను పంపించి.. ఆ కుటుంబం వద్దనే వారు కూర్చుని, మిస్డ్ కాల్ ఇప్పించారు. దాంతో ఒటిపి వచ్చింది. దాన్ని ఎంటర్ చేయగానే, ఆ కుటుంబంలో ఎవరెవరికి ఏ పథకం వర్తిస్తుంది. దాని వల్ల ఎంతెంత వస్తుంది? అన్న వివరాలతో బాండ్ వస్తుంది. దానిపై ఏమని ఉంటుంది అంటే.. చంద్రబాబునాయుడు అనే నేను, మన రాష్ట్ర ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, త్రికరణ శుద్ధిగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. అంటూ ఆయన, పవన్‌కళ్యాణ్ ఇద్దరూ సంతకం చేశారు. ఇంకా ఏయే పథకాల ద్వారా ఆ ఇంటికి ఎంతెంత వస్తుంది.. అంటూ పథకాలు వివరించారు. తల్లికి వందనం కింద ఇంత, అన్నదాతా సుఖీభవ, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి.. ఈ పథకాల కింద మీరు అర్హులయ్యారు. మీకు 2024 జూన్ నుంచే ఆ మొత్తం అందుతుంది. అలా బాండ్లు ఇచ్చి, ప్రలోభాలు పెట్టి, పచ్చి మోసం చేశారు. అవన్నీ ఇప్పుడు ప్రజల్లో ప్రస్తావిస్తున్నాం. అందుకే ప్రజలంతా డిమాండ్ చేయాలి. మాకు జూన్ 2024 నుంచి ఇస్తామన్నావు. కానీ ఇవ్వలేదు. మాకు ఇంత బాకీ ఉన్నావు. మరి ఈ ఏడాది ఎప్పుడిస్తున్నావు? అంటూ ప్రజలు చంద్రబాబును నిలదీయాలి. అడగాలి.
ఒకవైపు అన్ని పథకాలు ఎగ్గొట్టిన చంద్రబాబు, మరోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. ప్రతి త్రైమాసికానికి ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్. ఆరు త్రైమాసికాలు పెండింగ్. అలా రూ.700 కోట్ల చొప్పున మొత్తం రూ.4200 కోట్లు. కానీ ఇచ్చింది కేవలం రూ.750 కోట్లు. వసతి దీవెన కింద ఏటా రూ.1100 చొప్పున రెండేళ్లకు రూ.2,200 కోట్లు. పెండింగ్. ఆరోగ్యశ్రీ నెలకు రూ.300 కోట్లు. అలా ఏడాదికి రూ.3,600 కోట్లు బకాయిలు. దీంతో నిరుపేదలకు పథకంలో వైద్య సేవలు అందడం లేదు. ఆరోగ్య ఆసరా లేనే లేదు. చేయూత, ఆసరా.. ఇలా ఏ పథకం లేదు. వ్యవసాయం తిరోగమనం. ఎక్కడా పంటలకు కనీస గిట్టుబాటు ధర లేదు. ఆర్బీకేలు నిర్వీర్యం అయిపోయాయి. ఉచిత పంటల బీమా లేదు. ఇన్‌పుట్ సబ్సిడీ లేనే లేదు. ప్రజా సమస్యలపై మనం పోరాడాలి. వారితో మమేకం కావాలి. ఎందుకంటే ఇది రాక్షస రాజ్యం. ప్రజలకు సమస్యలు పరిష్కారం కావడం లేదు. కలెక్టర్ల దగ్గరకు పోయినా, ప్రయోజనం ఉండడం లేదని అన్నారు.

# రూ.240కోట్లు లబ్ధి!

>> న్యాయస్థానాన్ని కోరారు. కాగా ఈ కేసు విచారణ నేడు(గురువారం)న్యాయస్థానంలో న్యాయమూర్తి చేపట్టనుండటంతో బెయిల్ అంశాలపై ఎలాంటి తీర్పు వస్తుందనేది ఉత్కంఠరేపుతోంది. ఇదిలా ఉండగా తిరుమలకు 2019 నుండి 2024 మేనెల వరకు నెయ్యి సరఫరాచేసేందుకు టెండర్లు పిలవడం, పాల్గొన్న సంస్థలు ఏవీ, ఎంతవరకు టెండర్లు దక్కించుకుని ఎంతకాలం సరఫరా చేశారు అనే వివరాలు రాబట్టారు. అసలు ఆవునెయ్యి సరషరా కిలో 319రూపాయలకు సరఫరా చేయడం కూడా నకిలీనెయ్యిగానే తేలింది. గత పాలకమండలి పెద్దలు, అధికారులు పాత్ర లేకుండా ఇంత నకిలీ తతంగం జరిగేదా అనే వ్యాఖ్యలు గుప్పుమంటున్నాయి. టిటిడికి నకిలీ నెయ్యి సరఫరా విషయంలో పూర్తి ఆధారాలతో సిబిఐ సిట్ కూడా ముందుకు కదులుతోంది. కీలక పాత్రధారులను గాక దేవునికి మోసం చేసి ఖజానాకు గండికొట్టిన అసలైన సూత్రధారులను పట్టుకునే దిశగా కూడా దర్యాప్తు వేగం పెంచారు. పవిత్రమైన లడ్డూలను కలుషితంచేసిన పాపంలో రానున్న రోజుల్లో ఎవరిని విచారణ చేయనున్నారనేది ఇప్పుడు ఆసక్తికర చర్చగా మారింది. ఈ కేసులో క్లైమాక్స్‌లో శిక్ష ఎవరికి పడనుందనేది త్వరలోనే తేలిపోనుంది. ఇప్పటికే తిరుమల లడ్డూల తయారీలో కల్తీనెయ్యి వాడారనే కేసులో గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ల్యాబ్ పరీక్షల నివేదికల ఆధారంగా జంతువుల కొవ్వునూనె కల్తీజరిగిందనే నిర్ధారణకు వచ్చారు. నెయ్యినాణ్యతలేదని దీనివల్లే లడ్డూలు నాణ్యతలేదని 2022లోనే కీలకంగా సమాచారం ఇచ్చిన పోటు వైష్ణవబ్రాహ్మణులు సాక్ష్యాలను సిట్ బృందం సేకరించింది. నకిలీ నెయ్యి సరఫరా జరగడంపై కీలకంగా ముగ్గురు పెద్దలకు తాజాగా నోటీసులు ఇవ్వనున్నారనేది సమాచారం. గతంలోనే నకిలీనెయ్యిపై ఆయా డెయిరీలు కూడా అసలు విషయాన్ని కప్పిపుచ్చుకునే రీతిలో వ్యవహరించిన ఘటనలను ఇప్పుడు టిటిడి వర్గాలు చర్చించుకుంటున్నాయి.

26-06Pg3exHMNWJQEPV.qxd:26-06Pg3exHMNWJQEPV.qxd 01/01/01 8:55 AM Page 1





## రాజధానిలో అదనపు భూ సమీకరణకు జులైలో నోటిఫికేషన్

- మంత్రి నారాయణ

**విజయవాడ.జూన్25, ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి అవసరాలకు అదనపు భూ సమీకరణకు సంబంధించి వచ్చే నెలాఖరులో సీఆర్‌డీఏ నోటిఫికేషన్ ఇస్తుందని రాష్ట్ర పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. భూ సమీకరణపై 2015లో జారీ చేసిన నిబంధనలే అమలు చేసేలా మంత్రివర్గం ఆమోదించిందని చెప్పారు. మంత్రివర్గ సమావేశం అనంతరం సచివాలయంలో నారాయణ విలేకర్లతో మాట్లాడారు.'రాజధాని అమరావతిలో 5వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం, 2,300 ఎకరాల్లో స్మార్ట్ పరిశ్రమలు,మరో 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు 10వేల ఎకరాలు అవసరం.ఇందుకోసం రైతుల నుంచి 45 వేల ఎకరాలు సమీకరించాలి. అభివృద్ధి చేసిన ప్లాట్లు రైతులకు తిరిగి ఇవ్వాల్సి ఉన్నందున ఎక్కువ భూమి అవసరమవుతుంది. ఇందుకు సంబంధించి రాజధాని ప్రాంతం లోని ఎంఎల్‌ఏలు,కలెక్టర్‌లకు ఆదేశాలిచ్చాం.గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించాం. రాజధానిలోని 29 గ్రామాలను ఆనుకొని అటు జాతీయ రహదారి,ఇటు కృష్ణానది ఇవతల,ఔటర్ రింగ్ రోడ్డు మధ్యలో అదనంగా భూ సమీకరణ చేయనున్నాం. 2014-19లో సమీకరించిన భూములకు సంబంధించి రైతులకు 98% ప్లాట్లు కేటాయించాం. మిగిలిన 2% అన్నదమ్ముల మధ్య గొడవలు,కోర్టు కేసుల కారణంగా పెండింగ్‌లో ఉన్నాయి'అని వివరించారు. రాజధానిలో 2018లో ఏడాది వ్యవధిలో 360 కి.మీ.ట్రంక్ రోడ్లు,లే అవుట్ల రోడ్లు,ఐకానిక్ భవనాల పనులకు రూ.9వేల కోట్లు ఖర్చుచేశాం. మరో ఏడాదిన్నరలో ప్రాజెక్టు పూర్తయ్యేది.వైకాపా ప్రభుత్వం ఆడిన మూడు ముక్కలాటతో మొత్తం నాశనమైంది.

## హైదరాబాద్-విజయవాడ హైవే గొల్లపూడి వరకు విస్తరించండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి



చంద్రబాబు, నితిన్‌గడ్కరి

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ హైవే-65ను గొల్లపూడి వరకు విస్తరించాలని సిఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. విస్తరణను కంచికచెర్ల వరకే పరిమితం చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) భావిస్తోంది. సలహా సంస్థ రూపొందించిన ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్‌లో అమరావతి ఓఆర్‌ఆర్ వరకు విస్తరణ చాలని ప్రతిపాదించడంతో ఈ మేరకే ఎన్‌హెచ్‌ఏఐ పరిశీలిస్తోంది. దీనిపై సిఎం చంద్రబాబు స్పందించారు. గతంలో ఉన్న ప్రతిపాదన ప్రకారం గొల్లపూడి వద్ద విజయవాడ బైపాస్ వరకు హైవేను ఆరు వరుసలుగా విస్తరించాల్సిందేనని కోరుతూ కేంద్ర రవాణా,జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి తాజాగా లేఖ రాశారు. ఈ హైవే హైదరాబాద్-విజయవాడ కనెక్టివిటీకి సంబంధించినదని,గొల్లపూడి వరకు విస్తరిస్తేనే ప్రయోజనం ఉంటుందని తెలిపారు.హైదరాబాద్ నుంచి మల్కాపూర్ వరకు 40కి.మీ.ఆరు వరుసలుగా ఉంది. మల్కాపూర్ నుంచి విజయవాడ శివారు గొల్లపూడి వద్ద పశ్చిమ బైపాస్ వరకు 226 కి.మీ.ఇప్పుడున్న నాలుగు వరుసల స్థానంలో ఆరు వరుసలుగా విస్తరించేలా గతంలోనే ప్రతిపాదన ఉంది. గత ఏడాది వరకు ఈ హైవే గుత్తేదారుగా ఉన్న జీఎంఆర్ సంస్థతో ఎన్‌హెచ్‌ఏఐకి వివాదాలు నెలకొనడం,కోర్టు కేసుల కారణంగా విస్తరించలేదు. గత ఏడాది జీఎంఆర్ సంస్థ కాంట్రాక్ట్ గడువు ముగియడంతో విస్తరణకు సిద్ధమయ్యారు.ప 226 కి.మీ. ఆరు వరుసలుగా విస్తరించేందుకు రూ.8,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. దీనికి డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. గొల్లపూడి వరకు కాకుండా అమరావతి ఔటర్ రింగ్ క్రాస్ అయ్యే కంచికచర్ల వరకే విస్తరించే ప్రతిపాదనను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెరపైకి తీసుకొచ్చారు. దీనివల్ల మొత్తం 226 కి.మీ బదులు 198 కి.మీ మాత్రమే విస్తరిస్తారు. కంచికచర్ల నుండి గొల్లపూడి వరకు 28 కి.మీ. ఇప్పుడున్నట్లు నాలుగు వరుసలుగానే ఉంటుంది. దీనిపై ఎన్టీఆర్ జిల్లా ప్రజా ప్రతినిధులు అభ్యంతరం తెలిపారు. ఎన్టీఆర్ కలెక్టర్ వద్ద జరిగిన సమావేశంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను నేతలు ప్రశ్నించారు. ఈ విషయం సిఎం చంద్రబాబు దృష్టికి వెళ్ళడంతో ఆయన తాజాగా గడ్కరీకి లేఖ రాసి...గొల్లపూడి వరకు ఆరు వరుసలు చేయాల్సిందేనని కోరారు. విజయవాడ-మచిలీపట్నం (బందరు) హైవేని నాలుగు నుంచి ఆరు వరుసలుగా విస్తరించే విషయంలోనూ ఎన్‌హెచ్‌ఏఐ వింత వాదన తెరపైకి తెచ్చింది. విజయవాడ బెంజి సర్కిల్ నుంచి మచిలీపట్నం వరకు 65 కి.మీ. ఉండగా, ఇందులో కానూరి నుంచి మచిలీపట్నం వరకు 61 కి.మీ విస్తరించేలా తొలుత ప్రతిపాదన ఉంది. బెంజి సర్కిల్ నుంచి కానూరు వరకు ఎక్కడ భవనాలు ఉండటం,అక్కడ ఈ ఎన్‌హెచ్‌కు సేకరించిన భూమి వెడల్పు (ఆర్‌ఓడబ్ల్యూ)30 మీటర్లే ఉండటంతో...ఈ నాలుగు కి.మీ.ఆరు వరుసలు చేయడం సాధ్యం కాదని తేల్చారు. కానూరు నుంచి ఆర్‌ఓడబ్ల్యూ 60 మీటర్ల మేరకు ఉంది.

## తిరుమల సమాచారం

### కొండపై మోస్తరుగా భక్తులు

**తిరుమల,జూన్ 25 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం గత ఇరవైరోజులుగా భక్తులతో కిటకిటలాడిన తిరుమల బుధవారం ఉదయానికి కొంత మేరకు తగ్గింది. ఉదయం 6గంటలకు వైకుంఠమ్‌లోని 21కంపార్టుమెంట్లలో భక్తులు దర్శనానికి వేచివున్నారు. సర్వదర్శనానికి 14గంటల సమయం నిరీక్షిస్తున్నారు.



సాయంత్రానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలోని కంపార్టుమెంట్లు నిండాయి. భక్తులకు సంతోషకరమైన మహాలఘు దర్శనం చేయించేలా అధికారులు ఏర్పాట్లుచేశారు. క్యూలైన్లలో భక్తులకు సకల సౌకర్యాలు అందుతున్నాయి. సాయంత్రం వరకు 41వేలమంది భక్తులు శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. ఎస్ఇడి దర్శనాలకు నాలుగు గంటల సమయం, టైమ్‌స్లాట్ దర్శనాలకు మూడుగంటల సమయం పడుతుంది.

### అందరికీ మంచి జరగాలి : ఎమ్మెల్సీదువ్వాడ

**తిరుమల,జూన్ 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం సంతృప్తిగా చేసుకున్నామని, స్వామివారిఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ఎంఎల్‌సి దువ్వాడ శ్రీనివాస్ ఆకాంక్షించారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన దువ్వాడ మాదురితో కలసి స్వామిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## ఎమర్జెన్సీ చీకటిరోజులు గుర్తుంచుకునేలా యువతలో అవగాహన : బిజెపి



**తిరుపతి,జూన్ 25ప్రభాతవార్తప్రతినిధి:** మన రాజ్యాంగాన్ని బలహీన పరిచి దేశంలో అత్యవసర పరిస్థితి విధించడంఒక చీకటి అధ్యాయమని, దీన్ని మనం ఎప్పటికీ మరచిపోలేమని బిజెపి కేరళ రాష్ట్ర కో ఇన్‌ఛార్జి అపరాజిత సారంగి తెలిపారు. 1975లో అప్పటి అత్యవసర పరిస్థితిని వ్యతిరేకించిన వ్యక్తులను జైల్లో పెట్టిన అదే పార్టీ ఇప్పుడు ఏవేవో మాట్లాడుతుందన్నారు.దేశంలో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జాన్సీ విధించి 50ఏళ్ళు పూర్తయిన సందర్భంగా బుధవారం తిరుపతిలో ఓ సమావేశం హాలులో తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్రనేత భానుప్రకాశ్‌రెడ్డి, జల్లిమధుసూదన్, జిల్లా సాంస్కృతిక విభాగం గుండాల గోపీనాధరెడ్డి, నాయకులు సుబ్రమణ్యంయాదవ్, మల్లారపురవిప్రసాద్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి తదితరులతో కలసి అపరాజిత సారంగి మేధావుల సదస్సులో పాల్గొన్నారు. ఆనాటి పరిస్థితులు ప్రదర్శనను తిలకించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనంపాటించారు. చీకటి అధ్యాయాన్ని ఎవరూ మరచిపోలేరన్నారు.

## నకిలీ ఇ స్టాంప్స్ రాకెట్ పై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలి

### ఎస్సార్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యశ్వంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సార్సీ ఇన్ఫ్రా డెవలపర్స్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యశ్వంత్

**అనంతపురం, జూన్ 25, (ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం జిల్లా కళ్యాణ్ దుర్గం లో నకిలీ ఈ స్టాంపులు వ్యవహారం బయటపడిందని, ఇలాంటి నకిలీ స్టాంపుల రాకెట్ పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కళ్యాణ్ దుర్గం శాసనసభ్యుడు అమిలినేని సురేంద్రబాబు తనయుడు, ఎస్సార్ ఇన్ప్రా డెవలపర్స్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అమిలినేని యశ్వంత్ విజ్ఞప్తి చేశారు. నూరు రూపాయల ఈ-స్టాంపులను లక్ష రూపాయల విలువ గల ఈ స్టాంపులుగా మార్ఫింగ్ చేసి ఈ-స్టాంపు లను అమ్మకాలు చేసిన ముఠా చర్యలు కళ్యాణ్ దుర్గం లో బయటపడ్డాయని, ఇదేవిధంగా రాష్ట్రంలో జరిగి ఉండే అవకాశం ఉందన్నారు. ఈ స్టాంపు వ్యవహారంలో రాకెట్ చర్యలను ఎదుర్కొనే విధంగా సిస్టంలో లోపాలుంటే సరిచేయాలని ఆయన రాష్ట్ర ఉన్నతాధికారులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.బుధవారం అనంతపూర్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్సార్ ఇన్ప్రా డెవలపర్స్ లిమిటెడ్ ఏజీఎం సతీష్, సంస్థ ఆడిటర్ బాలాజీ తో కలిసి అమిలినేని యశ్వంత్ మాట్లాడారు. ఎస్ఆర్సి ఇన్ప్రా డెవలపర్స్ సంస్థ నిర్మాణ రంగంలో 27 ఏళ్ల నుంచి పనిచేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుందని, ఎక్కడ మచ్చ లేదని ఆయన వెల్లడించారు. వాస్తవాలు తెలుసుకోకుండా తమ సంస్థపై అనవసరంగా ఆరోపణ చేసినా, సంస్థకు చెడ్డపేరు వచ్చే విధంగా ఎవరు వ్యవహరించినా న్యాయపరంగా చర్యలు తీసుకుంటావని ఆయన వెల్లడించారు. ఈ స్టాంపుల వ్యవహారంలో మా సంస్థ ఎక్కడ తప్పులు చేయలేదని, బ్యాంకుల ద్వారా డబ్బులు చెల్లించిన తర్వాతే ఈ స్టాంపులు కొనుగోలు చేశామని, డబ్బులు చెల్లించకపోతే తమది తప్పు అవుతుందని ఆయన వెల్లడించారు. తమ సంస్థ తరఫున బ్యాంకు రుణాలు తదితర వాటికోసం కళ్యాణ్ దుర్గం లో ఎర్రప్ప సతీమణి ఏజెంట్గా ఉన్న సంస్థ వద్ద ఈ ఈ స్టాంపులను 2023 జనవరి నుంచి కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆ సంస్థ తమకు ఈ స్టాంపులు స్థానంలో నకిలీ ఈ స్టాంపులు అమ్మినట్లు ఇటీవల సంస్థ ఆడిట్ రిపోర్ట్ లో తేలిందని, వెంటనే అందుకు బాధ లేని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. నకిలీ ఈ స్టాంపులు వ్యవహారంలో మేమే పోలీసులకు ఫిర్యాదు చేసి రాకెట్ను బయటికి లాగితే ఈ విషయంలో మాదే తప్పు ఉందని అవాస్తవాలతో ఆరోపణ చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. వందల కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్న మా సంస్థ చిన్న మొత్తాలలో ఉన్న ఈ స్టాంపులను నకిలీ ఎందుకు తీసుకుంటున్నది? బ్యాంకులు, అధికారులు, ఇతర కాంట్రాక్టర్ల వద్ద మేము ఎలా తల ఎత్తుకొని నిలబడతామని ఆయన ప్రశ్నించారు. అందుకే నకిలీ ఈ స్టాంప్స్ వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేయాలని తాము కోరుకున్నట్లు ఆయన వెల్లడించారు. 463 లో 19 నకిలీ ఈ స్టాంపులు అని గుర్తించాం ఆడిటర్ బాలాజీ వెల్లడి ఎస్సార్ ఇన్ప్రా డెవలపర్స్ లిమిటెడ్ సంస్థ తరఫున అనంతపురం, కళ్యాణ్ దుర్గం, సింగనమల, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పనులు చేసేందుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే విషయంలో గత మూడేళ్ల కాలంలో కళ్యాణ్ దుర్గం లోని ఎర్రప్ప, ఆయన సతీమణి నిర్వహిస్తున్న ఏజెన్సీ నుంచి 463 ఈ స్టాంప్స్ తీసుకున్నామని అందులో 19 ఈ స్టాంప్స్ లు నకిలీవని తమ ఆడిట్లో తేలినట్లు ఎస్ఆర్సి ఇన్ప్రా డెవలపర్స్ సంస్థ ఆడిటర్ బాలాజీ వెల్లడించారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

**కోవూరు (నెల్లూరు), జూన్ 25, ప్రభాతవార్త :** వేసి ఉన్న గేటు లోంచి దూరివచ్చిన ఎస్.కె హుస్సేన్ భాష (68) రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పడుగుపాడు రైల్వే గేట్ ప్రాంతంలో జన శతాబ్ది రైలు ఢీకొనడంతో ఈ పరిస్థితిచోటు చేసుకుంది. పెద్ద పడుగుపాడు ప్రాంతానికి చెందిన ఎస్కె హుస్సేన్ భాష స్థానిక బజాజ్ సెంటర్లో మంచాలు అల్లుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పని ముగించుకొని మోపెడ్ లో ఇంటికి వెళుతుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

## పి4లో మార్గదర్శుల సంఖ్య పెంచాలి

- మంచి ఫలితాలు చూపిన మార్గదర్శులకు గుర్తింపు, గౌరవం

: పి4పై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు..

**విజయవాడ, జూన్ 25,ప్రభాతవార్తప్రతినిధి:** జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం తీసుకువచ్చిన పీ4 విధానంపై అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. మార్గదర్శుల గుర్తింపు, బంగారు కుటుంబాల ఎంపిక అంశాలపై సిఎం సమీక్షించారు. పీ4 విధానంలో మేలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 19,15,771 బంగారు కుటుంబాలను గుర్తించగా వారిలో ఇప్పటి వరకు 87,395 కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారని అధికారులు వివరించారు. సమాజంలో చాలామంది ఏదో ఒక రూపంలో పేదలకు సాయం చేసేందుకు ఆసక్తిగా ఉన్నారని, అలాంటి వారికి పీ4ను వేదికగా మార్చాలని సిఎం అన్నారు. మార్గదర్శకులుగా ఉండేవారిని సంప్రదించేందుకు...బంగారు కుటుంబాలను వారితో అనుసంధానం చేసేందుకు మరింత ఎక్కువ దృష్టిపెట్టాలని సిఎం సూచించారు. ఈ కార్యక్రమాన్ని నిత్యం మోనిటరింగ్ చేసేందుకు కాల్ సెంటర్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. మార్గదర్శకులుగా ఉండాలనుకునే వారికి అవసరమైన సమాచారాన్ని, గైడెన్స్ ఇచ్చేలా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సిఎం సూచించారు. మార్గదర్శులతో బంగారు కుటుంబాలను అనుసంధానించిన తరవాత.... అంతకుముందు వారి పరిస్థితి, బంగారు కుటుంబంగా ఎంపికైన తరువాత వారి జీవన ప్రమాణాలను తెలుసుకునేందుకు సర్వేలను కూడా నిర్వహించాలని సిఎం సూచించారు. కార్యక్రమం అమలుపై విధిగా ఆడిటింగ్ నిర్వహించడం, మూడు నెలలకు ఒకసారి సమీక్షించడం, శ4 ప్రభావాన్ని నివేదకల ద్వారా ఎప్పటికప్పుడు మార్గదర్శకులకు కూడా అందించాలన్నారు. పారిశ్రామిక వేత్తలు, ఎన్ఐఆర్‌లు, సెలబ్రిటీలు, ఉన్నత వర్గాలవారితో ప్రత్యేక కార్యక్రమాలు పీ4 కాన్సెప్ట్‌ను వివరించి...వారిని మార్గదర్శులుగా ఉండేందుకు ఆహ్వానించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శుల భాగస్వామ్యం పెంచేందుకు టాప్ 100 కంపెనీలకు చెందిన సీఈఓలు, సివోవోలు, సీఎఫ్ఓ, ఎండిలు, చైర్మన్‌లతో నేరుగా తానే మాట్లాడి పిలుపునిస్తానని సిఎం అన్నారు. దీంతో పాటు దేశవిదేశాల్లో ఉన్న తెలుగువారితో వర్చువల్ విధానంలో సమావేశమై కార్యక్రమ ప్రాధాన్యత, ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించి మార్గదర్శులుగా ముందుకొచ్చేందుకు వారిని ఆహ్వానిస్తానని అన్నారు. ఎన్ఆర్ఐలను పీ4 అడ్వైజర్లుగా పెట్టి....ఎన్ఆర్ఐలను మార్గదర్శకులుగా చేర్చేందుకు ప్రోత్సహించాలనే ఆలోచనతో ఉన్నట్లు సిఎం తెలిపారు.

## ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒక విద్యార్థికి.. ఇద్దరు ఉపాధ్యాయులు

**ఆత్రేయపురం.జూన్ 25,(ప్రభాత వార్త)** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు నేడు వెల వెలబోతున్నాయి.జూన్ 1వ తేదీన తల్లికి వందనం ఒక ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి వేయడం జరిగింది. మరో ప్రక్క స్కూల్ యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగ్, మధ్యాహ్నం భోజనం ఎంతో ఆధునికరణతో తరగతిగదులు ఇన్ని సౌకర్యాలు ఉన్నా విద్యార్థుల రాక కోసం ఎదురుచూస్తున్నాయి. వివరాల్లోకి వెళితే ఆత్రేయపురం మండలం లొల్ల బీసీ కాలనీలో గల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక 1 నెంబరు పాఠశాలలో ఒకటి నుండి రెండో తరగతి వరకు విద్యాబోధన చేస్తున్నా విద్యార్థులు లేక పోవడం విశేషం. ఇద్దరు టీచర్లు ఉండగా ఇద్దరూ కలిపి ఒక విద్యార్థికి చదువు చెబుతుండడం విశేషం. అలాగే తాడిపూడి ఎస్సీ కాలనీలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండో నాలుగో తరగతి చదివే ఇద్దరు మాత్రమే చదువుతున్నారు. వారికి ఒకరే ఉపాధ్యాయులు. కానీ కొన్ని పాఠశాలలో విద్యార్థులు ఉన్న ఉపాధ్యాయులు లేరు. ఉపాధ్యాయులు ఉన్నచోట విద్యార్థులు లేరు ఎందుకు ప్రభుత్వ పాఠశాలకు ఎన్నో మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నా విద్యార్థులు రావడంలేదంటే.. ఉపాధ్యాయులకు చదువు చెప్పక రావడంలేదా.. లేదంటే ప్రైవేట్ స్కూల్ లో పిల్లలను చదివించడానికి ప్రజలు మొగ్గుచూపుతున్నారా. అన్నది దేవుడికే ఎరుక... అంకంపాలెం గ్రామ శివారు పాటి చెరువుదగ్గర స్కూలు ఉన్నప్పటికీ అది శిదిలావస్థకు చేరడంతో గత వైసీపీ ప్రభుత్వం లో కూల్చివేసి నూతన భవనం నాడు నేడు10లక్షలతో నూతనంగా భవనం చేపట్టారు. అక్కడ విద్యార్థులను కొంతకాలం బిసి కమ్యూనిటీ భవనలో చదువులు నిర్వహించేవారు.. కొంతకాలం నిర్వహించకా విద్యారలు లేక పూర్తిగా ముసివేశారు. అలాగే తాడపూడి ప్రాథమిక పాఠశాల వైకాపా హయాంలో నాడు నేడు లో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టిన పాఠశాల భవనం నిర్మాణం పనులు నిలిచిపోవడంతో పక్కన ఉన్న కమ్యూనిటీ హాల్లో భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. దీంట్లో ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఒకప్పుడు ఈ స్కూల్లో 15 నుండి 20 మంది దాకా చదివే వారు. జూన్ 14న ఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్ అయిన తర్వాత కొన్ని పాఠశాలల్లో రిలీవర్ రాలేదన్న కారణంగా ఉపాధ్యాయులని బదిలీ అయిన ప్రాంతాలకు రిలీవ్ చేయలేదు. దాని తర్వాత ఆ స్థానాలలో కొత్తగా ఎం టి ఎస్ ఉపాధ్యాయరాలు వచ్చినా లొల్ల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల 1 రెగ్యులర్ ఉపాధ్యాయరాలుతో పాటు ఆ ఇద్దరు టీచర్లు అదే పాఠశాలలో కొనసాగుతున్నారు.ఇది అధికారులు నిరక్ష ్యల్ల గా చెప్పవచ్చు. వల్ల ఒకచోట ఉపాధ్యాయుల అధికంగానూ విద్యార్థులు తక్కువగాను మరొకచోట విద్యార్థులు అధికంగాను ఉపాధ్యాయులు తక్కువగాను ఉన్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు ఉపాధ్యాయులను విద్యార్థుల సంఖ్య ఉన్న ప్రాంతాలకు సర్దుబాటు చేయాలి.

## నిరంతర శ్రమతోనే నిర్దేశిత లక్ష్యసాధన

- టికెట్ చెకింగ్ సిబ్బందికి మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులు ప్రదానం చేసిన డిఆర్ఎం గుప్తా



డిఆర్ఎం గుప్తాచే అవార్డులు తీసుకుంటున్న టిక్కెట్ చెకింగ్ సిబ్బంది

**గుంతకల్లు రైల్వే, జూన్ 25,ప్రభాతవార్త** నిరంతర శ్రమ అంకితభావంతో పనిచేయడం ద్వారా మాత్రమే నిర్దేశిత లక్ష్యాలను సాధించగలమని గుంతకల్లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. స్థానిక ఆర్ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన మ్యాన్ ఆఫ్ ద మంథ్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గత ఏడాది నవంబరు నుంచి ఈ ఏడాది మార్చి నాటికి డివిజన్ పరిధిలోని స్క్వాడ్ విభాగంలో తిరుపతి,రేణిగుంట, కడప, గుంతకల్లు, రాయచూరు స్క్వాడ్ డిపోలలో పనిచేస్తున్న టిక్కెట్ చెకింగ్ సిబ్బంది, డివిజనల్ స్క్వాడ్ ఓన్నూరమ్మలతో పాటు స్లీపర్ విభాగంలో తిరుపతి,రేణిగుంట,గుంతకల్లు,ధర్మవరం స్లీపర్ డిపోలలో పనిచేస్తున్న మొత్తం 31మంది టిక్కెట్ చెకింగ్ సిబ్బందికి డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అవార్డులను అందచేశారు. కార్యక్రమంలో సీనియర్ డిసిఎం మనోజ్,ఏసిఎం ధనుంజయ కుమార్ సింగ్,సిటిఐలు, సిసిఐలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం : ముఖ్యమంత్రి చంద్రబాబు

- నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ సమీక్షలో సిఎం

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా రాష్ట్రంలో నైపుణ్య శిక్షణ అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉన్నత విద్యలో తీసుకురావాల్సిన కొత్త కోర్సులపై అధ్యయనం చేయాలని సూచించారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధి శాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 'కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగించి రాష్ట్రం,దేశం,ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగావకాశాలు ఎక్కడ ఉనానయో తెలుసుకొని నైపుణ్యం పోర్టల్‌లో పొందుపర్చాలి. యువతకు ఈ సమాచారం అందేలా చూడాలి. యువత తమ వివరాలు నమోదు చేయగానే ఆటోమేటిక్‌గా రెజ్యూమే వచ్చేలా పోర్టల్‌ను డిజైన్ చేయాలి. ఇప్పటికే రాష్ట్రంలో రూ.9.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందం చేసుకున్నాం. వీటి ద్వారా 8.5 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఈ పెట్టుబడులకు అనుగుణంగా ఉద్యోగాలు సాధించేలా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. ఐటీ కోర్సులు చేసిన విద్యార్థుల నైపుణ్యాలను సైతం అంచనా వేయాలి' అని సూచించారు.'ఏపీ యువతకు గ్లోబల్ స్థాయిలో ఉద్యోగాలు లభించే లక్ష్యంతో పని చేయాలి. జర్మనీ,ఇటలీ,సింగపూర్ సహా వేర్వేరు దేశాల్లో వైద్యారోగ్యం,నిర్మాణం,పర్యాటకం,ఐటీ,లాజిస్టిక్స్,ఉత్పత్తి రంగాల్లో ఉన్న విస్తృతమైన అవకాశాలు దక్కించుకునేందుకు విదేశీ భాషా నైపుణ్యాలను పెంచాలి. ఆయా భాషల్లో శిక్షణ ఇచ్చేందుకు ఆన్‌లైన్,ఆన్‌లైన్ ప్రత్యామ్నాయాలను పరిశీలించాలి. ఆంగ్లంతో పాటు విదేశీ భాషల విశ్వవిద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో క్లస్టర్ల వారీగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ చేపడుతున్నట్లు ముఖ్యమంత్రికి మంత్రి నారా లోకేష్ వివరించారు. రాష్ట్రంలో ఐదు క్లస్టర్లతో నైపుణ్యాలు అందించేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. నైపుణ్య శిక్షణ,ఉద్యోగాల కల్పనలో టోనీ బ్లెయిర్ ఫౌండేషన్‌తో కలిసి ఏపీ పనిచేస్తోందన్నారు.ఐటీఐ,పాలిటెక్నిక్‌లలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజక వర్గాల్లో 1,164 ఉద్యోగ మేళాలు నిర్వహించగా....ఇప్పటి వరకు 61,991 మందికి ఉద్యోగాలు లభించినట్లు లోకేష్ వివరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన వారిలో 74,834 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు.

## కృష్ణా గోదావరి జలాల్లో రాష్ట్ర ప్రజల హక్కుల కోసం పోరాటం

- గోదావరి బనకచెర్ల పథకాన్ని విరమించుకోండి: ఎబి వెంకటేశ్వరరావు

**విజయవాడ, జూన్ 25, ప్రభాతవార్త :** పోలవరం బనకచర్ల అనే ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనగా, వాస్తవానికొస్తే కెసిఆర్ - జగన్ - మెగా కృష్ణారెడ్డి బుర్రల్లో ఉన్నప్పటికి ముందుకు వచ్చి దాన్ని అత్యంత వేగంగా కేంద్ర జల సంగంతోఆమోదింపచేసుకోవాలని, కేంద్ర ఆర్థిక సాయంతో నిర్మించాలని అంటూ పరుగులెత్తుతున్న నేపథ్యంలో ఇది తెలంగాణలో రాజకీయ పార్టీల మధ్య ఒక ఫుట్‌బాల్‌గా మారింది. దీనిమీద తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను ఈ మధ్యనే విన్నాం. అసలీ బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ అవసరాలకు ప్రయోజనాలకు కృష్ణాజాలాల్లో రాష్ట్ర వాటా పరిరక్షణకు అనుగునంగా ఉన్నదా ! లేదా ! అని ప్రశ్నించుకోవాలి. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని కేవలం కాంట్రాక్టర్లు రాజకీయ నాయకులకు లబ్ధి చేకూరుస్తూ రాష్టానికి ఒక గుదిబండలా మారనున్నదని మా అభిప్రాయం. ఉమ్మడి రాష్ట్రంలో బచావత్ ట్రిబ్యునల్, తర్వాత బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ రెండు కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 800టిఎంసిల పునరుత్పత్తి జలాలతో కలిపి 811 కృష నికర జలాలని కేటాయించాయి. రాష్ట్రం విడిపోకముందు ఇందులో 512 టిఎంసి ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులకు 299టిఎంసి తెలంగాణాలో ఉన్న ప్రాజెక్టులకు వినియోగంలో ఉండేవి. విభజన తర్వాత ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు ఉన్న ఆ జాబితాను మొదటి అపెక్స్ కౌన్సిల్ కేంద్ర జలశక్తి మంత్రి, ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. నాటి ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, కెసిఆర్ మినిట్స్ పై సంతకాలు చేశారు. కానీ తర్వాత కాలంలోదాన్ని తాత్కాలిక ఒప్పందమని కెసిఆర్ వక్రీకరించే ప్రయత్నం చేస్తూ వచ్చారు. రాజకీయ కారణాలతో తెలంగాణ ఎన్నికలకు కాస్త ముందు కేంద్రప్రభుత్వం తెలంగాణ లేవనెత్తిన నీటి వివాదంపై బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ గడువు పొడిగించి ఆ పని అప్పగించింది. ప్రాజెక్టుల వారీగా ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేసిందా లేదా తేల్చి రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదానికి పరిష్కారం చూపెట్టాలని ఆదేశించింది.



సమావేశంలో మాట్లాడుతున్న విజయవాడ ఆలోచనాపరుల ప్రతినిధులు ఎబి వెంకటేశ్వరరావు

## వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

### ప్రియుడితో భర్తను చంపించిన భార్య - స్క్రూడ్రైవర్‌తో పొడిచి హత్య

**అనంతపురం, జూన్ 25, (ప్రభాతవార్త బ్యూరో)** అనంతపురం నగర సమీపంలో బుధవారం జరిగిన సురేష్ బాబు దారుణ హత్య కేసులో నిందితులను ఆరు గంటల్లోపు అనంతపురం రూరల్ పోలీసులు పట్టుకున్నారు. అనంతపురం రూరల్ డిఎస్పి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు నిందితులను పట్టుకొని కేసును చేయించడంతో జిల్లా పోలీసు అధికారులు అభినందిస్తున్నారు. బుధవారం ఉదయం రాచనాపల్లి సమీపంలో కుమ్మర సురేష్ బాబు దారుణ హత్యకు గురై కనిపించాడు. దీనిపై వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి... సురేష్ బాబు భార్య అనితను, ఫక్రుద్దీన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కళ్యాణదుర్గం రోడ్ లో సురేష్ బాబు, అనిత హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే రెండు నెలల క్రితం అనితకు ఫక్రుద్దీన్ అనే ఒక పండ్ల వ్యాపారితో పరిచమైంది. అది వివాహేతర సంబంధం గా మారింది. భర్తకుఅనుమానం రావడంతో అనితను వేధించసాగాడు.

వార్త

పోగొట్టుకున్న ధనాన్ని తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ పోగొట్టుకున్న కాలాన్ని తిరిగి సంపాదించలేం. కనుక ధనం కన్నా కాలం విలువైనది.

-సైరన్

# ‘అణు’వంత రహస్యం!

ఏలాగోలా యుద్ధం ముగిసింది కాని వాటి తాలూకు సందేహాలు ఇంకా ఉండనే ఉన్నాయి. అది తాత్కాలికమా, శాశ్వతమా అన్న విషయాల్లో ప్రేక్షకులు, వీక్షకులు ఎటూ తేల్చుకోలేకపోవచ్చు. అసలేం జరిగింది అన్న అంశాలపై లోతు విషయాలు ఆయా దేశాలకే తెలుసు తప్ప మరొకరికి తెలుసుకోవడం సాధ్యం కాదు. కొండమాళిగలో ఉన్న 408 కెజిల యురేనియం ఎక్కడికి పోయింది? అన్న ఊహాగానాలే తప్ప అసలుసిసలు వివరాలు బయటపడలేదు. దీని విషయంలో ఇఆరనన అత్యంత జాగరూకత వహించినట్లేఉంది. లేకుంటే ఈ పాటికి ‘యురేనియం పంచాయతి’ పెద్దఎత్తున జరిగేఉండాలి. ఎవరి వ్యూహాలతో వారు ముందుకుదిగినా ఎవరు నెగ్గారు? ఎవరు తగ్గారు? అనే విషయాలను క్రోడీకరించుకోవాల్సి వస్తే కష్టనష్టాలు ఇరువురికీ సమపాళ్లే. కానీ ఇరాన్‌లో దుర్భేద్యమైన ‘ఫోర్డో’ అణు తయారీ కేంద్రంలోపలి చిదంబర రహస్యమే ఎవరికీ అంతుబట్టడం లేదు. ప్రస్తుతం జరిగింది 12 రోజుల యుద్ధానికి తాత్కాలిక ముగింపు మాత్రమే. ఇప్పటికే ప్రపంచంలో రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్- గాజా యుద్ధాలతో సతమతమవుతుండగా మధ్యలో భారత్,పాక్ యుద్ధం చెలరేగి విరామ చెప్పుకొంది సరికదా! ఇరాన్ ఇజ్రాయెల్ దేశాలమధ్య అణు సంబంధిత విరోధం కలిగి యుద్ధాన్ని ఓ స్థాయికి తీసుకెళ్లాయి. అమెరికా ఖతార్‌ల మధ్యవర్తిత్వంలో కాల్పుల విరమణ ఒప్పందంతో కొంత వరకు పశ్చిమాసియా శాంతించినట్లే. అలా అనివారు అదే మాటమీద నిలబడతారని చెప్పలేం. ఈ యుద్ధంలో ‘ఆపరేషన్ రైజింగ్ లయన్’ పేరిట ఇరాన్‌పై ఇజ్రాయెల్‌కు చెందిన 200 యుద్ధవిమానాలు దాడులు చేశాయి. ఇరాన్ అణు కేంద్రాలతోపాటు యురేనియం కన్వర్షన్ ప్లాంట్లు, క్షిపణి అభివృద్ధి కేంద్రాలు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జిసి) కేంద్రాలను ఇజ్రాయెల్ సమూలంగా నాశనం చేసింది. ఇరాన్, ఇజ్రాయెల్ అణుయుద్ధానికి నేపథ్యమైన ఇరాన్ అణుకార్యక్రమం గురించి చెప్పుకోవాల్సి వస్తే, ఇరాన్‌అణు కార్యక్రమాన్ని ఆపాలనే ఆరాటంతోఅందులో పనిచేస్తున్న 10 మంది ఇరాన్ సైంటిస్ట్‌లను ఇజ్రాయెల్ బలగాలు ‘ఆపరేషన్ నార్నియా’తో మట్టుపెట్టంది. ఎవరికీ తెలియని ఓ రహస్య ఆయుధాన్ని ఇజ్రాయెల్ వాడింది. ఎంతో పకడ్బందీ ప్రణాళికతో వ్యూహరచన చేసే ఇజ్రాయెల్ ఇరాన్ ‘ఫోర్డో’ స్థావరం ఎక్కడుందో తెలుసుకోగలిగింది తప్ప అక్కడ వున్న యురేనియం తరలింపును గ్రహించలేకపోయింది. ఈ యుద్ధంలో చెప్పుకోవాల్సింది ఇరుదేశాల వ్యూహ ప్రతివ్యూహాల గురించే. ఇరాన్‌లోని మూడు అణుపరిశోధనా కేంద్రాలపై అమెరికా ఆరుబంకర్ బస్టర్ బాంబులతో దాడిచేసినా అక్కడ ఉన్న యురేనియాన్ని ఎలా ముందుగానే ఎక్కడికి తరలించారన్నదీ అంతుపట్టని రహస్యంగా మారింది. ఈ యురేనియం శుద్ధి విషయంలోనే ఆది నుంచి ఇజ్రాయెల్ మండిపడుతోంది. దాని ఆచూకీ ఒదిలిపెట్టి భూగర్భ స్థావరాలను ధ్వంసం చేయడమొక్కటే ఇజ్రాయెల్ విజయంగాచెప్పాలి. అంతకు ముందు అమెరికా ఫోర్స్ దూకుడుపనికొచ్చింది. ఆ తర్వాత కానీ తెలియలేదు. యురేనియం నిల్వలు స్థలం మారాయని,ఈ విషయంలో సమాచారంసేకరణలో ఇజ్రాయెల్ వెనుకబడి ఉన్నట్లు అర్థమౌతోంది. కాగా ఈ యురేనియం నిల్వలపై ప్రపంచ దేశాలన్నీ ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం మాయమైన యురేనియం నిల్వలతో 10అణ్వస్త్రాలను తయారు చేయొచ్చనిఅమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ వెల్లడించారు. విశేషమేమిటంటే యురేనియం నిల్వలను రహస్యప్రదేశానికి గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. తాజాగా ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాలు ఏదైనా అణ్వస్త్ర ఒప్పందం చేసుకోదలిస్తే మొన్నటి దుర్ఘటనలో మాయమైన యురేనియం నిల్వలను సాకుగా చూపించి ‘గొంతెమ్మ కోరికలు’ బయటపెట్టే అవకాశముంది. అంటే షరతులు పెట్టే స్థాయిలో ఇరాన్ ఉంటుందన్నమాట. ఇరాన్‌లోని నతాంజ్,ఇస్ఫహాన్, ఫోర్డో, అణు పరిశోధనా కేంద్రాలపై దాడికి ముందుగానే యురేనియం నిల్వలతోపాటు కొన్ని కీలక పరికరాలను వేరొక సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఆ సమయంలో తీసిన ఉపగ్రహ చిత్రాలను పరిశీలిస్తే వరుసగా బయట16 ట్రక్కులు కనిపించాయి. వీటనన్నిటినీ మరో భూగర్భ అణుస్థావరానికి పంపించి ఉంటారని ఇజ్రాయెల్ ఊహిస్తోంది. ‘కొండను తవ్వి ఎలుకను పట్టిన’ చందాన ఇరాన్ అణు కేంద్రాలపై దాడి వ్యవహారం కనిపిస్తోంది. భారీ స్థాయిలో అమెరికా బి2బంకర్లను, ఆపై ఇజ్రాయెల్ 12 బంకర్ బస్టర్ బాంబులు వేసినా అక్కడ దొరికిందేమీ లేదు. పట్టుకున్నదేమీలేదు. స్థావర విధ్వంసం తప్ప. అణ్వస్త్ర సంపదనేమీ పట్టుకోలేకపోయారు. తమ దేశ శాంతియుత ప్రయోజనాల కోసమే తాము అణుశక్తిని ఉపయోగించుకునే చట్టబద్ధ హక్కులకోసమే తమ ఆరాటమని, వాటిని తప్పక కాపాడుకోగలమని ఇరాన్‌అధ్యక్షుడు పెజిష్కియాన్ స్పష్టం చేశారు. అయినా ఇరాన్ వాదనను ఇజ్రాయెల్ నమ్మకపోగా యుద్ధం ప్రకటించింది. దాదాపు 700 మంది సైనికులు,పౌరుల మరణం తప్ప ఇజ్రాయెల్ సాధించిందేమీలేదు. అమెరికాదాడులకు ముందేఇరాన్‌లోని ఫోర్డో కేంద్రం 408కిలోల యురేనియం నిల్వలను తరలించినట్లు ఇజ్రాయెల్ అధికారులే ధృవీకరించారు. కాగా దానిని ఎక్కడికి తరలించారో మరో మానవ మాత్రుడికి తెలియకుండా ఇరాన్ జాగ్రత్త పడింది. అణ్వాయుధాల తయారీని ఇజ్రాయెల్ ఆపగలదో లేదో ఇప్పుడే చెప్పలేం. ఆ దాచిపెట్టిన యురేనియంతో ఈసారి ఇరాన్ నిజంగానే అణ్వాయుధ తయారీకి పూనుకోవచ్చు. ఏమయినా అసలు ‘అణు’ రహస్యం తెలిస్తే కదా!

పని మూడు రుగ్మతలను నిర్మూలిస్తుంది. అవి విసుగు, దుర్గుణం, దారిద్ర్యం.



తిరుక్కురళ్

పేద జనానికి తిండి తిప్పలు సమకూర్చినప్పుడే నిజమైన నాగరికత ఉన్నట్లు లెక్క.



వి. జాన్సన్

# ప్రజావాక్కు



### డిఎస్సీ నోటిఫికేషన్స్‌పై అభ్యర్థుల ఆశలు

తెలంగాణరాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో మోడల్ స్కూల్స్ లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీకోసం లక్షలాదిమంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 11062 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షల నిర్వహణ నియామక ప్రక్రియ త్వరగా పూర్తి చేశారు. గతఏడాది డిఎస్సీ నిర్వహణ సమయంలోనే మరో 5వేల టీచర్ పోస్టులు భర్తీచేస్తామని జాబ్ క్యాలండర్ ఇస్తామని పేర్కొన్నారు. వివిధరకాల సమస్యలవల్ల జాబ్ క్యాలండర్ వాయిదా పడిన విషయంతెలిసిందే. గత డిఎస్సీ పరీక్షలు జరిగి దాదాపు సంవత్సరం అవుతుంది కాబట్టి పదవి విరమణ ద్వారా ఏర్పడిన ఖాళీలు క్లియర్ వెకెన్సి కలిపి దాదాపు 10వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాబట్టి త్వరగా డీ.ఎస్సీ పైనిర్ణయం తీసుకోవాలి.

- రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

### పాకిస్థాన్ స్వయంకృతాపరాధమే

పహెల్గాం దాడి తరవాత దాయాదిదేశం చేస్తున్న దాష్టికాలను, అది చేస్తున్న కుయుక్తులను ప్రపంచం ముందు పెట్టడంలో ఆదేశ ప్రభుత్వ నేతలు మేము తీవ్రవాదులకు రక్షణగా ఉన్నాం. మాదేశం అలావాలంగా ఉంది అనిపించడంలో భారత్ సఫలీకృతమైంది. మరోవైపు సింధు నది జలాలు నిరాకరించడం వల్ల ప్రపంచ వ్యాపితంగా ఇతర దేశాలు పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడే సాహసం చేయడంలేదు. అంటేదానికి ప్రధానకారణం పాకిస్థాన్ స్వయకృతా పరాధమే కారణం. గయానా లాంటి చిన్న దేశాలకు కూడా ఈ భావజాల వ్యాప్తి చేయడంలో భారత్ విజయం సాధించడం గమనించదగ్గ అంశం.

- భారత అవినాష్, జనగామ

### కఠిన నిబంధనలు రూపొందించాలి

డమ్మీస్కూళ్లు, అనుమతులులేని కోచింగ్ సెంటర్ల వల్ల దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థపై తీవ్రమైన ప్రభావం పడుతోంది. నాణ్యతలేనిబోధన,మౌలిక సదుపాయాల లోపం, తప్పుడు ప్రకటనలు, అసత్య హామీలు వంటి సమస్యలు పెరిగిపోతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా కోచింగ్ సెంటర్లపై నియంత్రణకు మార్గదర్శకాలు రూపొందించనుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పాఠశాలల పనితీరు సూచికలు

ప్రపంచంలోనే అతిపెద్ద విద్యా వ్యవస్థ భారతదేశంలో ఉంది. మన దేశంలో 14.72 లక్షలకు పైగా పాఠశాలలు, 98 లక్షల మంది ఉపాధ్యాయులు, దాదాపు 24.8కోట్లమంది విద్యార్థులు ఉన్నారు. 2022-23,2023-24 కు సంబంధించి దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని పాఠశాలల పనితీరుసూచిక (పిజిఐ) 2.0 నివేదికను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదలచేసింది. ఈతరహా నివేదికను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ 2017 నుంచి విడుదల చేస్తోంది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8కేంద్రపాలిత ప్రాంతాలలోని పాఠశాలల పనితీరుకు గ్రేడులను విడుదల చేసింది. ఈగ్రేడులలో రెండుతెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణలు మెరుగుపడ్డాయి. ఎపిలో ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వం తీసుకువచ్చిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, మధ్యాహ్నభోజనంలో సన్నబియ్యం, పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం,బడిబాట కార్యక్రమం తదితర కారణాలవల్లవిద్యా సంవత్సరాలలో పాఠశాలల పనితీరు నివేదికలో ఎపి స్థానం మరింత మెరుగుపడుతుంది.

-చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

### ప్రభుత్వ విద్యపై దృష్టిసారించాలి

ఉభయ రాష్ట్రాలో పదవతరగతి, ఇంటర్‌లో ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ఎస్సోగురుకుల,జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో విద్యార్థులు చక్కని ప్రతిభ చూపించారు. పోటీ పరీక్షలకు వెళ్లి ఉత్తమ ప్రమాణాలు గల కళాశాలలో ప్రవేశం పొందారు. ఆటలు,విజ్ఞాన ప్రదర్శనల్లోకూడా తమ నైపుణ్యాన్ని చూపారు. ప్రభుత్వ పాఠశాలలు మన సొంతవి. వాటి అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పాటు మన బాధ్యత కూడా గుర్తెరగాలి. దీని వల్ల ఇతర రాష్ట్రాల్లో మనం ముందుతుంటాము. మన ఇంటిలో పండిన పళ్ళు మనము ఫలితం పొందాలి.

-బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

### మారుతున్న సమాజం

సమాజంలో చాలా మార్పు కానవస్తోంది. నీతి నియమాలకు, సామరస్యధోరణులకు చోటులేకుండాపోతోంది. డబ్బుకు,సుఖాలకు ప్రాధాన్యత పెరిగిపోతోంది. అత్యాచారాలు,హత్యలు, అవినీతి, విడాకులు, అక్రమ సంబంధాలు వంటి దుష్పరిణామాలు అధికం అయిపోతున్నాయి. అసాంఘిక శక్తులు బలపడిపోతున్నాయి. ప్రభుత్వాలు, చట్టాలు, న్యాయాలు వీటిని అరికట్టడంలో విఫలం అవుతున్నాయి.

-బి.ఎన్.సత్యనారాయణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆర్థిక పంపకాల్లో కేంద్రానికి సమదృష్టి అవసరం!

**భారత్ అవలంబిస్తున్న ప్రజాస్వామ్య విధానానికి పాలనలోని పద్ధతులకు ఒక విలువా, గౌరవమూ, అన్ని దేశాలలో కేవలం ప్రజాస్వామ్యం ఉన్న వాటిల్లోనే కాదు, మరో పాలనాపద్ధతి అవలంబిస్తున్న దేశాల్లో కూడా ఉంది. దానికి కారణం అంతర్గతంగా దేశంలో ఎన్ని పార్టీలు ఉన్నా ఎంతగా విభిన్న దృక్పథాలున్నా దేశం బయట మాత్రం అందరి నాయకుల, ప్రజల ధోరణి ఒక్కటే అని భారతదేశం కులమతాలకు అతీతంగా ప్రవర్తిస్తుందని ఆ గొప్ప పేరును తాత్కాలిక అవరోధాలతోటి, వైషమ్యాలతోటి, మేము గొప్ప అంటే మేము గొప్ప అనే అహంకార ధోరణులతోటి పోగొట్టుకోకూడదు. గౌతమ బుద్ధుడు, శంకరాచార్యులు, జాతిపిత మహాత్మాగాంధీ వారసులు అని ప్రపంచమంతటా భారతీయతనూ, భారతీయులను గౌరవిస్తూ విలువనిస్తూ, శ్లాఘిస్తున్నప్పుడు మనను మనం తక్కువ చేసుకోకూడదు. అందుకే ఏ పార్టీ అటు కేంద్రంలో కానీ ఇటు రాష్ట్రాల్లోకానీ, ప్రభుత్వంలోనూ అధికారంలో ఉన్నా అందరికీ పాలనాపరంగా, ఆర్థికంగా సమదృష్టితో చూడకతప్పదు.**



రావులపాటి సీతారాంరావు

కేంద్ర,రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య సామరస్య ధోరణి పొరపొచ్చాలు లేకుండా ఉండాలంటే ఆర్థిక వెసులుబాటు ఇరు ప్రభుత్వాలకూ మేలు చేకూర్చే విధంగా ఉండాలి. అప్పుడే ‘డబుల్ ఇంజన్’ ప్రణాళిక విభిన్న పార్టీలు, ప్రభుత్వాలలో ఉన్నా, సర్దుకొనిపోయే ‘ధోరణి’ ప్రజల హితవు కోసం ఏర్పడుతుంది, ఫలిస్తుంది. పదహారవ ఫైనాన్స్ కమిషన్ (ఎస్.ఎఫ్.సి) చేసే ఆర్థిక వనరులను పంచే రికమెండేషన్స్ ఏప్రిల్ ఒకటి 2026 నుంచి ఆమోదించబడితే పరిగణనలోకి వస్తాయి. అరవింద్‌పనగారియా ఈ కమిషన్ ఛైర్మన్. 28 రాష్ట్రాలలో 22 రాష్ట్రాలు (బిజెపి ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలతోసహా) టాక్స్ కలెక్షన్ల నుంచి ఎక్కువ షేర్‌ను అంటే 41శాతం నుంచి 50శాతం వరకు కోరాయని అనటం గమనార్హం. వారు ఆవిధంగా కోరటం సమంజసమే! అయితే కేంద్ర ప్రభుత్వం ఈ ‘డివిజబుల్ పూల్’ను కుదించి తమ టాక్స్ రెవెన్యూ వనరులను ‘నాన్ షేరబుల్ సెసెస్, సర్‌చార్జీల ద్వారా పెంచుకోవటం విశేషం. 2015-16 నుంచి 2019-20 (పాండమిక్ సంవత్సరాల ముందు ఉన్న 12.8శాతం టాక్స్ రెవెన్యూను2020-21, 2023-24 (బడ్జెట్ ఎక్స్‌పెండీచర్) 18.5శాతంకు పెంచుకుంది. దీనివల్ల రాష్ట్రాలు ఎక్కువగా ఆర్థిక వనరుల కోసం కేంద్రం మీద ఆధారపడే పరిస్థితి అనివార్యంగా మారింది. రాష్ట్రాలు ఆర్థిక వనరులను పెంచుకొనే స్థితి (జిఎస్టీ తర్వాత ) అంతంత మాత్రమే. అయితే జిఎస్టీ కలెక్షన్స్ బాగానే ఉన్నా, తగ్గిపోయిన రాష్ట్రాల వనరులను ఏవిధంగా పెంచుకోవాల్నో ఇంకా కేంద్రం తేల్చని పరిస్థితి. ప్రస్తుతం అమలులో ఉన్న ఫార్ములా జనాభా నిష్పత్తిని ఎక్కువగా పరిగణనలోకి తీసుకోవటంతో ఆర్థిక వనరులు రాష్ట్రాలకు పంచటంలో చాలా తేడాలు రాష్ట్రాల మధ్య కొట్టొచ్చినట్లు కన్పడుతున్నాయి. జనాభాను కేంద్ర మార్గదర్శక సూత్రాల ప్రకారం అదుపులో పెట్టటం దక్షిణాది రాష్ట్రాలకు శాపంలా మారింది. బాధ్యతాయుతంగా పాలన సాగించటం వల్ల ఈ రాష్ట్రాలు తక్కువ ఆర్థిక వనరులను జనాభా దామాషా మీద పొందటం ఒక విధంగా పెనాల్టీగానే చెప్పాల్సిన పరిస్థితి. ఉత్తరాది రాష్ట్రాలు (ప్రత్యేకంగా రాష్ట్రాలను ఇక్కడ బట్టబయలు చేయనవసరం లేదు)కానీ జనాభా పెరుగుదలను లెక్క చేయకుండా పాలన సాగించటం వల్ల ఈ విధమైన విభజన వారిని ఎక్కువ లాభం పొందేస్థాయికి కేంద్ర ఫార్ములా ఎత్తేసినట్లుగా, దక్షిణాది రాష్ట్రాల వారు ఎత్తిచూపటంలో తప్పులేనే లేదు. ఈ విధంగానే ఆర్థిక వనరులను రాష్ట్రాలకు ఫైనాన్స్ కమిషన్ రికమెండేషన్ల పేరుతో పంచటం, మార్పు లేకుండానే ఈ పరిస్థితిని కొనసాగించటం, ‘కోపరేటివ్ ఫెడరలిజం’ను ప్రక్కకు నెట్టేసినట్లే. బిజెపి ప్రభుత్వం ఈ మూల సూత్రాన్ని పదేపదే వల్లించటం మాటలకు చేతలకూ ఉన్న వ్యత్యాసాన్ని బట్టబయలు చేస్తుంది. ఛైర్మన్ పనగారియా కూడా 50శాతం(9పాయింట్ల పెంపుతో) కేంద్రం తమవంతు రాష్ట్రాల స్థితిగతులకు కుదుపు తెచ్చినట్లే అని భావించారు.




అయితే ప్రస్తుత పహెల్గాం సంఘటన వల్ల డిఫెన్స్ ఖర్చులు, ఆయుధాల ఉత్పత్తి సరఫరా, ఆర్మీని ఆధునీకరించడం చేపట్టాల్సిన అవసరం రావటంతో ఇబ్బడిముబ్బడిగా పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. డిఫెన్స్ కోసం చేసే ఖర్చులే కాకుండా ఇతర ప్రాజెక్టుల ఖర్చులను కాదనలేక, పెరుగుదలకు అనివార్యంగా కేంద్రం భావించకపోవటం కమిషన్ పరిగణనలోకి తీసుకోక తప్పటంలేదు. అందుకనే కమిషన్,కేంద్రం షేరును తగ్గించటం కష్టసాధ్యం అనుకొని రాష్ట్రాల షేర్‌ను 41శాతం దగ్గరే స్థిరీకరించే ఆలోచనను చేయక తప్పటం లేదేమో! అయితే ఈ పరిస్థితి వల్ల ఫెడరల్ విధానంలో లొసుగులు ఏర్పడే అవకాశం ఉంది. వ్యక్తికైనా, సమాజానికి అయినా, రాష్ట్రాలకైనా, ఆర్థిక పరిస్థితుల మెరుగుదల ఉంటేనే ప్రజాస్వామ్య విధానం పట్ల మరింత పటిష్టమైన నమ్మకం ఏర్పడుతుంది. అంత పెరుగుదల (టాక్స్ రెవెన్యూ పంపకంలో) లేకపోయినా కొంతలో కొంత పెంచటం రాష్ట్రాలకు తృప్తి కలిగిస్తుంది. ఫైనాన్స్ కమిషన్ సెసెస్‌ను సర్‌చార్జీలను అడ్డగోలుగా వాడకుండా శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించాల్సిన అవసరం ఉంది. నిర్దిష్టంగా కేంద్రం గ్రాస్ టాక్స్ రెవెన్యూను స్థిరీకరించడం కూడా కమిషన్ సూచించటం మంచిది. జనాభా ఫార్ములా మీదనే పూర్తిగా ఆధారపడకుండా, రాష్ట్రాలలోని సుపరిపాలనను కేంద్రం పరిగణనలోకి తీసుకొని ఆర్థిక వనరులు వసూలు చేయబడ్డ పన్నులను విభజించటంలో, నిష్పక్షపాతంగా వ్యవహరించినప్పుడే ‘కోపరేటివ్ ఫెడరలిజమ్’కు నిజమైన అర్థం ఏమిటో ప్రజల ప్రయోజనార్థం తెలిసివస్తుంది. రాష్ట్రాల అవసరాలు, విస్తీరణ, ప్రభుత్వాల సమర్థపాలన కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకొని ఆర్థిక వనరులను పెంచటంలో సమతుల్యతతోపాటు సమంజసమైన వైఖరిని అవలంబించాలి. మా ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి మళ్లీ ఎన్నికలలో గెలవటానికి ఎక్కువ వనరులు వారి పలుకుబడి ఈసారి ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకే సమకూర్చాలని ఏ కేంద్ర ప్రభుత్వం భావించినా అది ప్రజాస్వామ్య వ్యవస్థకు పనికిరాదు. పైగా ఆ వ్యవస్థ విలువలను తగ్గించి మరోదిశగా పాలన సాగించినట్లే!. ఆ అవగాహన ఉన్నప్పుడే కేంద్రం అన్ని రాష్ట్రాల ప్రజలను సమదృష్టితో చూడటమే కాకుండా సుపరిపాలన,ప్రజాక్షేమం, అభివృద్ధికి తోడ్పడినట్లు అని మన ప్రజలే కాదు, ప్రపంచమంతా భావిస్తుంది. భారత్ అవలంబిస్తున్న ప్రజాస్వామ్య విధానానికి పాలనలోని పద్ధతులకు ఒకవిలువా,గౌరవమూ, అన్ని దేశాలలో కేవలం ప్రజాస్వామ్యం ఉన్న వాటిల్లోనే కాదు, మరో పాలనాపద్ధతి అవలంబిస్తున్న దేశాల్లో కూడా ఉంది. దానికి కారణం అంతర్గతంగా దేశంలో ఎన్ని పార్టీలు ఉన్నాఎంతగా విభిన్న దృక్పథాలున్నా దేశం బయటమాత్రం అందరి నాయకుల, ప్రజల ధోరణి ఒక్కటే అని భారతదేశం కులమతాలకు అతీతంగా ప్రవర్తిస్తుందని ఆ గొప్ప పేరును తాత్కాలిక అవరోధాలతోటి, వైషమ్యాలతోటి, మేము గొప్ప అంటే మేము గొప్పఅనే అభిజాత్య అహంకారధోరణులతోటి పోగొట్టు కోకూడదు. గౌతమ బుద్ధుడు, శంకరాచార్యులు, జాతిపిత మహాత్మా గాంధీవారసులు అని ప్రపంచమంతటా భారతీ యతనూ, భారతీయులను గౌరవిస్తూ విలువనిస్తూ, శ్లాఘి స్తున్నప్పుడు మనను మనం తక్కువ చేసుకోకూడదు. అందుకే ఏ పార్టీ అటు కేంద్రంలో కానీ ఇటు రాష్ట్రాల్లో కానీ,ప్రభుత్వంలోనూ అధికారంలో ఉన్నా అందరినీ పాలనాపరంగా, ఆర్థికంగా సమదృష్టితో చూడకతప్పదు. ●

# ‘వ్యయ’సాయం కోరుతున్న వ్యవసాయం

డి జె మోహన రావు

వ్యవసాయం భారతదేశానికి కేవలం ఓ ఆర్థిక కార్యకలాపం కాదు. అది దేశానికి గుండెచప్పుడు,సంస్కృతిలో అంతర్లీనంగా పెనవేసుకున్న జీవన విధానం. కోట్లమందికి అన్నం పెడుతూ, సగం మందికి పైగా జనాభాకు ఉపాధిని కల్పిస్తూ దేశ స్థూల విలువ జోడింపుకి గణనీయమైన వాటాను అందిస్తోంది. ఒకప్పుడు ఆహార కొరతతో అల్లాడిన మన దేశం, నేడు అనేక వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం హరిత విప్లవం, తదనంతర విధానాల విజయాన్ని చాటుతుంది. వ్యవసాయ రంగం ఎంత కీలకమైనదైనా, అది అనేక లోతైన, నిర్మాణాత్మక సవాళ్లతో సతమతమవుతోంది. ఈ సమస్యలు దాని పూర్తి సామర్థ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, కోట్లాది మంది రైతుల ఆర్థిక స్థిరత్వాన్ని కూడా కదిలిస్తున్నాయి. అత్యంత తీవ్రమైన సమస్యలలో ఒకటి భూకమతాల విపరీతమైన విభజన. తరతరాలుగా వారసత్వ పంపకాల వల్ల చిన్న కమతాలుగా మారిపోయి ఆర్థికంగా లాభదాయకం కాని పరిమాణాలకు కుంచించుకుపోతున్నాయి. నాబార్డ్ సర్వే ప్రకారం దేశంలో సగటు భూకమతాల పరిమాణం 2016 17లో 1.08 హెక్టార్ల నుంచి 2021-22 నాటికి కేవలం 0.74 హెక్టార్లకు తగ్గింది. ఇది యాంత్రీకరణను, వనరుల సరైన వినియోగాన్ని కష్టతరం చేస్తుంది. సాగునీటి సౌకర్యాలు పెరిగినప్పటికీ, దేశంలో దాదాపు 50-51శాతం నికర సాగు విస్తీర్ణం రుతుపవనాలపై ఆధారపడిన వర్షాధారంగానే ఉంది. ఇది వాతావరణ మార్పులు, అస్తవ్యస్తమైన వర్షపాతం, కరువులు, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులకు వ్యవసాయాన్ని గురిచేస్తుంది. సమయానికి, సరసమైన ధరలకు అప్పులు అందకపోవడం చిన్న, సన్నకారు రైతుల కష్టాలను మరింత పెంచుతోంది. చాలా మంది రైతులు అనధికార వడ్డీ వ్యాపారులపై ఆధారపడి అధిక వడ్డీ రేట్లతో అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం కొంతవరకు ఆదుకున్నప్పటికీ, కౌలుదారులు, భూమి పత్రాలు లేనివారికి రుణాలు అందడంలో సవాళ్లున్నాయి. ఇక పంట కోతానంతర నష్టాలు, సరఫరా గొలుసులోపాలను చూస్తే తగినంత శీతల గిడ్డంగులు, ఆధునిక గోదాములు, పటిష్టమైన రవాణా వ్యవస్థలు లేకపోవడంవల్ల చాలా వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు చేరకముందే పాడైపోతున్నాయి. 2022లో నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ అధ్యయనం ప్రకారం ధాన్యం, ఇతర తృణధాన్యాలలో 3.89శాతం, 5.92శాతం నష్టాలు, పండ్లు, కూరగాయలలో 5శాతం, 15శాతం నష్టాలు సంభవిస్తున్నాయి. ప్రత్యక్ష మార్కెటింగ్ అనుసంధానాలు లేకపోవడం వల్ల మధ్యవర్తుల



ద్వారా విక్రయించాల్సి వచ్చి రైతుల లాభాలు తగ్గుతున్నాయి. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి సాంకేతిక పురోగతి, పటిష్టమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, లక్షితవిధాన సంస్కరణలను సమగ్రంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. రైతు భూకమతాల విభజనవల్ల కలిగే నష్టాలను తగ్గించడానికి, చిన్న, సన్నకారు రైతులను ఏకం చేసే ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయడం అత్యవసరం. ఇవిఉత్పత్తిని పెద్దఎత్తున సేకరించడానికి, తక్కువ ధరకు ముడిసరుకులను కొనుగోలు చేయడానికి, యంత్రాలను పంచుకోవడానికి, మార్కెట్లో మెరుగైన ధరల కోసం సమిష్టిగా బేరం చేయడానికి వీలు కల్పిస్తాయి. 2028 నాటికి 10,000 కొత్తగా ఇటువంటి సంస్థలను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం ఈ దిశగా ఒక ముఖ్యమైన అడుగు. ప్రతి బొట్టుకు అధిక పంట నినాదంతో మైక్రోఇరిగేషన్ పద్ధతులైన డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థలను వేగవంతం చేయాలి. వర్షపు నీటి సంరక్షణ, వాటర్‌షెడ్ అభివృద్ధి వంటి వాటిలో పెట్టుబడులు వాతావరణ మార్పులకు వ్యవసాయాన్ని మరింత తట్టుకునేలా చేస్తాయి. పంట కోతానంతర నష్టాలను తగ్గించడానికి, మార్కెట్ అనుసంధానాలను మెరుగుపరచడానికి ఆధునిక శీతల గిడ్డంగులు, శీతలీకరించిన రవాణా నెట్‌వర్క్‌లు, సమగ్రలాజిస్టిక్స్ పరిష్కారాలపై గణనీయమైన పెట్టుబడి అవసరం. భారత ప్రభుత్వం వ్యవసాయ రంగ సవాళ్లను పరిష్కరించడానికి అనేక చర్యలు చేపట్టింది. 2016 నుండి 2024 డిసెంబర్ వరకు సుమారు 95 లక్షల హెక్టార్ల భూమిని మైక్రోఇరిగేషన్ కిందకు తీసుకువచ్చారు. ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన పథకం దీనికి మద్దతునిస్తుంది. కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం ద్వారా డిసెంబర్ 31, 2024 నాటికి 7.72 కోట్ల మంది రైతులకు 10.05 లక్షలకోట్ల రుణపరిమితితో ప్రయోజనం చేకూరింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా 2025 ఫిబ్రవరి నాటికి 23.22 కోట్ల మందికిపైగా రైతులకు 1.75 లక్షల కోట్ల క్లెయిమ్‌లను పంపిణీ చేశారు. పిఎం కిసాన్ వంటి ప్రత్యక్ష ఆదాయ మద్దతు పథకాలు 2024 జూలై నాటికి 11 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు 3.24 లక్షల కోట్ల ప్రయోజనాలను అందించాయి. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి కింద 1లక్ష కోట్ల పథకంలో, 2024 ఆగస్టు నాటికి 47,575 కోట్ల విలువైన 74,508 ప్రాజెక్టులకు అనుమతులు లభించాయి. ఇది గోదాములు వంటి కీలక ఆస్తులను సృష్టిస్తోంది. నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఇనామ్)లో 2024 అక్టోబర్ నాటికి 1.78 కోట్ల మంది రైతులు, 2.62లక్షలమంది వ్యాపారులు నమోదు చేసుకున్నారు. ఇది రైతువినియోగదారుల డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా మధ్యవర్తుల సంఖ్యను తగ్గించి, రైతులకు మెరుగైన ధరలను అందిస్తుంది. అనేకరంగాలపై వ్యూహాత్మకంగా దృష్టి సారించడం ద్వారా, నిరంతర విధాన మద్దతు, తాజా సాంకేతిక పురోగతులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా, భారతదేశం తన వ్యవసాయ రంగంలోని అపారమైన సామర్థ్యాన్ని నిజంగా ఆవిష్కరించగలదు. ●

# స్థానిక ఎన్నికల పోరుకు సిద్ధమవుతున్న పార్టీలు!

కామిడి సతీష్ రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా సందడి మొదలైంది. బిసి రిజర్వేషన్ల విషయాన్ని ప్రభుత్వం తేల్చితే షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. రిజర్వేషన్ల అనంతరం రంగంలోకి దిగేందుకు నాయకులు సిద్ధం అవుతూ ఉన్నారు. జిల్లా మండల పరిషత్, పంచాయతీ ఎన్నికలకు వారంలో షెడ్యూల్ వస్తుందని చర్చ జరుగుతోంది. ఇటీవల మంత్రులు పలు సందర్భాలలో ఎన్నికల గూర్చి ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏ సమయంలోనైనా షెడ్యూల్ విడుదలచేసే అవకాశం ఉండటంతో అధికారులు సైతం సిద్ధంగా ఉన్నారు. గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలకు పాలకవర్గాల గడువు ముగిశాక సకాలంలో ఎన్నికలు నిర్వహించలేకపోవడంతో ప్రస్తుతం అవన్నీ ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు, వాటితో పాటు రాష్ట్రప్రభుత్వం జతచేయాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోవడంతో పల్లెలు, పట్టణాల్లో ఎక్కడి పనులక్కడే నిలిచిపోవడంతోపాటు పాలన గాడి తప్పింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిసిలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో దాన్ని తక్షణం అమలు చేశాకే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తోంది. దీంతో ఎన్నికల్లో రిజర్వేషన్లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. వార్డు మొదలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం వరకు ఏ స్థానం, ఏ కేటగిరికి కేటాయిస్తారనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం అధికారిక రిజర్వేషన్లు 50శాతానికి మించి ఉండడానికి ఆస్కారం లేకపోవడంతో, తాజా కులగణన నివేదిక ప్రకారం రిజర్వేషన్ల అమలులో భాగంగా బిసిలకు తమ పార్టీ నుంచి 42శాతం సీట్లు కేటాయిస్తామని, జనరల్ స్థానాల్లో బిసిలకు ప్రాధాన్యం పెంచుతామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ విషయంపై క్షేత్రస్థాయి నాయకుల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఎప్పుడైనా షెడ్యూల్ వచ్చే అంచనాలో అధికార యంత్రాంగం ఉంది. పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న సంకేతాలతో అధికారయంత్రాంగం,పోటీ చేయాలనుకునే ఆశావహులు అప్రమత్తమయ్యారు.





రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జెడ్‌పిటిసి ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. పోలింగ్, పోలీస్ సిబ్బంది నియామకానికి ఎంతమంది అవసరమవుతారనే అంశంలో ఇప్పటికే ప్రాథమికంగా సమాచారం సిద్ధం చేశారు. పరిషత్‌లకు పార్టీల ప్రాతిపదికన, గ్రామపంచాయతీలకు, వార్డు సభ్యులకు పార్టీ రహితంగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉండడంతో, అందుకోసం వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు, గుర్తులను ఇప్పటికేసిద్ధం చేశారు. రిజర్వేషన్లను ఎలా ఖరారు చేయాలనే అంశంపై ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకున్న మేరకు రిజర్వేషన్ల కోటా, కేటాయింపులు చేస్తారు. ముందుగా పరిషత్‌లకు, తదుపరి పక్షంరోజుల వ్యవధిలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ముందుగా ఏ ఎన్నికలు నిర్వహించినా, ఫలితాలు ప్రకటించకుండా కోడ్ కొనసాగిస్తూ, ఎన్నికలు ముగించాలని, గ్రామాల్లో ఘర్షణలకు ఆస్కారం లేకుండా చూడడంతో పాటు, పాలనాపర ఇబ్బందులను అధిగమించవచ్చునేది ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాల ఆలోచనగా అధికారులు చెబుతున్నారు. స్థానిక సంస్థలకు 2019లో జరిగిన ఎన్నికల్లో ఎస్టీలకు 7శాతం, ఎస్సీలకు 15 శాతం, బిసిలకు 25శాతం, మహిళలకు అన్ని కేటగిరిల్లో 50శాతం రిజర్వేషన్లు కేటాయించారు. జడ్పీటీసీ స్థానాలకు, ఎంపీపీ పదవులకు పంచాయతీరాజ్ కమిషనర్ స్థాయిలో జిల్లాల వారీగాకోటాను ఖరారు చేస్తే, జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో ఆ కోటా ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా సీట్లను కేటాయించారు. ఎంపీటీసీ స్థానాలకు, సర్పంచ్ పదవులకు కలెక్టర్లస్థాయిలో మండలాల వారీగా కోటా ఖరారు చేసి, ఆర్డీవోల నేతృత్వంలో ఆయా మండలాల్లో సీట్లను కేటాయించారు. ఈసారి రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఎలాంటి తుది నిర్ణయం తీసుకున్నా మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతానికి మించకుండా నిబంధనలు రూపొందిస్తారని,ఆ మేరకు కోటా ఖరారు, సీట్ల కేటాయింపు గతం మాదిరిగానే చేపడతారా? లేక కోటా ఖరారు, కేటాయింపులపై మార్పులు, చేర్పులు తీసుకుంటారా? అనే విషయం తేలాల్సి ఉంది. ఈ వారంలోనే అన్ని అంశాలపై స్పష్టత వస్తుందని, వారంలోపే రిజర్వేషన్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ, అధికార వర్గాల్లో చర్చసాగుతోంది. ఇప్పటికే గ్రామాల్లో, మండలాల్లో సర్పంచులుగా, ఎంపీటీసీ సభ్యులుగా, జడ్పీటీసీ, ఎంపీపీ పదవులపై ఆశలు పెంచుకున్న స్థానిక నాయకులు రిజర్వేషన్లు వారికి అనుకూలంగా వస్తే కదనరంగంలోకి దూకేందుకు అన్నిరకాలుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పోటీ చేసే వారు ఆయా పార్టీల ప్రముఖులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ●

# తృప్తి కాంటీన్ కోసం రుణ మంజూరు లేఖ పంపిణీ

## -షాదీఖానా సమీపంలో తృప్తి క్యాంటీన్
## -సందర్శించిన మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్

**విజయవాడ కార్పొరేషన్,జూన్ 25,ప్రభాతవార్త:** మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధ్వర్యంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన తృప్తి క్యాంటీన్‌కు ప్రజల నుండి ఆదరణ బాగుండటంతో విశాఖపట్నం,విజయవాడలో మరో నాలుగు క్యాంటీన్లు ప్రారంభించేందుకు



అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం పంజా సెంటర్ వద్ద గల షాదీఖానా దగ్గర తృప్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసుకునేందుకు స్వయం సహాయక బృందాల లబ్ధిదారులకు రుణ మంజూరు లేఖను అధికారులు పంపిణీ చేశారు.పట్టణ స్వయం సహాయక సంఘాల సభ్యుల ఉపాధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక విన్నూత్న కార్యక్రమల్లో తృప్తి క్యాంటీన్ ఒకటి.బ్యాంకుల నుంచి సంఘాలకు పెట్టుబడి నిధి కింద రుణాలు అందించి వాటితో తృప్తి క్యాంటీన్లు ప్రారంభించాలని,పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రణాళిక రచిస్తోంది. ఈ నేపథ్యంలో విజయవాడలో 4 క్యాంటీన్లను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి కంటైనర్ల సమీకరణ,కిచెన్ ఎక్విప్‌మెంట్ తదితరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో క్యాంటీన్ ఏర్పాటుకు రూ.13.51 లక్షలు అవసరం అవుతుందని అంచనా.జన సమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలంలో స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా వీటిని ఏర్పాటు చేస్తున్నారు.మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భరత్ నగరపాలక సంస్థ పరిధి లోని పంజా సెంటర్,షాదీఖానా సమీపం లోని తృప్తి క్యాంటీన్‌ను సందర్శించారు. భారత ఓవర్సీస్ బ్యాంకు,విజయవాడ ప్రాంతీయ కార్యాలయం ద్వారా తృప్తి క్యాంటీన్ ఎస్‌హెచ్‌జి మహిళా లబ్ధిదారులకు రుణ మంజూరు లేఖలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) పి.వెంకట నారాయణ,ఐఒబి అధికారులు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

# మధ్యవర్తులను బ్రోకర్లు అని కించపరచడం బాధాకరం

**విజయవాడ, జూన్ 25, ప్రభాతవార్త :** రెండు కుటుంబాలను ఏకంచేసే అద్భుతమైన వ్యవస్థ మధ్యవర్తుల వ్యవస్థ అని శ్రీకళ్యాణ బంధం తెలుగు రాష్ట్ర మధ్యవర్తుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ కాండ్రు మీన తెలిపారు. బుధవారం రామోహన్ గ్రంథాలయంలో జరిగిన శ్రీ కళ్యాణ బంధం తెలుగు



రాష్ట్ర మధ్యవర్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో సంస్థ అధ్యక్షురాలు కాండ్రు మీన, ఫౌండర్ అండ్ సెక్రటరీ పురుషోత్తం మాట్లాడుతూ ఇటీవల పెళ్ళిళ్ళ మధ్యవర్తులపై సోషల్ మీడియా పత్రికలు కొన్ని తప్పుడు కథనాలు ప్రచారం అవుతున్నాయని, బ్రోకర్లు అనే పదం వాడుతూ కించపరిచేలా వ్యాఖ్యానించడం అవమానకరమన్నారు. కర్ణాటకకు చెందిన కుటుంబాన్ని ఒక వ్యక్తి తాను మధ్యవర్తినంటూ వచ్చి మోసం చేశాడని వార్తలు వచ్చాయని ఆ వ్యక్తి మీడియేటర్ అవునో కాదో తెలుసుకునే ప్రయత్నం చేయకుండా, ఖచ్చితమైన సమాచారం లేకుండా ప్రచారం చేయడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి సంఘం తరపున అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కామేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ బత్తుల మల్లిఖార్జునరావు, సత్యవతి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.





ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీకన్వెన్షన్‌లో జరిగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్రహోమంత్రి వంగలపూడి అనిత,గుంటూరు పశ్చియ ఎమ్మెల్యే గళ్ళా మాధవి,గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్,తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్
(గుంటూరు క్రైమ్,జూన్ 25,ప్రభాతవార్త)

# 6సంవత్సరాల సర్వీస్ పూర్తయిన ప్రమోషన్స్ లేవు తక్షణమే పదోన్నతి కావాలి

**విజయవాడ, జూన్ 25, ప్రభాతవార్త :** కనీస విద్యార్హత డిప్లమోగా మారుస్తూ టెక్నికల్ పే స్కేల్ అమలు చేస్తూ రాష్ట్రంలో ఉన్న 8269 గ్రేడ్-1 నోటిఫైడ్ విలేజెస్‌కి గ్రామ సర్వేయర్లగా ప్రమోషన్ ఇస్తూ సీనియారిటీ జాబితా ప్రకారం పదోన్నతులు తక్షణమే కల్పించాలంటూ బుధవారం ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌కి కనీస విద్యార్హత డిప్లమోగా మారుస్తూ ప్రమోషన్ చానల్ ఇస్తూ సీనియారిటీ జాబిత ప్రకారం పదోన్నతులు కల్పించాలని, ప్లానింగ్ సెక్రటరీలకి టిబిటివో ఇన్‌చార్జ్ రద్దు చేసి, టిబిటివో రెగ్యులర్ లైన్ ఇవ్వాలి అందరికి ట్రేసర్ స్కేల్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# కొలెస్ట్రాల్ నియంత్రణకు సమతుల ఆహారం

**విజయవాడ, జూన్ 25, ప్రభాతవార్త :** గుండె జబ్బులు అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులను నివారించడానికి కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం అత్యంత కీలకం, కొలెస్ట్రాల్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి బాదం ఓట్స్ తృణధాన్యాలు పండ్లు కూరగాయలు వంటి సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం చాలా ముఖ్యమని డైట్‌లో చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించడం వీలవుతుందని న్యూఢిల్లీలోని మాక్స్ హెల్త్‌కేర్‌లో డైటెటిక్స్ రీజనల్ హెడ్ రితికా సమద్దర్ పేర్కొన్నారు.

# సిఆర్ఐ సోలార్‌కు బహుళ రాష్ట్రాల ఆర్డర్లు

**విజయవాడ, జూన్ 25, ప్రభాతవార్త :** సిఆర్ఐ పంప్స్ యొక్క ఒక విభాగం పునరుత్పాదక ఇంధన ఆధారిత నీటి పరిష్కారాలలో అగ్రగామిగా ఉన్న సిఆర్ఐ సోలార్ 6894 సౌర పంపింగ్ సిస్టమ్ సరఫరా వ్యవస్థాపన నెలకొల్పడం కోసం మహారాష్ట్ర ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ హర్యానా రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, పంజాబ్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నుండి 210కోట్ల విలువైన గణనీయమైన ఆర్డర్లను సంపాదించింది.

# విజయవాడ వార్త

# జులై 5న లోక్ అధాలత్

**తిరువూరు, జూన్ 25, ప్రభాతవార్త :** జులై 5న లోక్ అధాలత్ నిర్వహణ తిరువూరు కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ జడ్జిబుధవారం పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమావేశం నిర్వహించి లోక్ అధాలత్ ఏర్పాట్లను గురించి చర్చించారు.




# కృష్ణలంకలో గంజాయి పట్టివేత

## -200 కిలోల గంజాయి స్వాధీనం
## -షిఫ్ట్ డిజైర్ కార్,గూడ్స్ మినీ వాహనం స్వాధీనం
## -ఇద్దరు నిందితుల అరెస్టు

**విజయవాడ క్రైం,జూన్ 25,ప్రభాతవార్త:** సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు కృష్ణలంక,గీతానగర్ కట్ట వద్ద సిటీ టాస్క్‌ఫోర్స్,లా అండ్ ఆర్డర్,ఈగల్ టీమ్స్ పక్కా సమాచారంతో బుధవారం గీతానగర్ కట్ట ఏరియాలో కృష్ణలంక ఎస్ఐ భానుప్రసాద్ వారి సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేస్తున్న సమయంలో షిఫ్ట్ డిజైర్ వాహనాన్ని ఆపి దానిని తనిఖీ చేశారు. అందులో గంజాయి కల్గి ఉన్న బ్యాగులను గుర్తించారు.డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. అదే దారిలో వస్తున్న టాటా గూడ్స్ డ్రైవరు పోలీసు వారి తనిఖీలను గమనించి వాహనం ఆపి దిగి పరారవ్వడానికి యత్నించుచుండగా అదుపులోకి తీసుకొని విచారించి వారి వద్ద నుండి సుమారు 15 లక్షల రూపాయల విలువైన 200 కిలోల గంజాయిని,రెండు వాహనాలను స్వాధీనం చేసుకొని విశాఖ జిల్లా తగరపువలస, భీమునిపట్నం ఏరియాకు చెందిన అండి నాగరాజు,తమిళనాడు రాష్ట్రం ఉత్తమ పలయాన్,కక్కి సింగయన్ పట్టి గ్రామానికి చెందిన అనబలగన్ సిన్రసులను అరెస్ట్ చేశారు. వారి దగ్గర సేకరించిన వివరాలను సిపి రాజశేఖరబాబు వెల్లడించారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం ప్రధాన నిందితుడైన అండి నాగరాజు స్వంత ఊరు తమిళనాడు లోని మధురై కాని బ్రతుకుతెరువు నిమిత్తం చిన్నతనం లోనే తగరపువలస వచ్చి జీవిస్తున్నాడు ఈ సమయంలో అక్కడ గంజాయికి ఎక్కువ డిమాండ్ ఉందని తెలుసుకుని చుట్టపక్కల ఏజెన్సీ గ్రామాల్లో ఎక్కువగా గంజాయి సాగు జరుగుతుందని తెలుసుకొని దీనిని ఈ గ్రామాల్లో తక్కువ రేటుకు కొనుగోలు చేసి చెన్నైలో ఎక్కువ రేటుకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేయచ్చు అనుకొని తమిళనాడులో



ఉంటున్న సమయంలో పరిచయం ఉన్న అనబలగన్ స్నిసుకు తన పథకం చెప్పగా తను కూడా సరేనని చెప్పి పోలీసు వారు అనుమానించకుండా గంజాయిని తరలించడానికి గూడ్స్ వాహనంలో కొంత భాగానికి అరలుగా తయారు చేయించి అందులో గంజాయి బ్యాగ్‌లను పెట్టి పైన ఖాళీ ఐస్ బాక్స్‌లను పెట్టి తరలించేవాడు. ఒకసారి ఆ గూడ్స్ వాహనానికి ముందు మరొక కారును నాగరాజు డ్రైవ్ చేసుకుంటూ వెళుతూ పోలీసు వారి సమాచారం ఎప్పటికప్పుడు సిన్రసుకు తెలియచేస్తూ అప్రమత్తం చేసి గంజాయిని తరలించారు. ఈ క్రమంలో రెండు సార్లు అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్ళి వచ్చాడు. జైలు నుండి విడుదలైన అనంతరం తన ప్రవృత్తిని మానుకోకుండా చుట్టుపక్కల ఏజెన్సీ గ్రామాల్లో 200 కిలోల గంజాయిని కొనుగోలు చేసి అనబలగన్ సిన్రసుకు ఫోన్ చేసి వాహనాన్ని తీసుకురమ్మని చెప్పి అందులో 100 కిలోల గంజాయిని ఇతని కారులో మరో 100 కిలోల గంజాయిని లోడ్ చేసుకొని పాత పద్ధతి ప్రాకారం కారు ముందు వెనుక మినీ గూడ్స్ వాహనంతో చెన్నైకి బయలుదేరారు. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా పోలీసు వారికి రాబడిన పక్కా సమాచారం మేరకు కృష్ణలంక ఎస్ఐ భానుప్రసాద్ సిబ్బందితో కలిసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించి వారి వద్ద నుండి సుమారు రూ.15 లక్షల విలువ చేసే గంజాయి, గంజాయి తరలించడానికి ఉపయోగించిన పై రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఈ సమావేశంలో సిపి రాజశేఖరబాబుతో పాటు సౌత్ ఎసిపి డి.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా, గోదావరి జలాల్లో ఏపి ప్రజల హక్కుల కోసం పోరాటం

## - గోదావరి బనకచెర్ల పథకాన్ని విరమించుకోండి
## - పోలవరం గోదావరి - సోమశిల పెన్న అనుసంధానం చేయండి

**విజయవాడ, జూన్ 25, ప్రభాతవార్త :** పోలవరం బనకచర్ల అనే ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనగా, వాస్తవానికొస్తే కెసిఆర్ - జగన్ - మెగా కృష్ణారెడ్డి బుర్రల్లో ఉన్నప్పటికి ముందుకు వచ్చి దాన్ని అత్యంత వేగంగా కేంద్ర జల సంగంతోఆమోదింపచేసుకోవాలని, కేంద్ర ఆర్థిక సాయంతో నిర్మించాలని అంటూ పరుగులెత్తుతున్న నేపథ్యంలో ఇది తెలంగాణలో రాజకీయ పార్టీల మధ్య ఒక ఫుట్‌బాల్‌గా మారింది. దీనిమీద తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను ఈ మధ్యనే విన్నాం. అసలీ బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ అవసరాలకు ప్రయోజనాలకు కృష్ణాజాలాల్లో రాష్ట్ర వాటా పరిరక్షణకు అనుగునంగా ఉన్నదా ! లేదా ! అని ప్రశ్నించుకోవాలి. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని కేవలం కాంట్రాక్టర్లు రాజకీయ నాయకులకు లబ్ది చేకూరుస్తూ రాష్టానికి ఒక గుదిబండలా మారనున్నదని మా అభిప్రాయం. ఉమ్మడి రాష్ట్రంలో బచావత్ ట్రిబ్యునల్, తర్వాత బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ రెండు కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 800టిఎంసిల పునరుత్పత్తి జలాలతో కలిపి 811 కృష నికర జలాలని కేటాయించాయి. రాష్ట్రం విడిపోకముందు ఇందులో 512 టిఎంసి ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులకు 299టిఎంసి తెలంగాణాలో ఉన్న ప్రాజెక్టులకు వినియోగంలో ఉండేవి. విభజన తర్వాత ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు ఉన్న ఆ జాబితాను మొదటి అపెక్స్ కౌన్సిల్ కేంద్ర జలశక్తి మంత్రి, ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. నాటి ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, కెసిఆర్ మినిట్స్‌పై సంతకాలు చేశారు. కానీ తర్వాత కాలంలోదాన్ని తాత్కాలిక ఒప్పందమని కెసిఆర్ వక్రీకరించే ప్రయత్నం చేస్తూ వచ్చారు. రాజకీయ కారణాలతో తెలంగాణ ఎన్నికలకు కాస్త ముందు కేంద్రప్రభుత్వం తెలంగాణ లేవనెత్తిన నీటి వివాదంపై బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ గడువు పొడిగించి ఆ పని అప్పగించింది. ప్రాజెక్టుల వారీగా ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేసిందా లేదా తేల్చి రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదానికి పరిష్కారం చూపెట్టాలని ఆదేశించింది. గోదావరి జలాలపై ట్రిబ్యునల్ అవారుడ మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి 1480 టిఎంసి వచ్చాయి. వీటి వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య విస్పష్టమైన విభజన లేదు. ఆంధ్ర తెలంగాణాల మధ్య తలెత్తిన ఈ సమస్యను కూడా శాశ్వితంగా పరిష్కరించుకోవాల్సి ఉంది. కృష్ణానది జలాలపై ఆధారపడి ఇప్పటికే నిర్మించిన మరియు నిర్మాణంలో ఉన్న రాయలసీమ ప్రాజెక్టులు శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ19, తెలుగుగంగ 29, గాలేరు నగరి 38, కెసి కెనాల్ 10, త్రాగునీటి 3కి మరియు చెన్నయ్ నగరం 15, త్రాగునీటికి కలిపి 114 టిఎంసి నీటిని శ్రీశైలం నుంచి తీసుకెళ్లడానికి పోతిరెడ్డిపాడు వద్ద హెడ్ రెగ్యులేటర్ బనకచర్ల వద్ద ఒక క్రాస్ రెగ్యులేటర్ నిర్మాణమై, వినియోగంలో ఉన్నాయి. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు గుండా బనకచర్ల వరకు గ్రావిటీ ద్వారా పైసా ఖర్చు లేకుండా నీళ్లు పారుతున్నాయి. వరదలు వచ్చినపుడు గరిష్ట స్థాయిలో నీటిని రాయలసీమకు తరలించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయి. బనకచర్ల నుంచి నీళ్ల వెళ్లే ఎస్సార్బీసి, తెలుగు గంగ, గాలేరు నగరి, కెసి కెనాల్ పథకాలకు గ్రావిటీ ద్వారానే నీరందుతుంది. ఒక హంద్రీ నీవాకు మాత్రం శ్రీశైలం జలాశయం నుంచి మల్లాయ / ముచ్చుమర్రి వద్ద నిర్మించిన పెద్దపెద్ద లిఫ్టులతోనే రాయలసీమ ప్రాంతంలోని మెట్ట ప్రాంతాలకు నీటిని అందచేయాలి. ఇప్పటికి గాలేరు నగరి ప్రాజెక్టు నిర్మాణం పాక్షికంగానే జరిగింది. ఇలా చేద్దామని 2014-19 మధ్య ఒక ఆలోచన చేశారు. వైకుంతపురం దగ్గర ఒక బ్యారేజికి శంఖుస్థాపన కూడా చేశారు. కాని అదిప్పుడు అటకెక్కింది. ఇవన్నీ ఇలా ఉంటే 2019 ఎన్నికల తర్వాత కెసిఆర్ జగన్‌లు బాయి బాయి అనుకుంటు ఉన్నప్పుడు కెసిఆర్ ఒక ప్రతిపాదన చేశారు. అదేమంటే ఇచ్చంపల్లి నుంచి గోదావరి జలాలని ఎత్తి తెలంగాణ గుండా పారించి, నాగార్జున సాగర్‌లో కలపాలని, సాగర్ నుంచి రివర్సిబుల్ టర్బైన్‌ల ద్వారా శ్రీశైలంలోకి ఎత్తి పోయాలని అలా పోసి రాయలసీమకు వాడుకోవాలని ఖర్చు చెరిసగం భరించాలని అప్పుడు కృష్ణ నీళ్లు తెలంగాణకు ఇచ్చేయాలనేది ఆ ప్రతిపాదన. దాన్ని ఆనాడే వ్యతిరేకించాం. అది అమల్లోకి రాల్లేదు. కానీ అటువంటి ప్రమాదం ఇంకో రూపంలో ముంచుకొచ్చింది. 2022-23 ప్రాంతంలో మెగా కృష్ణారెడ్డి సలహాతో పోలవరం నీటిని బనకచర్లకు తరలించడానికి వెంటనే ప్రాజెక్ట్ రిపోర్టు ఇవ్వమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌ని ఆదేశించారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ తమవల్లగాక హైదరాబాదులో ఉన్న డబ్లుఏపిసివోఎస్'కి అప్పజెప్పారు. డబ్లుఏపిసివోఎస్ తన దగ్గరున్న విస్తృతమైన డేటాతో మూడు నెలల్లో ఒక చిత్తు రిపోర్టు ఇచిచంది. అదే ఇప్పుడు మనం చూస్తున్నది. ఎన్నికల హడావుడిలో ఆ పథకాన్ని జగన్‌మోహన్ రెడ్డి తలకెత్తులోలేదు.




తిరిగి గెలిస్తే చూద్మానుకుని ఉంటారు. కూటమి భ్రుత్వం గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసి 5,6 నెలలకు మెగా కృష్ణారెడ్డి బృందం మళ్లీ ఒకసారి ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంకో సుదీర్ఘమైన ప్రెజెంటేషన్ ఇచ్చినట్లు వినికిడి. వారి ప్రతిబాదన ప్రకారం తమ కంపెనీ 10-15 వేల కోట్లు కట్టుబడి పెడుతుందని కేంద్రం నుంచి లోన్ ఇప్పించడానికి అనుమతులు ఇప్పించేందుకు తామ సహాయం చేస్తామని కాబట్టి ఈ ప్రాజెక్టుని అనౌన్స్ చేయమన్నారట. ముఖ్యమంత్రి అనౌన్స్ చేసేశారని ప్రచారం జరుగుతున్నది. జగన్‌మోహన్‌రెడ్డి కేవలం 1350 కోట్ల పట్టిసీమ ప్రాజెక్టు విషయంలో చేసిన యాగి అంత ఇంత కాదు. కాని 82వేల కోట్ల పోలవరం బనకచర్ల ప్రాజెక్టు విషయంలో నోరు విప్పకపోవడం ఈ ప్రాజెక్టు ఆయన మానస పుత్రికేనని చెప్పకనే చెపుతున్నది. పాత, కొత్త ప్రభుత్వాలను అనుసంధానించే ఏకైక శక్తి మెగా ఇంజనీరింగ్ సంస్థకే ఉన్నదని బోధపడుతున్నది. ఇంతకు వరుస ముఖ్యమంత్రులు కాంట్రాక్టర్లు అంతగా ఇష్టపడుతున్న పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు అవసరమా లాభదాయకమా నష్టదాయకమా అనే విషయానికొద్దాం.ప్రజలపై తరాల తరబడి పెనుభారం కాబోతున్న ప్రాజెటక్టులు అధికార పక్షం ప్రతిపక్షం ఒకటిగానే నడుస్తున్నాయన్న భావన ప్రజల్లో బలపడుతోంది. ఎన్నో దశాబ్దాల పాటు ప్రభావం చూపే భవిష్యత్ తరాలపై భారం మోపే నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటూ బహుగోప్యంగా ఉంచుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు ప్రజా సంఘాలే ప్రతిపక్ష పాత్ర పోషించాల్సి వస్తోంది. ఆ చొరవలో భాగమే ప్రజలకు మేధావులకు ఈ వివరాలు వెల్లడిచేస్తున్నాము. దీనిపై ప్రజల్లో విస్తృతమైన చర్చ జరిగి రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలు తెలుసుకుని ప్రజలే రక్షించుకోవాలని విజయవాడ ఆలోచనాపరుల వేదిక ప్రతినిధులు ఎబి వెంకటేశ్వరరావు, కంభంపాటి పాపారావు, అక్కినేని భవానీ ప్రసాద్, టి లక్ష్మీ నారాయణ ముక్తకంఠంతో తెలిపారు.

# ఆధ్యాత్మిక ధార్మిక చింతన ద్వారానే మనసుకు శాంతి

**ఎ కొండూరు, జూన్ 25, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడు బాబె ఎ బాగ్దాద్ షరీఫ్‌లో వేంచేసివున్న అలుపెరుగని అన్నదాత నకీబుల్ ఔలియా హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాబా దర్బార్ అండ్ దర్గా గత 63ఏళ్లకు పైగా మత సామరస్యానికి ప్రతీకగా విరాజిల్లుతుంది. ఈ దర్బార్ అండ్ దర్గాలో అలుపెరుగని అన్నదాత అతావుల్లా తన గురువు విజయనగరం హజరత్ సయ్యద్ ఖాదర్ వలీబాబా సందేశం మేరకు అతావుల్లా బాబా సుమారు 63ఏళ్ల క్రితం అన్నదాత క్రతువును ప్రారంభించి కులమతాలకతీతంగా నేటివరకు దేశ విదేశాల నుండి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వచ్చే వేలాది మంది భక్తులకు నిరతాన్నదానం కొనసాగిస్తున్నారు. అతావుల్లా బాబా పరమపదించిన తర్వాత బాబా వారి ఆధ్యాత్మిక వారసుడు పీఠాధిపతి పీర్‌జాదా ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ అతావుల్లా బాబా ఆదేశాల మేరకు అన్నదాన క్రతువులు దిగ్విజయంగా కొనసాగిస్తూ ఈ క్రతువులో బాబా కుటుంబ సమేతంగా సమిదలై వండి వడ్డించి భక్తులకు నేటికి విశేష సేవలందిస్తూ ఆధ్యాత్మిక ధార్మిక సేవాభావంతో భక్తులను ఆధ్యాత్మిక చింతన ద్వారా భక్తుల్లో దైవభీతిని పాదుకొల్పడం ద్వారా భక్తి పారవశ్యాన్ని అన్ని మతాల సారాంశం ఒకటేనని మానవత్వానికి మించిన మతం లేదని ప్రతిఒక్కరు ఇతర మతాలను గౌరవిస్తూ ప్రేమ స్నేహసౌభ్రాతృత్వాన్ని అలవర్చుకుంటూ పరమత సహనం మానవసేవే మాధవసేవ అన్నిదానాల్లో కంటే అన్నదానం మిన్న అనే అతావుల్లా బాబా బోధనలను తు.చ. తప్పకుండా పీఠాధిపతి ఖాజా బాబా, జాఫర్ షరీఫ్, బొగ్దాద్ తాజ్ ఖాదర్‌బాబు, మదని భక్తిపారవశ్యాన్ని పాటిస్తూ విశ్వమానవ కళ్యాణానికి వేదికగా అతావుల్లా బాబా దర్బార్ అండ్ దర్గా నిలుస్తుంది.

# పెద్దతండాలో విద్యుత్తు సరఫరా పునరుద్ధరించిన ఎఈ నాగరాజు


**ఎ కొండూరు, జూన్ 25, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండలం పెద్ద తండా గ్రామంలో విద్యుత్ సరఫరా లేక అంధకారంలో పెద్ద తండా పట్టించుకోని అధికారులు అనే శీర్షికన బుధవారం 'వార్త' డైలీలో ప్రచురితమైన కథనానికి కంభంపాడు సెక్షన్ ఎఈ పి.నాగరాజు స్పందించి సిబ్బందిలో వెళ్లి విద్యుత్ సరఫరాను బుధవారం పునరుద్ధరించారు. ఈ తండా గ్రామంలో 11కెవి మరియు ఎల్‌టి లైన్‌లకు సంబంధించిన విద్యుత్ పోల్స్‌కు ఊకలోడు లారీ ఢీకొనడంతో రెండు విద్యుత్ స్థంభాలు విరిగి కేబుల్ వైరు తెగిపోవడంతో వాటి స్థానంలో రెండు కొత్త పోల్స్ కేబుల్ వైరు కొత్తగా ఏర్పాటు చేసి తండా గ్రామం అందకారంలో ఉన్న సగం తండాకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వార్త కథనానికి కంభంపాడు సెక్షన్ ఎఈ పి.నాగరాజు వెంటనే స్పందించి కొత్తపోల్స్ కేబుల్ ఏరా ్పటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం పట్ల తండా సుగాలిలు (లంబాడాలు) వార్త యజమాన్యాన్ని విద్యుత్ ఏఈ పి.నాగరాజును అభినందించారు.



మచిలీపట్నం పర్యటనలో భాగంగా పామర్రు మండలం నిమ్మకూరు గ్రామం వద్ద మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ గారిని వర్ల కుమార్ రాజా గారు మర్యాదపూర్వకంగా కలిశారు.
పామర్రు జూన్ 25,ప్రభాతవార్త

# సిఎం చంద్రబాబుకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు : బలుమూరి నాగపద్మ

**ఎ కొండూరు, జూన్ 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదయిన సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మహిల ప్రధాన కార్యదర్శి ఎ కొండూరు మాజీ సర్పంచ్ బలుమూరి నాగపద్మ నియోజకవర్గ తెలుగు



మహిళలు విజయవాడ ఎంపి కార్యాలయం గురునానక్ కాలనీ ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును కలిశారు. ఈ సందర్భంగా నాగపద్మ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు అభివృద్ధి సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి నిత్య శ్రామికుడిలా కష్టపడి పనిచేస్తున్నారని రాష్ట్ర రాజధాని పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో చేస్తున్న కృషి సుపరిపాలన తెలుగు ప్రజలకు గర్వకారణమని నాగపద్మ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి చిన్నికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు ప్రమాణస్వీకారం జరిగి ఏడాదయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రశాంతంగా గురుకులంలో మిగులసీట్ల భర్తీకై రాతపరీక్షలు

**ఎ కొండూరు, జూన్ 25, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాలు ఏపిస్టేట్‌లో అన్ని జిల్లాల్లో 6 నుండి 9 వరకు మిగుల సీట్ల భర్తీ నిమిత్తం రాష్ట వ్యాప్తంగా రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసేందుకు గురుకులాల సెక్రటరీ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి కృష్ణాజిల్లా డిసివో జిల్లా కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెం గురుకుల పాఠశాల / కళాశాలలో ప్రిన్సిపాల్ కె.సిద్దయ్య తిరువూరు ప్రిన్సిపాల్ వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రిల ప్రత్యక్ష పర్యవేక్షణలో రాత పరీక్ష నిర్వహించారు. 6వ తరగతిలో 204మంది విద్యార్థులు 7వ తరగతి 195మంది విద్యార్థులు 8వ తరగతిలో 152 మంది, 9వ తరగతిలో 124మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్ష విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సమర్థవంతంగా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, Triveni Golla, w/o Vinod Kumar Yenumula, r/o Morjampadu Village, AP, have changed my name to Triveni Yenumula after marriage on 24/08/2024. I shall be known as Triveni Yenumula henceforth. Sd/- Triveni Golla
Date: 24/06/2025.
(Ro.No.11739)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# కార్యకర్తల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే జూలకంటి

**కారంపూడి, జూన్ 25 ప్రభాతవార్త:** కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ కట్టుబడి పనిచేస్తోందని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కారంపూడి మండలం ఒప్పిచర్లకు చెందిన టీడీపీ కార్యకర్త కోట కోటయ్య మృతి చెందాడు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వం తీసుకున్న కోటయ్య కుటుంబ సభ్యులకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రమాద బీమా రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల కష్టాలను ఎరిగి, నిత్యం వారి అభ్యున్నతి కోసం పార్టీ అధినేత చంద్రబాబు పరితపిస్తూ ఉంటారని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తను ఆపత్కాలంలో బీమా ద్వారా ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన కుటుంబాలకు పార్టీ ప్రమాద బీమా కొంతమేరకు



అండగా నిలుస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, కారంపూడి మండల తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బడుగు,బలహీన వర్గాల పార్టీ తెదేపానే

## వినుకొండ మార్కెట్‌యార్డు ఛైర్మన్ మురళీకృష్ణయాదవ్

**నూజెండ్ల,జూన్25,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మండలంలోని చింతలచెర్వు గ్రామం నూతన కమిటీ ఎన్నిక బుధవారం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షులుగా గుమ్మ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా



మల్లెల చిన్న వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా చింతలచెరువు సుభాని, కార్యదర్శిగా జి. ఎర్రకోటయ్య, బూత్ కన్వీనర్‌గా బత్తిన రామయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,వినుకొండ వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్ మీసాల మురళీకృష్ణయాదవ్, జెడ్పిటిసి సుబ్బులు రామయ్య, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి వంకాయలపాటి పేరయ్యలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉండే పార్టీ తెలుగుదేశం అన్నారు. పార్టీలో కష్టపడి పని చేసేవారికి గుర్తింపు, సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. గ్రామంలో, మండలంలో పార్టీ బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం,అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేలా ప్రతి కార్యకర్త, నాయకుడు పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో యూనిట్ ఇంచార్జి బాబురావు, సాగునీటి సంఘం అధ్యక్షులు లేళ్ళ శేషయ్య, సర్పంచ్ కొండలు, అపా ్వరావు, మాజీ సర్పంచ్‌లు వెంకటరెడ్డి, బొరిగొర్ల సుబ్బయ్య, చాపలమడుగు మస్తాన్, సుభాని, లేళ్ళ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి మృతి

## - నిస్వార్థ ప్రజాసేవకుడని కొనియాడిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

**రెంటచింతల, జూన్ 25 ప్రభాతవార్త:** రెంటచింతల గ్రామ సర్పంచ్‌గా 18 ఏళ్లపాటు ప్రజలకు సుదీర్ఘ సేవలు అందించిన నిరాడంబరుడు మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి (79) అనారోగ్యంతో బుధవారం ఉదయం స్వగృహంలో పరలోక ప్రాప్తి చెందారు. స్వతహాగా కాంగ్రెసన అభిమానియైన ఆయన నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి కృష్ణారెడ్డిలతో సన్నిహిత సంబంధాలు కలిగి విధేయత కనపరిచారు. మృదుస్వభావ లక్షణంతో అందరి ఆదరాభిమానాలతో 1970 నుంచి 1988 వరకు వరుసగా మూడుసార్లు సర్పంచ్‌గా గెలిచి వివాదరహితుడిగా మర్రెడ్డి పేరొందారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలపై స్పందిస్తూ వారి అభిమానాన్ని చూరగొన్నారు. తన పదవీకాలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కృషి చేయడంతోపాటు లబ్ధిదారుల ఇళ్ల పట్టాల ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన ఫీజులన్నింటినీ తానే చెల్లించి ఉదాత్తతత చాటుకున్న ఆయన కాలనీ ఏర్పాటులో కీలకపాత్ర వహించారు. అలాగే గ్రామంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ ఏర్పాటులోనూ ఆయన కృషి దాగుంది. వర్గ వైషమ్యాలకు దూరంగా ఉండి నీతి నిజాయితీతో సర్పంచ్‌గా వివిధ పార్టీ రాజకీయ నేతలచే గౌరవింపబడిన మర్రెడ్డి నిరాడంబర వ్యక్తిత్వం ఆదర్శ ప్రయామని పలువురు గ్రామ పెద్దలు పేర్కొంటూ ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మర్రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించగా, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి రెంటచింతల విచ్చేసి భౌతిక కాయానికి పూలమాల వేసి



ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన వారిలో సర్పంచ్ పూజల పద్మావతి, వైకాపా నేత పూజల రామయ్య, తెదేపా నేతలు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు, కాంగ్రెస్ నేత రాగిడి ప్రతాప్‌బాబు, ఆర్యవైశ్య సంఘం నేతలు యేచూరి వెంకట సైదయ్య, ఆకుల నరసింహారావు, స్థానిక పంచాయతీ సిబ్బంది, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పల్లెర్ల కేశవరెడ్డి, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు పలువురు రాజకీయ నేతలు ఉన్నారు.

# 28న మానవ హక్కుల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రం ఆవిష్కరణ

**తెనాలి, జూన్ 25 (ప్రభాతవార్త) :** తెనాలి పోలీసులు అరాచకాన్ని మానవ హక్కుల ఉల్లంఘనను నిలదీస్తూ ఈనెల 28వ తారీఖున సాయంత్రం 4గంటలకు తెనాలి ఐతానగర్, శ్రీపొట్టి శ్రీరాములు కమ్యూనిటీ హాల్ నందు



జరుగు మానవ హక్కుల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం కమ్యూనిటీ హాల్‌లో కరపత్రం ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో ప్రముఖ న్యాయవాది పిల్లిపాల్ రవీంద్ర, విద్యాసాగర్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, రైతు సంఘాల నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, అంబేద్కరిస్టు రాయిపూడి వెంకటేశ్వరరావు, ప్రగతిశీల కార్మిక సంఘం సమైక్య సభ్యులు నన్నం పోతురాజు, అంబేద్కర్‌రైట్, ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి యండ్రపాటి అశోక్‌కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గడ్డిటి సుందర సునీల్‌కుమార్, న్యాయవాది తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షులు పేరూరి మురళికుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ఫ్రాన్సిస్ రాజు, జాన్ విక్టర తండ్రి చేబ్రోలు ఇశ్రాయేలు, దోమ రాకేష్, తండ్రి దోమవాసు, మాలమహానాడు సోహన్‌లాల్, జాకబ్ తదితరులు పాల్గొన్నారు. తెనాలి పోలీసులు దళిత మైనార్టీ యువకులపై అక్రమ కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌లో బహిరంగ ప్రదేశాల్లో అరికాళ్ళపై లాఠీలు విరిగేటట్లుగా అమానుషంగా దాడి చేసిన సంఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యూడిషయల్ విచారణ జరిపించాలి. చట్ట ఉల్లంఘనకు పాల్పడిన తెనాలి టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ రాముల నాయక్ మరియు త్రీటౌన్ పోలీస్ స్టేషన సిఐ రమేష్‌బాబులతో పాటు ఈ అరాచకములో పాల్గొన్న కానిస్టేబుళ్ళపై కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి. తెనాలి పోలీసులు నడిరోడ్డుపై థర్డ్ డిగ్రీ ఉపయోగించడాన్ని సమర్థిచి వారికి వత్తాసు పలికిన గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌పై చట్టపరమైన చర్యలు చేపట్టాలి. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధులు, రాష్ట్ర మంత్రులు మరి ముఖ్యంగా హోం మంత్రి పోలీస్ చట్ట వ్యతిరేక చర్యలను బలపరుస్తూ చేస్తున్న వ్యాఖ్యలపై ఉన్నత న్యాయస్థానాలు జాతీయ మానవ హక్కుల సంఘం, జాతీయ ఎస్సీ కమీషన స్పందించి తగిన చర్యలు చేపట్టాలి. పోలీసులు చెప్పున్న కాకమ్మ కథల్నీ వల్లివేస్తూ రాజకీయ నాయకులు, రాజ్యాంగ నిపుణులులాగా పోలీసు థర్డ్ డిగ్రీని నిస్సిగ్గుగా బలపరుస్తున్నారు. ఈ కేసులో వాస్తవాలను బయటకు తీయకుండా రాజ్యాంగానికి చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం తమ రాజకీయ స్వార్థం కోసం తప్పు చేసిన పోలీసులకు కొమ్ముకాస్తుంది. దళిత, మైనార్టీ వర్గాలకు చెందిన యువకులపై తప్పుడు కేసులు పెట్టి, అమానుషంగా దాడి చేసిన పోలీసులను కఠినంగా శిక్షించాలని, ఈ సంఘటనపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో జ్యూడిషియల్ ఎంక్వైరీ జరపాలని, తెనాలి పోలీసులు చేసిన చట్టవిరుద్ధమైన చర్యలను బహిరంగంగా బలపరిచిన గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని, రాజ్యాంగంపై ప్రమాణం చేసి ప్రజాప్రతినిధులు, రాష్ట్ర మంత్రి మరి ముఖ్యంగా హోమ్ మంత్రి బాధ్యతాయుతమైన పదవులలో ఉండి కూడా చట్ట విరుద్ధమైన పోలీస్ చర్యలను సమర్థించటానికి ఉన్నత న్యాయస్థానాలు, జాతీయ మానవ హక్కుల కమీషన్, ఎస్సీ మరియు మైనార్టీ జాతీయ కమీషన్‌లు స్పందించాలని డిమాండ్ చేస్తున్నాము. మానవ హక్కుల పరిరక్షణకు చట్టబద్ధ పాలనకు జరుగుతున్న మానవ హక్కుల పరిరక్షణ సదస్సులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

**మంగళగిరి, జూన్ 25, ప్రభాతవార్త :** అమావాస్యను పురస్కరించుకుని శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మన్ పందేటి సాంబశివరావు నేతృత్వంలో మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం మెట్ల మార్గం వద్ద



భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం జరిగింది మంగళగిరి పవిత్ర పుణ్య క్షేత్రంలోని దేవాలయాల దర్శనార్థం విచ్చేసిన సుమారు 2 వేల మందికి పైగా భక్తులు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారుఈ సందర్భంగా శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఛైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ పరమశివుని ఆశీస్సులతో గత 2 సంవత్సరాలుగా నిర్విరామంగా ప్రతి నెలా వచ్చే అమావాస్య సందర్భంగా తమ ట్రస్ట్ ద్వారా 40 మంది దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే వేసవికాలంలో తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రతిరోజు పాదచారులకు, ఆర్టీసీ బస్సులు, ఆటోల ప్రయాణికులకు చల్లటి మినరల్ వాటర్ ను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు ప్రతి సోమవారం సుమారు ఒ1000 మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమాలను చేశామని అన్నారు ఆధ్యాత్మిక భావంతో, ధార్మిక సేవలో భాగంగా ప్రతి నెలా అమావాస్య నేపథ్యంలో అన్న ప్రసాద వితరణ బృహత్తర కార్యక్రమానికి తమ ట్రస్ట్ సభ్యులు, దాతలు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నారని వారికి ఈ సందర్భంగా పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఛైర్మన్ పందేటి సాంబశివరావు, ట్రస్ట్ ప్రతినిధులు నంగళంప్రసాదు, కర్నాటి శివసత్యనారాయణ, దుంపల సోములు, పెరుమాళ్ళ సుబ్రమణ్యం, పంచల శివన్నారాయణ, ఖగ్గా శ్రీనివాసరావు, మారం మల్లిఖార్జునరావు, చీదెళ్ల వాసు, చిరుమామిళ్ళ రంగారావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, కోదాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# ఆఫర్లతో మూడు రోజుల సంబరం

**విజయవాడ, జూన్ 25, ప్రభాతవార్త :** భారతదేశంలో మొట్టమొదటి మూడు రోజుల సంబరం అని అమేజాన్ ఇండియా ప్రకటించింది. జులై 12 ఉదయం 12 నుండి జులై 14రాత్రి 11.59వరకు 72గంటల పాటు అమలులో ఉండే ఈ సంబరంలో గొప్ప డీల్స్ ఆదాలు నూతన విడుదలలు ప్రత్యేక వినోదం అన్నీ ప్రైమ్ సభ్యుల కోసం ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి.

# ఎరువుల డీలర్లకు ఈపాస్ మిషన్లు అందజేత

**మాచర్ల, జూన్ 25 ప్రభాతవార్త:** మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకులు వి.జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఎరువుల డీలర్లకు ఈపాస్ మిషన్లను అందజేశారు. బుధవారం మాచర్ల సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న ఎరువుల



డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మకం చేసిన వవెంటనే ఈపాస్‌లో ఎరువుల సేల్ నమోదు చేయాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు డి.పాపకుమారి, వై.పుల్లారెడ్డి, టి.బాలాజీ గంగాధర్, మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల, గురజాల మండలాల ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# మస్తాన్‌వలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ!

**మాచర్ల, జూన్ 25 ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ మస్తాన్‌వలి (70), ఆయన కుమారుడు షేక్ జాకీర్ (35)లు అనారోగ్యంతో ఒకేరోజు మృతి చెందారన్న వార్త తన మనసును ఎంతగానో కలచివేసిందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని సవేరా లాడ్జి వీధిలో నివాసముంటున్న మస్తాన్‌వలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జూలకంటటి, ఆయన తనయుడు గౌతమ్‌రెడ్డి, కూటమి పార్టీల పెద్దలు పరామర్శించారు. ఇంటి పెద్దను, ఎదిగిన కుమారుడిని ఒకేరోజు కోల్పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి ఎమ్మెల్యే జూలకంటి లక్ష రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాచర్ల పట్టణ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## -సూపర్‌వైజర్ రజని

**కొల్లూరు,జూన్ 25 (ప్రభాతవార్త) :** ప్రజలందరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కొల్లూరు, దోనేపూడి సెక్టార్ల ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు రజని, ఫజరున్నీసా అన్నారు. బుధవారం కొల్లూరు, దోనేపూడి హై స్కూల్ ఆవరణలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు రజని, ఫజరున్నీసా మాట్లాడుతూ ఆరోగ్యానికి హానికరమైన ఏదైనా మత్తు పదార్థం



వాడకూడదన్నారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే విధంగా అంగన్‌వాడీలు కృషి చేయాలన్నారు. సమాజం నుండి మత్తు పదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలకు ప్రజలు సహకారం అందించాలన్నారు. మత్తు వ్యసనానికి సంబంధించిన ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మీ, నీరజ, వనజ, అపర్ణ, అరుణ, సౌభాగ్యలక్ష్మీ, బసవపూర్ణ, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**కారంపూడి, జూన్ 25 ప్రభాతవార్త:** కారంపూడి మండలంలో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావు



తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. విత్తన నిల్వలు, బిల్లు పుస్తకాలు, కొనుగోలు అమ్మకాల రసీదులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అనుమతి లేని పత్తి విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గరిష్ట ధర కంటే అధిక రేట్లకు అమ్మితే రైతులు మండల వ్యవసాయాధికారికి తెలియజేయాలన్నారు. రైతులు తప్పనిసరిగా షాపుల నుంచి కొత్త విత్తనాలకు సంబంధించిన బిల్లులు తీసుకుని, భద్రపరచుకోవాలన్నారు. విత్తన దుకాణదారులు వారికి వచ్చిన విత్తనాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మండల వ్యవసాయాధికారికి తెలియజేయాలన్నారు. ఎక్కడైనా అనధికారికంగా విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే, రైతులు ఆ సమాచారాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారికి వెంటనే తెలియజేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**తెనాలి, జూన్ 25 (ప్రభాతవార్త) :** ప్రజలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలకు ఎంత దూరంగా ఉంటే అంతమంచిదని, ఒన్‌టౌన్ సిఐ




మల్లిఖార్జునరావు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడకుండా తమ జీవిత లక్ష్యాలను చేరుకోవాలని, మాదక ద్రవ్యాల ఉచ్చులో పడితే అనారోగ్య బారిన పడి జీవితాలు తారుమారు అవుతాయని, తద్వారా తమ కుటుంబాలు సమాజంలో తలెత్తుకొలేవని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సిఐ మల్లిఖార్జునరావు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఎద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులపై అశ్రద్ధ చూపవద్దు : డీపివో

**యడ్లపాడు, జూన్ 25, ప్రభాతవార్త :** గ్రామాలలో తడి చెత్త, పొడి చెత్త మరియు పారిశుద్ధ్య పనులపై అశ్రద్ధ లేకుండా నిత్యం ఉదయాన్నే సేకరణ పనులు నిర్వహించాలని జిల్లా గ్రామ పంచాయితీ అధికారి యస్‌వి నాగేశ్వరనాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామ



సచివాలయాన్ని అయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, వాటర్ ట్యాంకు పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు ఐవిఆర్ ద్వారా కాల్స్ చేస్తూ పరిశుభ్రతపై విచారణ నిర్వహించుతుందని, అందులో భాగంగా వంకాయలపాడు గ్రామ పంచాయితీ 38 శాతం మాత్రం వచ్చిందని, దీనిని మెరుగు పర్చుకోవాల్సిన అవసరం ఎతైనా ఉందని అయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, పంచాయితీ కార్యదర్శి నండూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక తనిఖీలో బయట పడిన 2.85లక్షల రికౌరీ

**యడ్లపాడు, జూన్ 25, ప్రభాతవార్త :** యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన 17వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించిన సర్వేకు సంబంధించి మండల పరిధిలోని 18 గ్రామాలలో నిర్వహించిన పనుల పరిశీలనలో 2.85లక్షల వరకు రికౌరీకి అదేశించినట్లు




ఏపివో డి సుందరరావు తెలిపారు. అయన వివరిస్తూ 2024/25 సంవత్సరాలకు సంబంధించి సమాజిక బృందం నిర్వహించిన పరిశీలనలో వివిధ రకాల పనులకు సంబంధించి వారు గుర్తించిన లోపాలపై 2.85లక్షల రికౌరీ రాయటం జరిగిందన్నారు. వీటిని అప్పుడు విధులు నిర్వహించిన ఎన్‌అర్‌జీఎస్ ఎపీవో, టిఎ, ఫీల్డ్ స్టాఫ్ అధికారులు జమచేయ వల్సి ఉంటుందన్నారు. గత 16వ విడత రికౌరీల కంటే 17వ విడత రికౌరీలు అధికంగా ఉన్నాయి.ల

# సర్వీస్ రోడ్డు ప్రక్కన డ్రైన్‌లో వ్యక్తి మృతదేహం లభ్యం

**యడ్లపాడు, జూన్ 25, ప్రభాతవార్త :** యడ్లపాడు గ్రామ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో వ్యక్తి మృతదేహం వెలుగు లోకి వచ్చిన సంఘటన బుధవారం చోటు చేసు కుంది. సంఘటన ప్రాంతాన్ని నర్సరావుపేట డిఎస్పీ డి నాగేశ్వరరావు, రూరల్ సీఐ సుబ్బనాయుడు,



ఎస్సై టి శివరామకృష్ణ సంఘటనా స్థలంకు చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ డి నాగేశ్వరరావు వివరిస్తూ ఉదయం సుమారు 9గంటల ప్రాంతములో కాల్చివేసి ఉన్న వ్యక్తి మృత దేహం ఉన్నదన్న సమాచారం హైవే సిబ్బందికి రావటంతో సంఘటనా స్థలంకు విచ్చేసి పరిశీలించటం జరిగిందని, అయితే సుమారు 35సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి అయ్యి ఉంటాడని, శరీరం అంతా తగలబెట్టి ఉందని, తల



భాగం మాత్రం కాలలేదని, శరీరం మొత్తం ఫ్లెక్సీ చుట్టి ఉందని, ఎక్కడన్న హత్య చేసి, తగలబెట్టి ఇక్కడకు వచ్చి వేసి ఉంటారన్న అనుమానం ఉందని, దీనిపై అన్ని కోణాలలో విచారణ నిర్వహించుతున్నామని, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్స్ వంటివి సేకరిస్తున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించిన అనంతరం విషయాలు వెలుగులోకి రావటం జరుగుతుందని తెలిపారు. పంచనామా నిర్వహించి చిలకలూరిపేట వైద్యశాలలోని మార్చురీకి తరలించటం జరిగిందన్నారు.

# రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**వినుకొండ,జూన్25,ప్రభాతవార్త:** మండలంలోని గోనుగుంట్లవారిపాలెం, హసన్నాయునిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు వరిసాగు సస్యరక్షణ చర్యలు వ్యవసాయాధికారులు తెలియజేశారు. కౌలు రైతు కార్డుల గురించి అవగాహన కల్పించారు. సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలు అందజేయడం జరుగుతుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఏఏ దుర్గా ప్రసాద్‌నాయక్, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా గురుపౌర్ణమి మహోత్సవములు


**వినుకొండ,జూన్25,ప్రభాతవార్త:** పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ నందు గల శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానం నందు 34వ గురు పౌర్ణమి మహోత్సవములు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం



నందు రంగులతో భారీ వినాయకుడిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 29 ఆదివారం వరకు ఉదయం 11 గంటలకు ప్రత్యే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు డి ప్రసాద్, కొల్లిపర సుబ్రహ్మణ్యం, దోసపాటి బాబు, ఐటిసి బాబు, సభ్యులు తాతా పాండురంగారావు, మోటమర్రి నాగేశ్వరరావు, పి. ప్రసాద్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు పోతుకూచి శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


# చినపులివర్రులో పొలం పిలుస్తుంది

**కొల్లూరు,జూన్ 25 (ప్రభాతవార్త:** మండల పరిధిలోని చినపులివర్రు గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో మండల



వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నరేంద్రబాబు మాట్లాడుతూ వరి పంట నందు విత్తనశుద్ధి, వరినారు పెంచుట విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కిలో వరి విత్తనశుద్ధి, వరి నారు పెంచుట విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కిలో వరి విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజమ్‌ను కలిపి 24గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలని తెలియజేశారు. వరి పంటలో విత్తనశుద్ధి చేయడం వలన నేల ద్వారా మరియు విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ళ నుండి పంటను రక్షించవచ్చు అని ఆయన అన్నారు. ముడిని 10-12రోజుల వ్యవధిలో మూడు దఫాలు దమ్ము చేసి చదును చేయాలి మీరు పెట్టటానికి తీయడానికి వీలుగా కాలువను ఏర్పాటు చేయాలన్నారు. ఐదు సెంట్ల నారుమడికి 2కిలోలల నత్రజని 1కిలో విత్తనం చల్లే ముందు వరిలో విత్తన 12-14రోజులకు,1కిలో భాస్వరం మరియు 1కిలో పటాస్ నిచ్చే ఎరువులను దిక్కులో వేయాలని, చలి ఎక్కువగా ఉండే ప్రాంతంలో భాస్వరం రెట్టింపు వేయాలని ఆయన అఆన్నరు. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. విత్తన పి రోజులకు కోర్బో ఫిరాన్ 3జి గుళికలు సెంటు నార్మోడికి 160గ్రాముల చొప్పున వేయాలి లేదా క్లోరిపైపాస్ 2మి.లీ లీటర్ నీటికి కలిపి విత్తన పది రోజులకు 17రోజులకు పిచికారి చేయాలి, దేదా నారు తీయటానికి 7రోజుల ముందు సెంటు నారు ముడికి 160గ్రాముల కార్బో ఫిరాన్ గుళికలు ఇసుకలో కలిపి పలుచుగా నీరు ఇచ్చి వేయాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చినపులివర్రు సర్పంచ్ లామ్ శివరత్నకుమారి, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం.ప్రభాకర్‌రావు, బి.ఎన్.వంశీ, కె.విజయ్‌కుమార్, వీఆర్వ రాంబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవోపీఆర్డిగా సుబ్బారావు



**కొల్లూరు,జూన్ 25, ప్రభాతవార్త :** కొల్లూరు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.సుబ్బారావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. ఈయన ప్రకాశం జిల్లా చిన్నగంజాం నుండి కొల్లూరుకు బదిలీ అవ్వగా ఇక్కడ పని చేసిన పి.సునీత ప్రమోషన్‌పై మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా క్రాశం జిల్లా మండమూరికి బదిలీపై వెళ్ళారు.

# మాస్టర్‌మైండ్స్ జాతీయస్థాయి ఫస్ట్ ర్యాంకర్లకు రాష్ట్రపతి ప్రశంసలు

**గుంటూరు విద్య,జూన్ 25,ప్రభాతవార్త :** సీఎంఏ ఫైనల్ పరీక్షా ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకుల సాధించిన మాస్టర్ మైండ్స్ విద్యార్థులు రిషబ్







ఓస్వాల్ ఆర్,కొత్తపేట తేజస్వీనీలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసల జల్లు కురిపించారు.ఆయా విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.న్యూఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ఆయా విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ వివిధ కామర్స్ కోర్సుల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు 55సార్లు ఫస్ట్ ర్యాంకులు సాధించడం జరిగిందన్నారు.కానీ ఈసారి ఫైనల్ లెవల్లో ఇద్దరు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు రావడం చాలా అరుదైన విషయమని మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ సిఏ మట్టుపల్లి మోహన్ తెలిపారు.ఇలాంటి ఉత్తమ ఫలితాలను సాధించడానికి కృషిచేసిన విద్యార్థులకు సహకరించిన వారి తల్లిదండ్రులకు అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బందికి ఈ సందర్భంగా మట్టుపల్లి మోహన్ ధన్యవాదాలు తెలిపారు.

# పంచాయతీల అభివృద్ధిపై ప్రజల మధ్యలోనే చర్చిద్దాం

## కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, పంతం నానాజీ

**మంగళగిరి, జూన్ 25, ప్రభాతవార్త :** వైసీపీ నాయకులు గడప దాటి గ్రామాల్లోకి వెళ్ళి చూస్తే ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్,




గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పవన్ కళ్యాణ్ చేసిన అభివృద్ధి ఏమిటో కళ్లకు కట్టినట్లు తెలుస్తుంద్దని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, పంతం నానాజీ చెప్పారు. రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టి, ప్రతి గ్రామాన్ని 80 లక్షల టన్నుల చెత్తలో నింపేసి వైసీపీ అధికారంలో నుంచి దిగిపోయిందని, దాన్ని మొత్తంగా కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తూ ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. ఇంట్లోని మహిళలను అడ్డుపెట్టుకొని అరెస్టు నుంచి తప్పించుకోవాలని, చట్టం కళ్లు గప్పాలని చూస్తున్న మాజీ మంత్రి పేర్ని నానికి, పరదాల చాటున పరిపాలన చేసిన వైసీపీ నాయకుడికిగాని ఇవన్నీ తెలుస్తాయనుకోవడం తప్పని పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో విధ్వంసం అయిన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం గత వైసీపీ అయిదేళ్ల విధ్వంసకర పాలనా యద్ధం తర్వాత రాష్ట్రాన్ని తిరిగి పునర్నిర్మించుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి ,పవన్ కళ్యాణ్ బాధ్యతాయుతంగా ముందుకు వెళ్తున్నారని, ఇప్పుడు పేర్ని నాని వంటి వారు పవన్ కళ్యాణ్ .ని ఇష్టానుసారం విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదు. వ్యవస్థలను పూర్తిగా నాశనం చేసిన వైసీపీ నాయకుడు, ఇప్పుడు వ్యవస్థల గురించి చెబుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగానే ఉందన్నారు.

**కబ్జాకోరు... భూ బకాసురుడు పేర్నినాని**

చిల్లపల్లి శ్రీనివాసరావు..ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ శ్రీ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ "దేశం గురించి, రాష్ట్ర ప్రగతి గురించి నిత్యం ఆలోచించే నాయకుడు పవన్ కళ్యాణ్ పాలన పగ్గాలు చేపట్టిన దగ్గర నుంచి ప్రజలలో ఉంటూ, అభివృద్ధి కోసం నిత్యం తపిస్తున్న ఉప ముఖ్య మంత్రి వర్యుల గురించి ఇష్టానుసారం మాట్లాడటం వైసీపీ నాయకులు మానుకోవాలి.




అస్తవ్యస్తంగా మారిన జల్ జీవన్ మిషన్ పనులను, నిధుల లభ్యతను తిరిగి గాడిలో పెట్టడానికి కేంద్రంతో మాట్లాడి ఒప్పించారు. పంచాయతీలకి గౌరవం, వైభవం పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. గిరిజనులకు రోడ్లును వేస్తూ, వారికి ఆరోగ్య సేవలను దగ్గర చేశారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వంతో పలు దఫాలు చర్చించి కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకువచ్చారు. ఆయన చేస్తున్న పనులు రాష్ట్ర ప్రజలకు అర్థం అవుతున్నా, వైసీపీ నేతలకు మాత్రం కనిపించకపోవడం శోచనీయం అన్నారు.వ్యవస్థలను నాశనం చేసిన వైసీపీ ఇప్పుడు వ్యవస్థలు, శాఖల పని తీరు గురించి మాట్లాడడానికి కూడా సరిపోద్ను అన్నారు

# ఎమర్జెన్సీ డే సెమినార్

**గుంటూరు విద్య,జూన్ 25,ప్రభాతవార్త :** నేషనల్ కాంగ్రెస్ విధించిన చీకటి అధ్యాయనమైన ఎమర్జెన్సీడేకి 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా స్థానిక బ్రాడీపేట మాస్టర్‌మైండ్స్ రవి క్యాంపస్‌లో బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన సెమినార్



జరిగింది.కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన టుబాకో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ డే అంటేనే చీకటి రోజని మన హృదయాలు గాయపడిన రోజని గుర్తుచేశారు.ఒక వ్యక్తి తన అధికారాన్ని కాపాడుకునేందుకు ప్రకటించిన ఎమర్జెన్సీ దేశచరిత్రలో మాయని మచ్చగా మిగిలి పోయిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పాలనో ఇందిరాగాంధీ 1975 జూన్ 25న ప్రకటించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్య ఆత్మపై దాడి చేసిందన్నారు.ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించి అత్యవసర పరిస్థితిని అమలు చేసిందని పేర్కొన్నారు.భారతీయ జనతాపార్టీ ఎమర్జెన్సీ తర్వాత ప్రజల నిజమైన గొంతుగా ఎదిగిందన్నారు.బిజేపి హెడ్ క్వార్టర్ ఇన్‌చార్జీ మకుటల శివ మాట్లాడుతూ ఇందిరాగాంధి ప్రధానమంత్రిగా విధించిన ఎమర్జెన్సీ రోజులను చీకటి రోజులుగా అభివర్ణించారు.ఒక వ్యక్తి యొక్క నియంతృత్వ పోకడలకు అధికార దాహానికి ఎమర్జెన్సీ ఒక నిదర్శనమన్నారు .దేశంలో రాజ్యాంగం ప్రవేశపెట్టిన 25సంవత్సరాల్లోనే రాజ్యాంగం యొక్క హత్య ఈ దేశంలో ఇందిరాగాంధీ చేతుల మీదుగా జరిగిందని విమర్శించారు .జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిజేపి జాతీయ కౌన్సిల్ మెంబర్ జూపూడి రంగరాజు,మాస్టర్‌మైండ్స్ అధినేత మట్టుపల్లి మోహన్,జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్,కార్యక్రమ కో-కన్వీనర్స్ మార్తా నరేంద్ర,కోట శ్రీనివాస్, నారాయణరెడ్డి,రాష్ట్ర నాయకులు పాలపాటి రవికుమార్,వెలగలేటి గంగాధర్ ,రాచమల్లు భాస్కర్,తాడువాయి రామకృష్ణ,మండల అధ్యక్షులు బెహరా గాయత్రి,మల్లాల లక్ష్మణ్ గౌడ్,వక్కలగడ్డ తిరుమలరావు,తంగా లక్ష్మణ్‌రావు,జిల్లా నాయకులు భజరంగ్ రామ కృష్ణ,దర్శనపు శ్రీనివాస్,దారా అంబేడ్కర్, ఈమని మాధవరెడ్డి,దేసు సత్యనారాయణ, యస్వంత్,సురేష్ జైన్,షేక్ సాంబశివరావు,లక్ష్మీకుమారి,అనురాధ,శారద,బాబురావు,అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# భాజపా కార్యాలయానికి స్థలం కేటాయింపు పై తులిమిల్లి రామకృష్ణ యాదవ్ హర్షం

**మంగళగిరి, జూన్ 24, ప్రభాతవార్త :** ఆంధ్రుల రాజధాని అమరావతిలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రెండు ఎకరాలు స్థలం కేటాయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు గుంటూరు జిల్లా ఓబీసీ అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కూటమిలోని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ కు పూర్తి సహకారం అందిస్తూ, ప్రత్యేకంగా నిధులను కేటాయించడంతో డబుల్ ఇంజన్ తో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పరుగులు పెడు



తుంది.కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తుందన్నారు ఆంధ్రప్రదేశ్ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలుకు నిరంతరం పనిచేస్తూ మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అనే సందేశాన్ని ప్రజల నుంచి పొందుతుందన్నారు. ప్రజలకు సుపరిపాలన తోపాటు అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ రాష్ట్ర ప్రగతికి అహర్నిశలు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంద అన్నారు. రాక్షస పాలనను అంతమొందించి కూటమి ప్రభుత్వం ఎన్నుకున్న ప్రజలు కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో స్వేచ్ఛా వాతావరణంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని రామకృష్ణ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ ల ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని కొనియాడారు. కేవలం ఏడాది కాలంలోనే ఎన్నో మార్పులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పనిలో నిమగ్నమైందని అన్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని మంత్రి నారా లోకేష్ దేశంలోని మోడల్ ఎన్నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.

# డాక్టర్ మోర్ల శ్రీనివాసరావు భారత సేవా రత్న 2025 నేషనల్ అవార్డు

**పిట్టలవానిపాలెం,జూన్25,ప్రభాతవార్త:** పిట్టలవానిపాలెం గ్రంథాలయ అధికారి డాక్టర్ మోర్ల శ్రీనివాసరావు ఆయన చేసిన సేవలకు అంతర్జాతీయ మనం ఫౌండేషన్ వారు 9వ వార్షికోత్సవం సందర్భంగా భారత సేవా రత్న 2025 నేషనల్ అవార్డు కు ఎంపికచేయడం జరిగింది అని, ఈ అవార్డును జులై 11వ తేదీన హైదరాబాదులోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో ముఖ్య అతిధుల సమక్షంలో ఈ అవార్డు అంద చేస్తామని అంతర్జాతీయ మనం ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ కే చక్రవర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు. గ్రంథాలయ అధికారి మోర్ల శ్రీనివాసరావు ఈ అవార్డుకు ఎంపికైనందుకు పలువురు ప్రముఖులు, గ్రంథాలయ పాఠకులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు.



# కాంగ్రెస్ పార్టీ దురాగతాలను ప్రజలకు తెలియజేటమే బిజెపి ముఖ్యఉద్దేశం


**బాపట్ల, జూన్25,ప్రభాతవార్త:** సొంత పార్టీలో తనకు వస్తున్న తీవ్ర వ్యతిరేకతను అధిగమించడానికి భారత మాజీ ప్రధాని




ఇందిరాగాంధీ 50సంవత్సరాల క్రితం అత్యవసర పరిస్థితి విధించి ప్రజలకు నిరంకుశ పాలన అందించారని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు కొండముది బంగారు బాబు అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజల స్వేచ్ఛ స్వాతంత్ర్యాలని హరించే విధంగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ అధికారమే పరమావధిగా ప్రధాని పదవి నుంచి తొలగిపోవడానికి ఏర్పడ్డ పరిస్థితులను, సొంత పార్టీలో తనకు వస్తున్న తీవ్ర వ్యతిరేకతను అధిగమించడానికి అత్యవసర పరిస్థితి విధించి ప్రజలకు నిరంకుశ పాలన అందించారని, ఆనాటి ఎమర్జెన్సీ సమయంలో పరిస్థితులు ఇప్పటి తరానికి తెలియజేయడమే తమ ముఖ్య ఉద్దేశం అని అన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రాంపల్లి జగన్నాథ శాస్త్రి, పట్టణ అధ్యక్షులు బ్రహ్మాండం బాల నారాయణ, అసెంబ్లీ కన్వీనర్ మనీ యాదవ్, జిల్లా కోకన్వీనర్ మోర్ల కృష్ణ ప్రసాద్ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు, అగ్నికుల క్షత్రియ స్టేట్ డైరెక్టర్ వి. వెంకటేశ్వరరావు, కర్లపాలెం మండల మాజీ అధ్యక్షులు షేక్ కరీముల్లా, పట్టణ యువమోర్చా అధ్యక్షుడు నాళం నరేష్ జిల్లా కార్యదర్శి కాకర్ల వెంకటేశ్వరరావు, మువ్వల శ్రీనివాసరావు,అసెంబ్లీ ఇన్చార్జ్ కొండారెడ్డి అనిల్ కుమార్, కొర్ర వెంకట రామకృష్ణ పాల్గొన్నారు

# పట్టణ తెలుగుయువత అధ్యక్షునిగా నాగం కార్తీక్

**సత్తెనపల్లి, జూన్ 25 ప్రభాతవార్త :** పట్టణ తెలుగు యువత అధ్యక్షునిగా నాగం కార్తీక బుధవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ పార్టీ పటిష్ఠతకు



తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన మాజీమంత్రి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అవకాశం రావడానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పేరు పేరున ధన్యవాదాలు తెలియజేశారు.

# అన్నవరం గ్రామంలో మలేరియా ర్యాలీ

**రొంపిచర్ల, జూన్ 25 ప్రభాతవార్త :** మండలంలోని అన్నవరం గ్రామంలో బుధవారం మలేరియా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో దోమల కుట్టడం వలన వచ్చే అనర్థాలను తెలియజేశారు. అదే విధంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి తెలియజేశారు. ఈ వ్యాధుల లక్షణాలను తెలియజేశారు. దోమతెరలను తప్పనిసరిగా వాడాలన్నారు. వారంలో ప్రతి ఫ్రైడేను డ్రై డే గా పాటించాలన్నారు.

# పారిశ్రామికవేత్తలుగా తయారు చేసే విధంగా వార్షిక ప్రణాళిక

**బాపట్ల, జూన్25,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు ఒక ఇంటికి ఒక సుస్థిరమైన జీవనోపాధి లేదా పారిశ్రామికవేత్తను తయారు చేసే విధంగా వార్షిక ప్రణాళిక తయారు చేయడమైనదని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు.బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వీక్షణ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, బాపట్ల 2025-26 ఆర్థిక సంవత్సరం వార్షిక ప్రణాళికను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరం వార్షిక ప్రణాళిక లక్ష్యాల సాధన లో మండల స్థాయి అధికారులు మరియు మున్సిపల్ కమిషనర్ లు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.జిల్లాలో 15 శాతం వృద్ధి లక్ష్యసాధన దిశగా పి4 కుటుంబ సభ్యుల, స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాదులను మెరుగుపరిచే దిశలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా వివిధ శాఖలను సమన్వయం పరుచుకుంటూ లక్ష్యాలను నిర్దేశించటమైనదని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పి4 కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అట్టడుగున ఉన్న నిరుపేద కుటుంబాలను, అభివృద్ధి పదంలో నడిపేందుకు ధనికులు, పేదలను దత్త తీసుకొని అభివృద్ధిలోకి తీసుకొచ్చే కార్యక్రమం అని ఆయన అన్నారు. పేదలను బంగారు కుటుంబాలుగా, దత్తత తీసుకునే వారిని మార్గదర్శకులుగా పిలుస్తారని అన్నారు.జిల్లాలో 62 వేల 3 వందల 68 మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేయడమైనదని తెలిపారు. మార్గదర్శకులుగా 3 వేల 5 వందల 24 మంది ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. 44 వేల మంది బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు మ్యాపింగ్ చేయడమైనదని తెలిపారు. డి ఆర్ డి ఏ ద్వారా పి4 కార్యక్రమంలో భాగంగా పవన్ అనే వ్యక్తికి 51 వేలు ఆర్థిక సహాయం అందించారని ఆయన తెలిపారు. బంగారు కుటుంబాలకు అందించిన సహాయాన్ని పి4 పోర్టల్ లో నమోదు చేయాలని ఆయన తెలిపారు. పి.ఎం




సూర్యఘర్ పథకం కింద స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ సదుపాయం కల్పించాలని ఆదిశగా ఎంపీడీవోలు కృషి చేయాలన్నారు. ఎస్ హెచ్ జి గ్రూపు సభ్యులకు 3 కిలో వాట్ యూనిట్ ను అందజేయడానికి నిర్ధారించినట్లు తెలిపారు. 2025-26 సంవత్సరంనకు 47,500 మంది ఎస్ హెచ్ జి కుటుంబాలకు ఈ పథకం లక్ష్యంగా తీసుకోవడం జరిగిందని అన్నారు. ఈ ఎస్ హెచ్ జి గ్రూపులకు ఈ పథకం ద్వారా 371 కోట్ల రూపాయలు సబ్సిడీ కింద లభిస్తుందని ఆయన తెలిపారు.మునగ చెట్ల పెంపకం, ఎమ్మెస్ ఎం ఇ, కోళ్ల పెంపకం, పాల జంతువులు, గొర్రెల పెంపకం మొదలగు పథకాలలో ఎస్ హెచ్ జి గ్రూపు సభ్యులకు రుణ సదుపాయం కల్పించే దిశగా మండల స్థాయి అధికారులు మరియు మున్సిపల్ కమిషనర్లు పనిచేయాలన్నారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ ప్రతినెలా ఒకటో తేదీ మొదలుకొని నాలుగవ తేదీలోపు పూర్తి చేయాలని తెలిపారు. ఐదవ తేదీన పంపిణీ చేయబడని మొత్తమును బ్యాంకులకు చలాన్ రూపంలో జమ చేయాలని ఆయన తెలిపారు. ఆరవ తేదీ నుండి జమ చేయని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్సీ ఆంజనేయులు, డిపిఓ ప్రభాకర్, ముఖ్య ప్రణాళిక అధికారి షాలేం రాజు, బాపట్ల డిఎల్డిఈఓ విజయలక్ష్మీ, చీరాల డి ఎల్ డి ఓ పద్మావతి, రేపల్లె డిఎల్డివో పద్మ, మున్సిపల్ కమిషనర్లు,అన్ని మండల స్థాయి అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మినుము రైతులు ఈ క్రాప్ చేయించుకోవాలి

## -మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి

**కొల్లిపర,జూన్ 25 ప్రభాతవార్త:** మినుము పంటలు వేసే రైతులు ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి



శ్రీనివాసరెడ్డి అన్నారు.బుధవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెం,కొల్లిపర గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులు పంటలపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి పసల్ భీమా యోజన పథకాన్ని వరి,మినుము పంటలు వేసే రైతులు సద్వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

## -ఎంపీడీఓ విజయలక్ష్మి

**కొల్లిపర,జూన్ 25 ప్రభాతవార్త:** సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన



పాటించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని వల్లభాపురంలో సచివాలయాన్ని ఆమె తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు,సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాగరాజుపాలెంలో ఆక్రమణలను తొలగించాలి

**కొల్లిపర,జూన్ 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగరాజుపాలెంలో ప్రభుత్వం



డొంక..కాలువ భూమి ఆక్రమణలకు గురయ్యాయని ఆక్రమణలను తొలగించాలని కోరుతూ ఆగ్రామస్తులు కొందరు డిప్యూటి తహశీల్దార్ రాజేష్‌కు వినతి పత్రం అందిం చారు. చట్టపరంగా న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.వినతి పత్రం అందించిన వారిలో పి.శ్రీనివాసు,వి.విజయకుమార్, మార్కండేయులు, పి.వేణు,వెంకటకృష్ణ,పోతురాజు ఉన్నారు.

# ఉప్పలపాడు, అన్నవరం గ్రామాలలో పొలం పిలుస్తోంది

**పెదనందిపాడు జూన్ 25,(ప్రభాతవార్త)** పెదనందిపాడు మండలంలోని ఉప్పలపాడు మరియు అన్నవరం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం నిర్వహించారు. రైతులకు ఖరీఫ్ సీజన్లో వేసుకునే పత్తి, అపరాలు మొదలైన పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు వివరించారు.అదేవిధంగా హెచ్డి బర్లి పొగాకు సాగు చేసిన రైతులు సీఎం యాప్ నందు ఇప్పటివరకు నమోదు చేసుకోకపోతే, ఖచ్చితంగా వారు యాప్ నందు వారి వివరాలను విఏఏ దగ్గర నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ సంవత్సరం రైతు సోదరులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా అపరాలు జొన్న మొక్కజొన్న వంటి పంటలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఏఏలు జోష్న, పవన్ కుమార్,రైతులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి లేని భారతదేశము కొరకు కృషి చేయాలి

**బాపట్ల, జూన్25,ప్రభాతవార్త:** క్షయ వ్యాధి లేని భారతదేశము కొరకు కృషి చేయాలని అడిషనల్ సెక్రటరీ నేషనల్ హెల్త్ మిషన్ ఆరాధన పట్నాయక్ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లకు సూచించారు.బుధవారం ఆరాధన పట్నాయక్ అడిషనల్ సెక్రటరీ నేషనల్ హెల్త్ మిషన్ వారి ద్వారా ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించి టిబి ముక్త్ భారత్ కొరకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా టిబి వ్యాధిని గుర్తించడానికి గాను ప్రచార వ్యూహం ఈనెల రెండవ తేదీ నుండి మొదలైనదని దీనిని



100 రోజులపాటు కొనసాగించి నిర్వహించడం చేయాలని,అందులో భాగంగా మొదటి దశలోనే టిబి ఉండొచ్చు అన్న అనుమానం వచ్చినవారికి వెంటనే సరైన మందులు అందజేయాలని, అలాగే పోర్టబుల్ ఎక్స్‌రే మిషన్ మరియు న్యూక్లి ఆసిడ్ అప్లికేషన్ టెస్ట్ నాట్ ద్వారా పరీక్షలు నిర్వహించి టిబి ని గుర్తించిన వెంటనే వారికి ఆరు నెలల పాటు మందులు మరియు మంచి పోషకాహారం నిక్షయ పోషణ యోజన ద్వారా అందజేయాలన్నారు.టిబి వ్యాధి ముందస్తు గుర్తింపు కొరకు ప్రజలను , స్వచ్ఛంద సంస్థలను విద్యార్థులను మరియు 23 ప్రభుత్వ విభాగాలను చైతన్యపరిచి మైనింగ్ ప్రాంతాలు, పట్టణ మురికివాడలు, గిరిజన ప్రాంతాలు, నిర్మాణ స్థలాలు మొదలైన వాటిపై దృష్టి పెట్టి వ్యాధి ఉన్న వ్యక్తులను గుర్తించాలని వారి వల్ల ఇతరులకు వ్యాధి సోకకుండా వారికి పరిశుభ్రత పై అవగాహన కల్పించి వారు ఎల్లప్పుడూ మాస్క్ ధరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మంచి పోషక ఆహారం నిశ్చయ పోషణ యోజన ద్వారా అందించే చర్యలు మరియు మందులు అందించే చర్యలు తీసుకోవాలని కోరారు.టిబితో పాటు మధుమేహం ,లివర్ ,కిడ్నీ వ్యాధి, హెచ్ఐవి మరియు ఏ ఇతర వ్యాధితో బాధపడుతున్న వారిని ఆసుపత్రిలో చేర్పించి వారికి ప్రత్యేకమైన చికిత్స అందజేయాలని తెలియజేశారు.జిల్లా స్థాయిలో కాల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని,జిల్లా స్థాయి కాల్ సెంటర్ ద్వారా చికిత్స పూర్తయిన తర్వాత 2 సంవత్సరాల పాటు టిబి చరిత్ర ఉన్న వారందరినీ ఫాలో అప్ చేయాలని కోరారు. టిబి వ్యాధి మరణాలను తగ్గించడానికి పోషకాహారము మరియు మందులు అందించి వ్యాధి నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన సూచనల మేరకు జిల్లాలో వనరబుల్ పాపులేషన్ 3 లక్షల 42 వేల 9 వందల 65 మంది ఉన్నారని, వారిలో 15 వేల 9 వందల 85 మందికి స్కీనింగ్ చేయడమైనదని, వారిలో 39 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ జరిగినట్లు ఆయన తెలిపారు.ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్షయ వ్యాధిగ్రస్తులను పోషకాహార సహాయం కొరకు నిశ్చయమిత్ర (అంటే క్షయ వ్యాధిగ్రస్తుల దత్తత) లో జేరి టీబీ నిర్మూలనలో భాగస్వామ్యులుగా ప్రతినెలా 700 రూపాయలు విలువ గల పౌష్టికాహారం ఆరు నెలలు పాటు సహాయం అందించటం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, వారి కార్యాలయపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## -ప్రిన్సిపాల్ డాక్టర్ వీర రాఘవయ్య

**పెదనందిపాడు జూన్ 25 (ప్రభాతవార్త):** జూన్ 26 డ్రగ్స్ దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భముగా బుధవారం పెదనందిపాడు ఆర్ట్స్



అండ్ సైన్స్ కళాశాలలో. విద్యార్థిని విద్యార్థులకు డిబేట్ మరియు పోస్టర్ ప్రిపరేషన్ ప్రోగ్రామ్స్ ను నిర్వహించారు. ఈ సందర్భముగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి వీర రాఘవయ్య డ్రగ్స్ మరియు టొబాకో వలన కలిగే అనర్థాలను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. సివిక్స్ డిపార్ట్మెంట్ హెచ్.ఓ.డి కే.శ్రీనివాస్ మూర్తి. కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ హెచ్.ఓ.డి సి.ఎల్.ఎస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు డ్రగ్స్ మరియు టొబాకో వలన కలిగే నష్టాల గురించి వివరించి యాంటి డ్రగ్స్ మరియు యాంటి టొబాకో డే యొక్క ఆవశ్యకతను వివరించి విద్యార్థులచేత యాంటి నార్కోటిక్ బ్యూరో వారు రూపొందించిన ప్రతిజ్ఞ చేయించారు.

**ఇంపార్టెన్స్ ఆఫ్ యాంటి డ్రగ్స్ డే.**

"డ్రగ్స్ దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం అనేది మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని మరియు అక్రమ మాదకద్రవ్యాల వ్యాపారాన్ని వ్యతిరేకించే ఐక్యరాజ్యసమితి నిర్వహించే అంతర్జాతీయ దినోత్సవం. ఇది ప్రతి సంవత్సరం జూన్ 26న జరుపుకుంటారు అని, ప్రజలు మాదకద్రవ్యాల దుష్ప్రభావాల గురించి తెలుసుకోవడానికి మరియు ఈ సమస్యకు వ్యతిరేకంగా పోరాడటానికి అవగాహన కల్పిస్తా రని ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో వైస్ ప్రిన్సిపాల్ కే ప్రతాప్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి


**పెదనందిపాడు జూన్ 25,( ప్రభాతవార్త)** పెదనందిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసిన కిట్స్ ఉన్న గదిని రాష్ట్ర మాధ్యమిక సర్వ శిక్ష



అభియాన్ సంచాలకులు పార్వతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని దీనిలో భాగంగా విద్యార్థులకు అనేక వసతులు కల్పిస్తుందని పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులతల్లిదండ్రుల సహకారం కూడా అవసరం అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఇప్పటికే నూరు శాతం పుస్తకాలు దుస్తులను పంపిణీ చేయడం జరిగింది అన్నారు వాటి పర్యవేక్షణ సి ఆర్ పి లకు అప్పగించడం జరిగింది అన్నారు. వారి వెంట మండల విద్య శాఖ అధికారులు ముద్దన శ్రీనివాసరావు. పోపూరి జాకబ్ లు ఉన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి హెచ్ఎం శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు అనేక సూచనలు సలహాలు అందజేశారు .పాఠశాల పూర్వవిద్యార్థుల. గుంటుపల్లి అప్పారావు .వెల్లంకి శివరాం ప్రసాద్ .షేక్ సలీం .రావి శివరామకృష్ణయ్య తదితరులు. పాఠశాల బలోపేతానికి వివిధ అభివృద్ధి పనులు చేస్తూ తమ వంతు సహాయ సహకారాలు అందించటం హర్షనీయమన్నారు.


# ఎత్తిపోతలలో తొలిఏకాదశి వేడుకలకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన కమిటీ

**మాచర్ల, జూన్ 25 ప్రభాతవార్త:** ఎత్తిపోతల శ్రీదేవి భూదేవి సమేత రంగనాయస్వామి, దత్తాత్రేయస్వామి ఆలయంలో తొలిఏకాదశి వేడుకలు జులై 6న నిర్వహించనున్నట్లు సేవా సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. అదేరోజు శ్రీరంగ దత్త అన్న సమారాధన 15వ వార్షికోత్సవం జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా మాచర్ల ఎమ్మెల్యే



జూలకంటి బ్రహ్మానందరెడ్డిని ఆహ్వానిస్తూ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రికను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మాచరన్ల మండలం తాళ్లపల్లి పంచాయతీ ఎత్తిపోతల క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నారు. ఆ రోజు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, భజనా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు అన్నదానం చేయనున్నారు. ఎమ్మెల్యేను ఆహ్వానించిన వారిలో మాజీ జడ్పీటీసీ ఎన్.గోపిరెడ్డి, పోలిశెట్టి చంద్రశేఖరరావు, షరాబు వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

తెర



# ఆగస్టులో 'ఓజీ' సినిమా గ్రాండ్ లాంచ్

విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుంది అన్నది ఆసక్తికరంగా మారింది. గురూజీతో ప్రాజెక్ట్ విషయంలో కొన్ని సందేహాలు కూడా వ్యక్తమవ్వడంతోఉంటుందా? ఉండదా? అన్న దానిపై క్లారిటీ లోపించింది. ఈ నేపథ్యంలో మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అందుతోంది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం కూడా పెట్టేసినట్లు వినిపిస్తుంది. ఫినిషింగ్ ఇవ్వడానికి వచ్చిన విలన్ ఓజీ ఆగస్టులో సినిమాను గ్రాండ్‌గా లాంచ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారుట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా హీరోయిన్ ఎంపికపై టీమ్ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. కొంత మంది బాలీవుడ్ భామల పేర్లు పరిశీలిస్తున్నారుట. వాళ్లతో పాటు సౌత్ బ్యూటీలు కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ నటించిన సినిమాలకు త్రివిక్రమ్ రైటర్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. మల్లీశ్వరీ, నువ్వు నాకు నచ్చావ్ సినిమాలకు గురూజీ రైటర్‌గా పనిచేసారు. ఇప్పుడు ఏకంగా డైరెక్టర్‌గా వెంకీని డైరెక్ట్ చేయడంతో? అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఇద్దరి కాంబినేష్‌లో మంచి ఫ్యామిలీ కమ్ కామెడీ ఎంటర్ టైనర్ అయితే బాగుంటుందని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. గతలో ఇదే జానర్ వర్కౌట్ అయింది. ఈ నేపథ్యంలో కొత కథతోనో... యాక్షన్ కంటెంట్‌తోనే అద్భుతాలు చేయడం కంటే ఇద్దరికీ కలిసొచ్చిన పాయింట్‌నే కథావవస్తుగా తీసుకుంటే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు అవకాశాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. వెంకీతో గురూజీ నేల విడిచి సాము చేసే అవకాశాలు చాలా తక్కువే. సంక్రాంతి వస్తున్నాం సినిమాతో వెంకటేష్ మార్కెట్ కూడా భారీగా పెరిగింది. ఆ సినిమా ఏకంగా 300 కోట్లకు పైగా అనూహ్య వసూళ్లు సాధించిన సంగతి తెలిసిందే.

# 'డొక్కా సీతమ్మ' లాంటి సినిమాలు భారీ విజయం సాధించాలి: మురళీ మోహన్

మురళీ మోహన్, ఆమని ప్రధాన పాత్రధారులుగా ఉషారాణి మూవీస్ బ్యానర్ మీద వల్లూరి రాంబాబు, మట్టా శ్రీనివాస్ నిర్మాతలుగా టి.వి. రవి నారాయణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ. ఈ చిత్రానికి రాహుల్ శ్రీవాత్సవ్ కెమెరామెన్‌గా పనిచేశారు. కార్తిక్ కోడకండ్ల సంగీతాన్ని అందించారు. ఎం. రవి కుమార్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశారు. గతంలో రిలీజ్ చేసిన మూవీ టైటిల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. ఇక తాజాగా మురళీ మోహన్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను, గ్లింప్స్ నీ రిలీజ్ చేశారు. ఈక్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళీ మోహన్ మాట్లాడుతూ, నా పుట్టిన రోజుని ఎప్పుడూ కూడా ఆశ్రమాల్లో చేసుకుంటూ ఉంటాను. దివ్యాంగులు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో సెలెబ్రేట్ చేసుకుంటూ ఉంటాను. కూడా అంధుల ఆశ్రమానికి వెళ్లాల్సి ఉంది. కానీ ఓ అర గంట వచ్చి వెళ్లండని డొక్కా సీతమ్మ టీం పిలిచింది. అందుకే ఇలా వచ్చాను. చిన్న నిర్మాతలే అయినా నా బర్త్ డేను ఇలా సెలెబ్రేట్ చేస్తున్నందుకు థాంక్స్. రేలంగితో నా అనుబంధం మరువలేనిది. రామ సత్యనారాయణ ఎంతో మంది నిర్మాతలకు అండగా నిలుస్తుంటారు. డొక్కా సీతమ్మ మీద సినిమా తీయాలని చాలా మంది అనుకున్నారు. కాటన్ దొర సైతం డొక్కా సీతమ్మని పొగిడారు. సన్మానం చేస్తామని లండన్‌కు రమ్మని పిలిస్తే సైతం డొక్కా సీతమ్మ వెళ్లలేదు. ఖినేను అక్కడికి వస్తే ఇక్కడ వారి ఆకలి ఎవరు తీరుస్తారు? అని డొక్కా సీతమ్మ నిరాకరించారు. అలాంటి ఓ గొప్ప మనిషి మీద సినిమాను తీస్తుండటం ఆనందంగా ఉంది. ఇప్పుడు అంతా కమర్షియల్‌గా మారింది. అలాంటి టైంలో రాంబాబు, రవి నారాయణ ముందుకు వచ్చారు. ఇలాంటి చిత్రాలు పెద్ద విజయాన్ని సాధించాలి అని అన్నారు. దర్శకుడు టి.వి. రవి నారాయణ్ మాట్లాడుతూ, నా మొదటి హీరో మురళీ మోహన్‌కి పుట్టిన రోజు శుభాకాంక్షలు. ఈ కథను చేయాలని మురళీ మోహన్ చెప్పిన క్షణం నుంచీ ఇప్పటి వరకు ఆయన నన్ను ఎంకరేజ్ చేస్తూనే ఉన్నారు. ఆయన వల్లే ఈ మూవీ ఇక్కడి వరకు వచ్చింది. ఆయన సహకారాన్ని ఎప్పటికీ మర్చిపోలేన్ను అని అన్నారు. దాసన్న మాట్లాడుతూ, డొక్కా సీతమ్మ సినిమా నుంచి రిలీజ్ చేసిన మురళీ మోహన్ ఫస్ట్ లుక్ బాగుంది. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ కార్తిక్ మాట్లాడుతూ, 'మురళీ మోహన్ లాంటి గొప్ప వ్యక్తి నటిస్తున్న చిత్రానికి నేను పని చేస్తుండటం ఆనందంగా ఉంది. డొక్కా సీతమ్మ గారు అంటే ధర్మం.. ధర్మం అంటే మురళీ మోహన్. ఇలాంటి గొప్ప చిత్రంలో పని చేసే అవకాశం ఇచ్చిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు అని అన్నారు. శివ నాగు మాట్లాడుతూ, మురళీ మోహన్ డొక్కా సీతమ్మ చిత్రంతో మరో విజయాన్ని అందుకోబోతోన్నారు. నేను త్వరలోనే ఆయన్ను డైరెక్ట్ చేయబోతోన్నాను. ఆయన మహా నటులు అని అన్నారు. లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ, మురళీ మోహన్ ప్రతీ రంగంలో విజయాన్ని సాధించారు. ఇలాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు. ఆయనెప్పుడూ కూడా సర్వేజనా సుఖినోభవంతు అని అంటుంటారు. అందుకే ఆయన అంత ఆరోగ్యంగా ఉంటారు అని అన్నారు.




# హాలీవుడ్‌లోకి వరలక్ష్మి శరత్ కుమార్

ప్రముఖ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ హాలీవుడ్‌లో అడుగుపెట్టారు. ప్రఖ్యాత బ్రిటిష్ నటుడు జెరెమీ ఐరన్స్ సరసన నటిస్తున్నారు. వెటరన్ దర్శకుడు చంద్రన్ రత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం శ్రీలంకలో చిత్రీకరించబడింది. రిజానా ఎ కేజ్డ్ బర్డ్ అనే ఈ సినిమా ఒక నిజమైన కథ ఆధారంగా రూపొందించబడుతోంది. ఈ ప్రాజెక్ట్ గురించి వరలక్ష్మి మాట్లాడుతూ, ఆస్కార్ అవార్డు గెలుచుకున్న జెరెమీ ఐరన్స్ వంటి గొప్ప నటుడితో కలిసి పనిచేయడం




నిజంగా ఒక కల నెరవేరినట్టు అనిపిస్తోంది. లయన్ కింగ్ సినిమాలో స్కార్ పాత్రకు ఆయనే వాయిస్ ఇచ్చారు. ఆ సినిమా నాకు ఇష్టం. అన్ని డైలాగులు నాపక్కా గుర్తుండిపోతాయంతగా చూసాను. ఇప్పుడా సినిమాకు వాయిస్ ఇచ్చిన ఆయనతో నేనునటించడం అనేది ఒక గొప్ప అవకాశం. చంద్రన్ రత్నం దర్శకత్వంలో పని చేయడం కూడా నాకు గర్వకారణం. శ్రీలంకలోనే కాదు, ప్రపంచ సినిమాకే ఆయన కొత్త దారులు చూపిన దర్శకుడు. ఇలాంటి అద్భుతమైన అంతర్జాతీయ స్టార్స్‌తో కలిసి పనిచేసే అవకాశం నాకు దొరికినందుకు ఆనందంగా వుంది.

# ఒకే ఒక్క హిట్ అయినా పెద్ద హీరోలతో ఛాన్స్



నిధి అగర్వాల్

టాలీవుడ్‌లో ఆమె ఓ క్రేజీ హీరోయిన్.. ఇప్పటి వరకు సినిమాలు చేసింది. కానీ ఒన్లీ ఒకే ఒక్క సినిమా హిట్ అయ్యింది. అయినా కూడా ఈ అమ్మడికి ఛాన్స్‌లు మాత్రం తగ్గడం లేదు.. ఇప్పుడు ఇద్దరు బడా హీరోల సినిమాల్లో నటిస్తుంది. అందంలో అప్సరస ఆమె.. సోషల్ మీడియాలో ఆమె ఫోటోలకు ఫుల్ క్రేజ్. టాలీవుడ్‌లో యంగ్ బ్యూటీల హడావిడి మాములుగా లేదు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ జోరు మీదున్నారు. సినిమాల రిజల్ట్‌తో సంబంధాలు లేకుండా వరుసగా ఛాన్స్‌లు అందుకుంటూ దూసుకుపోతున్నారు. ఈ అమ్మడు కూడా అంతే.. బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కు వచ్చింది ఈ చిన్నది. తెలుగులో వరుసగా ఆఫర్స్ అందుకుంది. సినిమాలు హిట్స్ అవ్వకపోవడంతో గ్లామర్ గేట్లు ఎత్తేసింది. తన అందాలతో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇండస్ట్రీలో ఎనిమిది సినిమాలు చేసింది కానీ ఒకే ఒక్క సినిమా హిట్ అయ్యింది. అయినా కూడా ఈ చిన్నదానికి క్రేజ్ తగ్గలేదు. ఇప్పుడు రెండు పాన్ ఇండియా సినిమాలు చేస్తుంది ఆమె.. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఇది కూడా అప్పుడు మాస్ రాజా సినిమాలో సైడ్ రోల్.. ఇప్పుడు స్టార్ హీరో.. ఏకంగా రవితేజ మూవీలో గెస్ట్‌గా.. అందంలో అప్సరస ఆమె.. నటనలోనూ ప్రేక్షకులను మెప్పించింది. బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కు వచ్చింది. తక్కువ సమయంలోనే స్టార్‌గా మారింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఆమె మరెవరో కాదు హాట్ బ్యూటీ నిధి అగర్వాల్. మున్నా మైఖేల్ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఆతర్వాత తెలుగులో సవ్యసాచి సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలుచేసింది. మిస్టర్ మజ్ను, ఆతర్వాత ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. కానీ ఈ సినిమాలో తన అందంతో ఆకటుకుంది.

# 'తమ్ముడు' నుంచి సాంగ్ రిలీజ్

సంక్రాంతికి వస్తున్నాం బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న మరో సూపర్ హిట్ మూవీ తమ్ముడు. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న తమ్ముడు సినిమా వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తమ్ముడు సినిమా నుంచి జై బగళాము.. లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. జై బగళాము.. పాటకు జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు సాహిత్యాన్ని అందించగా, అజనీష్ లోకనాథ్ డివైన్ ట్యూన్‌తో కంపోజ్ చేశారు. సింగర్



అబీ వీ ఆకట్టుకునేలా పాడారు. జై బగళాము.. పాట ఎలా ఉందో చూస్తే జై బగళాము, జై శివనాయకీ, జై వనరూపిణీ, జై జయకారిణీ, విద్రుమ రూపిణి, విభ్రమ కారిణి, గగనఛత్ర వింధ్యాచలవాసిని, వీర విహారిణి, క్షుద్ర విదారిణి, సర్వజీవ సంరక్షిణి జననీ... అంటూ సాగుతుందీ పాట. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి మహిమను కీర్తిస్తూ గ్రామ జాతర వేడుక సందర్భంగా జై బగళాము.. పాటను చిత్రీకరించారు. నటీనటులు నితిన్, లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్ దిత్య, తదితరులు.

టెక్నికల్ టీమ్: సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి మ్యూజిక్: అజనీష్ లోకనాథ్ పీఆర్వో: వంశీ కాకా, నిర్మాత దిల్ రాజు, శిరీష్.




# 'వర్జిన్ బాయ్స్' నుంచి సాంగ్ లాంచ్

రాజ్ గురు బ్యానర్‌పై రాజా దారపునేని నిర్మాతగా దయానంద్ గడ్డం రచనా దర్శకత్వంలో జూన్ 11వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం వర్జిన్ బాయ్స్. ఈ చిత్రంలో మిత్ర శర్మ, గీతానంద్, శ్రీహాన్, జెన్నీఫర్ ఇమాన్యుల్, రోనిత్, అన్షుల ముఖ్య పాత్రలు పోషించనున్నారు. స్మరణ్ సాయి సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రసాద్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేయగా జేడీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. బబ్లు, కౌశల్ మంద, ఆర్జె సూర్య, సుజిత్ కుమార్, కేదార్ శంకర్, ఆర్జె శరన్, శీతల్ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం నుండి విడుదలైన దం దిగా దం పాటకు ప్రణవ్ చాగంటి లిరిక్స్ అందించగా యాసిర్ నిసర్ తన స్వరాన్ని అందించారు. మార్తాండ్ కె వెంకటేష్ చిత్రానికి ఎడిటింగ్ పని చేశారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ చిత్ర పాటలు మార్కెట్లోకి విడుదలయ్యాయి. ఈ సందర్భంగా వర్జిన్ చిత్ర నిర్మాత రాజా దారపనేని మాట్లాడుతూ, సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి వచ్చిన అందరికీ నా ధన్యవాదాలు. ఇప్పటికే వర్జిన్ బాయ్స్ చిత్రం నుండి టీజర్ ఇంకా ఒక పాటకు మంచి స్పందన లభించింది. సినిమా యూత్ ఫుల్‌గా ఉండబోతుంది. ఇప్పటికే ఈ చిత్రాన్ని చూసిన సెన్సార్ సభ్యులు ఈ చిత్రాన్ని ఎన్నో ప్రశంసలతో కొనియాడారు. ఆడవారు కూడా చిత్రాన్ని ప్రశంసించడం ప్రత్యేకంగా కనిపించింది. చిత్రంలో ఎంటర్టైన్మెంట్‌తో పాటు మంచి లవ్ స్టోరీ కూడా ఉంటుంది. చిత్రానికి సెన్సార్ నుండి ఏ సర్టిఫికెట్ వచ్చింది. చిత్రాన్ని నైజంలో ఏషియన్ సునీల్ గారు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. జులై 11వ తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది అన్నారు. నటి జెన్నీఫర్ ఇమాన్యుల్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. మీడియా వారిని మరోసారి కలవడం నాకెంతో ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో నాకు అవకాశం ఇచ్చినందుకు చిత్ర బంధం అందరికీ నా ప్రత్యేక ధన్యవాదాలు. ఈ చిత్రంలో నటించిన వారితో పనిచేయడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. జెడి మాస్టర్ తో కలిసి పనిచేయడం ప్రత్యేకంగా కనిపించింది అన్నారు. నటుడు శ్రీహాన్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. నాకు ఈ చిత్రంలో అవకాశం ఇచ్చిన బాలుకి, మిత్రకి, రాజాకి ధన్యవాదాలు. ఈ సినిమా పూర్తిగా యూత్‌కు ఎంటర్టైన్మెంట్ కోసం చేసింది. ఈ చిత్రంలో ఏది మంచిది ఏది కానిది అనేది ఎన్నో విషయాలు చెప్పాము. ఈ సినిమా చూస్తే పూర్తిగా ఎంటర్టైన్ అవుతారు. జులై 11వ తేదీన తప్పకుండా థియేటర్లో ఈ చిత్రంని చూడండి అన్నారు. చిత్ర దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ, సాంగ్ లాంచ్ కార్యక్రమానికి హాజరైన అందరికీ నా ధన్యవాదాలు. ఈ చిత్రం ఒక మంచి లవ్ స్టోరీతో యూత్ ఫుల్‌గా ఉండబోతుంది. సినిమా చూసినంతసేపు మీ కాలేజీ రోజు గుర్తొస్తాయి. ఈ చిత్రం కోసం నిర్మాత రాజా అలాగే నటీనటులు అందరితో పని చేయడం నాకు ఎంత సంతోషకరంగా కనిపించింది. మీరందరితో కలిసి పనిచేసి మంచి సినిమాను ప్రేక్షకులకు అందిస్తున్నందుకు ఎంతో గర్వపడుతున్నాను. విడుదలైన పాట ప్రేక్షకులందరికీ నచ్చిం దని అనుకుంటున్నాను. జులై 11వ తేదీన ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రానికి మంచి సంగీతాన్ని అందించిన స్మరణ్ సాయికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. చిత్రంలో మంచి బిజీఎంతో పాటు మొత్తం ఆరు పాటలు ఉంటాయి. అలాగే చిత్రం కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి మరోసారి నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అన్నారు. నటుడు గీతానంద్ మాట్లాడుతూ, నేను ఇంతకుముందు చేసిన రథం సినిమాకు కూడా ఇదే నిర్మాత రాజా నిర్మించారు. గత సంవత్సరం గేమ్ ఆన్ అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాను. ఇప్పుడు వర్జిన్ బాయ్స్ చిత్రం ద్వారా మరోసారి మీ ముందుకు రాబోతున్నాను. విడుదలైన ఈ దం దిగ దం పాటలు ఎంతటి పార్టీ మూడ్ ఉందో సినిమా అంతా కూడా అలాగే ఉంటుంది. సినిమా చూసి ఎంతో మంచి అనుభూతిని పొందుతారు.




# శ్రీలీల తల్లి చాటు బిడ్డే!

శ్రీలీల తల్లి చాటు బిడ్డ. కూతురంటే ఎంత గారబమో! కోపం వస్తే శివంగిలా మారిపోతుందని కొన్ని ఫన్నీ వీడియోలు చూస్తేనే వాళ్లిద్దరి మధ్య అనుబంధం ఎంత గొప్పగా ఉందన్నది అర్థమవుతుంది. అమ్మ మాటను శ్రీలీ జవదాటదు. శ్రీలీలను హీరోయిన్‌ని చేసింది కూడా తల్లే. అమ్మ ప్రణాళిక ప్రకారం శ్రీలీల నడుచుకోవడంతోనే నేడు ఈ స్థానంలో ఉంది. చిన్నప్పుడే డాన్సింగ్ పై స్పెషల్ ట్రైనింగ్ ఇప్పించింది. అటుపై క్లాసికల్ డాన్స్ సహా రకరకాల డాన్సులను ఆ వయసులోనే అవపోశాన పట్టేసింది. నటిగా అవసరమైన ట్రైనింగ్ లన్నీ ఇప్పించింది మామ్. వెండి తెరపై హీరోయిన్‌గా చూసుకుని ఎంతో మురిసిపోతుంది ఆ తల్లి. తాను సాధించలేనిది కుమార్తె రూపంలో సాధించిందా? అన్న సందేహం వచ్చేస్తుంది ఒక్కోసారి. అంతగా తల్లి ప్రభావం శ్రీలీలపై ఉంది. శ్రీలీలను తానే స్వయంగ హీరోయిన్‌ని చేసింది. ఇది నిజంగా గొప్ప విషయమే. సినిమా అంటే రకర కాల అపోహలుంటాయి. వాటి వేటిని పట్టించుకోకుండా స్వర్ణలత కుమార్తెను ముందుకు నడిపించారు. గేమ్ ఛేంజర్.. అప్పుడే నా సిక్స్త్ సెన్స్ చెప్పింది. దిల్ రాజు అలా శ్రీలీల కెరీర్‌లో మామ్ కీ రోల్ పోషించారు. ఇండస్ట్రీలో ఇలాంటి గైడెన్స్ ఎంతో పనికొస్తుంది. బాలీవుడ్‌లో జాన్వీ కపూర్‌ను కూడా ఇలాగే డాడ్ బోనీ కపూర్ వెనుకుండి నడిపిస్తున్నాడు. టాలీవుడ్‌లో తరుణ్ ఫాంలో ఉన్నం కాలం మామ్ రోజా రమణి గైడెన్స్‌తోనే అంత పెద్ద స్టార్ అయ్యాడని అంటారు. కెరీర్ పట్టాలు తప్పడానికి కారణం కూడా ఆమె కారణంగా అప్పట్లో వార్తలొచ్చాయి. తాజాగా శ్రీలీల అఖిల్ హీరోగా నటిస్తోన్న లెనిన్ సినిమా నుంచి తప్పుకుందనే వార్తలొస్తున్నాయి. అందుకు కారణం శ్రీలీల తల్లి పేరు తెరపైకి వస్తోంది. మహావతార్ యూనివర్స్‌తో హోంబలే సంచలనం శ్రీలీలకు టాలీవుడ్ కంటే బాలీవుడ్ ఇతర భాషల్లోనే మంచి కెరీర్ ఉంటుందని భావించి ఆ దిశగా మూవ్ చేస్తున్నారనివినిపిస్తుంది. మరి ఈప్రచారంలో నిజమెంతో తేలాలి. తెలుగు అమ్మాయిలకు తెలుగు నిర్మాతలు అవకాశాలివ్వరు అనే ఆరోపణ చాలా కాలంగా ఉంది. కానీ శ్రీలీల విషయంలో ఇదితప్పే. శ్రీలీలకు కొన్ని మంచి అవకాశాలు కల్పించింది అన్నది వాస్తవం. ప్రస్తుతం చేతిలో కొన్ని తెలుగు సినిమాలున్నాయి. కానీ శ్రీలీలభవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే హిందీ, తమిళ చిత్రాల వైపు ఆసక్తిగా ఉన్నట్లు కనిపిస్తుంది.



26-6Pg5.qxd:26-6Pg5.qxd 01/01/01 7:52 AM Page 1



# ఖండాంతర క్షిపణుల తయారీలో పాక్



## 5,500 కి.మీ దూరంలోని లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యం

### అమెరికా నిఘా సంస్థలు వెల్లడి

**వాషింగ్టన్,జూన్ 25:** పాకిస్థాన్ అత్యంత రహస్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నట్లు అమెరికా నిఘా సంస్థలు సంచలన విషయాలు వెల్లడించాయి. ఈ క్షిపణులు 5,500 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఛేదించగలవని సమాచారం. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' అనంతరం, పాకిస్థాన్ చైనా సహాయంతో తమ ఆయుధ సంపత్తిని గణనీయంగా పెంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు వాషింగ్టన్‌లోని నిఘా వర్గాలు రూపొందించిన ఒక నివేదిక స్పష్టం చేస్తోంది. ఇందులో భాగంగానే, అమెరికాలోని పలు కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యం ఉన్న ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను పాక్ రహస్యంగా తయారు చేస్తోంది. ఈ తరహా ఖండాంతర క్షిపణులను అభివృద్ధి చేయడం లేదా సమకూర్చుకోవాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తే, ఆ దేశాన్ని అణ్వాయుధ ప్రత్యర్థిగా గుర్తిస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేసినట్లు సదరు నివేదిక పేర్కొంది. తమ దేశానికి ముప్పు కలిగించే అవకాశం ఉన్న లేదా అణ్వాయుధాలు కలిగిన ఏ దేశాన్నైనా అమెరికా తన ప్రత్యర్థిగా ప్రకటిస్తుందని నివేదికలో తెలిపారు. ప్రస్తుతం రష్యా, చైనా, ఉత్తర కొరియాలను అమెరికా తమ శత్రుదేశాలుగా పరిగణిస్తోంది. కొంతకాలంగా పాకిస్థాన్ స్వల్ప, మధ్యశ్రేణి క్షిపణుల అభివృద్ధి పైనే ప్రధానంగా దృష్టి సారించింది. ప్రస్తుతానికి ఆ దేశం వద్ద ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎం) అందుబాటులో లేవు. 2022లో పాకిస్థాన్ భూమి నుంచి భూమిపైకి ప్రయోగించే మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి షాహీన్‌ని, అలాగే 2023లో మధ్యంతరశ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ఘౌరీ'ని విజయవంతంగా పరీక్షించింది. ఇదిలా ఉండగా, 'ఆపరేషన్ సింధూర్' కొనసాగుతున్న సమయంలోనే తాము 450 కిలోమీటర్ల పరిధి కలిగిన అబ్దాలి వెపన్ సిస్టమ్ క్షిపణిని పరీక్షించినట్లు ఇస్లామాబాద్ ప్రకటించింది. గత ఏడాది పాకిస్థాన్ చేపట్టిన సుదూర లక్ష్యాలను ఛేదించే బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమంపై అమెరికా పలు ఆంక్షలు విధించింది. ఈ క్షిపణి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ డెవలప్‌మెంట్ కాంప్లెక్స్‌తో పాటు మరో మూడు సంస్థలతో అమెరికన్‌కంపెనీలు ఎలాంటి వ్యాపారకార్యకలాపాలునిర్వహించకుండా నిషేధం విధించింది. పాకిస్థాన్ ఇటువంటి క్షిపణులను తయారుచేయడ తమ దేశ భద్రతకు కూడా ముప్పేనని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, అమెరికా పక్షపాత ధోరణితో తమపై ఇటువంటి చర్యలు తీసుకుంటోందని పాకిస్థాన్ ఆరోపించింది.





# ఎమర్జెన్సీ.. ప్రజాస్వామ్య వ్యతిరేకతకు ప్రతీక: అమిత్‌షా

**న్యూఢిల్లీ, జూన్25:** కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటించిన అత్యవసర పరిస్థితి జాతీయ అవసరం కాదని, కాంగ్రెస్ ప్రజాస్వామ్య వ్యతిరేక మనస్తత్వానికి అది ప్రతీక అని అమిత్ షా ఆరోపించారు. కేవలం తన పదవిని కాపాడుకోవడానికి మాత్రమే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1975, జూన్ 25న అత్యవసర పరిస్థితిని విధించారన్నారు. ఆ సమయంలో దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించివేశారని, న్యాయవ్యవస్థ చేతులు కట్టేశారని, సామాజిక కార్యకర్తలను జైళ్లలో బంధించారని షా పేర్కొన్నారు. దీంతో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడ్డారని తెలిపారు. ప్రభుత్వం నియంతలా మారినప్పుడు, దానిని పడగొట్టే శక్తి ప్రజలకు ఉంటుందని ఈ రోజు అందరికీ గుర్తు చేస్తోందని షా అన్నారు. అత్యవసర పరిస్థితి సమయంలో దేశంలోని ప్రజలు ఎన్నో హింసలు, బాధలు ఎదుర్కొన్నారని అమిత్‌షా అన్నారు. అప్పుడు వారు ఎదుర్కొన్న సమస్యలను నేటి తరానికి తెలియజేయడానికి బిజెపి ప్రభుత్వం జూన్25ను 'సంవిధాన్ హత్య దివస్'గా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రతి భారతీయుడిలో వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజా స్వామ్య రక్షణ వంటి నియంతృత్వ శక్తులు మళ్లీ అటువంటి భయానక సంఘటలను పునరావృతం చేయకుండా ఉంటాయని వ్యాఖ్యానించారు.



# కెప్టెన్ అభినందన్‌ను బంధించిన పాక్ మేజర్ హతం!

## మిలిటెంట్ల ఏరివేతలో టిటిపి కాల్పులకు మృతి

**న్యూఢిల్లీ,జూన్ 25:** భారత వైమానికదళ పైలట్, వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌ను 2019లో పాకిస్థాన్ సైన్యం అదుపులోకి తీసుకున్న ఘటనలో కీలక వ్యక్తి పాకిస్థాన్ ఆర్మీ మేజర్ మోయిజ్ అబ్బాస్ షా (37) ఉగ్రవాదుల దాడిలో మరణించారు. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో బుధవారం తెహ్రీక్‌ఇ తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులతో జరిగిన తీవ్రస్థాయి ఘర్షణలో మేజర్ అబ్బాస్ షా ప్రాణాలు కోల్పోయినట్లు తేలింది. పాకిస్థాన్ సైన్యంలోని ఎలైట్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ (ఎస్ఎస్‌జీ)లో అబ్బాస్ షా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉగ్రవాదవ్యతిరేక ఆపరేషన్‌లో భాగంగా ఆయన బృందం కూంబింగ్ నిర్వహిస్తుండగా టిటిపి ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడటంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుందని పాక్ సైనిక వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. ఈ భీకర పోరులో మేజర్ అబ్బాస్ షాతో పాటు లాన్స్ నాయక్ జిబ్రానుల్లా అనే మరో సైనికుడు కూడా వీరమరణం పొందారని, భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో 11 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాక్ సైన్యం వెల్లడించింది. 2019 ఫిబ్రవరి 27న బాలాకోట్ వైమానిక దాడుల తర్వాత రోజు, భారత గగనతలంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన పాకిస్థానీ ఎఫ్16 యుద్ధ విమానాన్ని అప్పటి వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ తన మిగ్21 బైసన్ విమానంతో వీరోచితంగా వెంటాడి కూల్చివేశారు. ఈ పోరాటంలో అభినందన్ విమానం కూడా దెబ్బతిని నియంత్రణ రేఖకు ఆవల పాకిస్థాన్ భూభాగంలో కుప్పకూలింది. దీంతో పారాచూట్ ద్వారా సురక్షితంగా కిందకు దిగిన ఆయన్ను పాకిస్థాన్ సైనికులు అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో అభినందన్‌ను బంధించిన సైనిక బృందంలో మేజర్ మోయిజ్ అబ్బాస్ షా కూడా ఉన్నారని, ఆయనను చిత్రహింసలు పెట్టడంలోనూ అబ్బాస్ షా పాత్ర ఉందని అప్పట్లో వార్తలు వచ్చాయి.

# 'చీకటి రోజు'కు 50 యేళ్లు



## దీనిని 'సంవిధాన్ హత్యా దివస్'గా జరుపుకుంటున్నామన్న ప్రధాని

## నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విమర్శ

**న్యూఢిల్లీ,జూన్ 25:** భారతదేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, ఆ రోజులను ఏ భారతీయుడూ మరిచిపోలేరని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి సరిగ్గా 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ రోజును దేశ ప్రజలతో పాటు తాము కూడా 'సంవిధాన్ హత్యా దివస్'గా పరిగణిస్తున్నామని తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో నాటి పాలకులు భారత రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను పూర్తిగా పక్కనపెట్టారని ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ప్రాథమిక హక్కులను కాలరాశారని, పత్రికా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, చివరికి సామాన్య పౌరులను కూడా అన్యాయంగా జైళ్లలో నిర్బంధించారని ఆరోపించారు. ఆ సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్నే అరెస్టు చేసినట్లుగా అనిపించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ నాటి భయానక పరిస్థితులను ఏ భారతీయుడూ అంత తేలికగా మరచిపోలేరని ప్రధాని పునరుద్ఘాటించారు. ఆ దుర్మార్గమైన పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు మొక్కవోని దీక్షతో పోరాటం చేశారని గుర్తుచేశారు. వారి అలుపెరగని పోరాటం వల్లే చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేయాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను మరింత బలోపేతం చేస్తామని, వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మోదీ తెలిపారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల కలలను సాకారం చేయడమే తమ ధ్యేయమని అన్నారు.

ఈ సందర్భంగా, ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో తాను ఒక పుస్తకాన్ని తీసుకురాబోతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా తన ప్రస్థానం, ఎమర్జెన్సీ రోజుల్లో నెలకొన్న క్లిష్ట పరిస్థితులు, తన అనుభవాలను ఆ పుస్తకంలో వివరంగా పొందుపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పుస్తకం ద్వారా నాటి చీకటి రోజులకు సంబంధించిన అనేక తెలియని విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

# శాంతియుత అణు కార్యక్రమ హక్కులను కాపాడుకుంటాం

## అణ్వాయుధాల తయారీ తమ ఉద్దేశం కాదన్న ఇరాన్ అధ్యక్షుడు



**టెహ్రాన్,జూన్ 25:** పశ్చిమాసియాలో గత కొన్ని రోజులుగా నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో శాంతియుత వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌కీలక వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాలను తయారుచేయాలన్నది తమ దేశ లక్ష్యం కాదని ఆయన స్పష్టం చేశారు. అయితే, శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తిని ఉపయోగించుకునే తమ చట్టబద్ధమైన హక్కులను మాత్రం కాపాడుకుంటామని ఆయన వెల్లడించారు. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన అనంతరం, యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ, ఇరాన్ తన చట్టబద్ధమైన హక్కులకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. మా దేశం ఎప్పుడూ అణ్వాయుధాలను సమకూర్చుకోవాలని ప్రయత్నించలేదు. అలాంటి కోరికకూడా మాకులేదు. ఇరాన్ ఎలాంటి సంఘర్షణలను కోరుకోవడం లేదు. అయితే, మా హక్కులను వదులుకోవడానికి మేం సిద్ధంగా లేము. చర్చలద్వారా అన్ని సమస్యలను పరిష్కరించుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నామని అన్నట్లు ఇరాన్ అధికారిక మీడియా ఇర్నా వెల్లడించింది. గత 12 రోజులుగా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు చోటుచేసుకున్న విషయం విదితమే. ఈ పరిణామాలతో పశ్చిమాసియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో నిన్న ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆ తర్వాత కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని ఇరాన్ మీడియా కూడా ధ్రువీకరించింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుసైతం ఒప్పందంకుదిరిన విషయాన్ని అంగీకరించారు. ఈ ఒప్పందంతో ప్రస్తుతానికి పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారినట్లయింది.

**ఇక నుండి అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు సహకరించం: ఇరాన్ కీలక నిర్ణయం**


ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన 24 గంటల్లోనే ఇరాన్ కీలక నిర్ణయం తీసుకొంది. ఇక మీదట అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు ఏ మాత్రం సహకరించకూడదని నిర్ణయించింది. ఇరాన్ పార్లమెంట్ ఈ నిర్ణయానికి అనుకూలంగా ఏ మాత్రం ఓటు వేసింది. దీనికి ఆ దేశ సుప్రీం నేషనల్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. ఇరాన్ అణు కేంద్రాలపై జరిగిన దాడులను ఖండించడానికి అంతర్జాతీయ అణు శక్తి సంస్థ నిరాకరించింది. దీంతో విశ్వసనీయతను వేలానికి పెట్టినట్లయింది అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘలిబాఫ్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో తమ అణు కేంద్రాల భద్రతకు గ్యారెంటీ ఇచ్చేదాకా ఐఎఇఎకు సహకారాన్ని నిలిపివేయాలని పార్లమెంట్ తీర్మానించింది. తాజాగా ఇరాన్, ఇజ్రాయెల్‌మధ్య కాల్పుల విరమణ జరగడాన్ని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ స్వాగతించింది. ఈ యుద్ధం జరిగినన్ని రోజులు ఐఎఇఎ ఇన్‌స్పెక్టర్లు ఇరాన్‌లోనే ఉన్నారు.

ఈ నెల 22న తెల్లవారుఝామున అమెరికా బాంబర్ విమా నాలు ఇరాన్‌లోని నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై భారీఎత్తున దాడి చేశాయి. ఈ క్రమంలో అమెరికా బంకర్ బస్టర్లను ప్రయోగించింది. ఇవి ఆ కేంద్రాలను ఎంతవరకు దెబ్బతీశాయనే విషయం మాత్రం తెలియరాలేదు. కొన్ని అమెరికా పత్రికలు మాత్రం ఫోర్డో కేంద్రం స్వల్పంగానే దెబ్బతిన్నట్లు చెబుతున్నాయి. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పందిస్తూ ఇరాన్‌పై దాడి చెప్పుకోదగిన స్థాయిలో నష్టం జరిగిందన్నారు. దీంతో ఆ దేశ అణు కార్యక్రమం చాలా వెనక్కి వెళ్లినట్లు తెలిపారు.

# మొసాద్‌కు సహకరించారన్న ఆరోపణలపై ముగ్గురిని ఉరితీసిన ఇరాన్

**టెహ్రాన్,జూన్ 25:** అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఆ మరుసటి రోజే ఇరాన్‌లో ఈ అరెస్టులు, ఉరిశిక్షల అమలు ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్‌కు సహకరించారన్న ఆరోపణలపై దోషులుగా తేలిన ముగ్గురు వ్యక్తులకు ఇరాన్ బుధవారం మరణశిక్ష అమలు చేసింది. ఆ దేశంతో సంబంధాలున్నాయనే ఆరోపణలపై సుమారు 700 మందిని అరెస్టు చేసినట్లు ప్రభుత్వ అనుబంధ నూర్‌న్యూస్ వెల్లడించింది. ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ న్యూస్ ఏజెన్సీ ముగ్గురి ఉరిశిక్ష విషయాన్ని ధ్రువీకరించింది. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకోవడంగమనార్హం. 12 రోజుల పాటు తీవ్ర స్థాయిలో ఘర్షణలు చెలరేగిన అనంతరం, అమెరికా జోక్యంతో ఇరు పక్షాలు శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. అయితే, ఈ ఒప్పందం జరిగి 24 గంటలు కూడా గడవక ముందే మొసాద్ కోసం గూఢచర్యం చేశారన్న అభియోగాలపై ముగ్గురికి మరణశిక్ష విధించడం, యూదుదేశంతో సంబం ధాలున్నాయనే నెపంతో వందల సంఖ్యలో ప్రజలను అరెస్టు చేయడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ, ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు ఇంకా చల్లారలేదన డానికి ఈఘటనలునిదర్శనంగా నిలుస్తున్నాయి.

# భారత్‌తో చర్చలకు సిద్ధమే: పాక్ ప్రధాని షెహబాజ్‌షరీఫ్



## సౌదీ యువరాజు సల్మాన్‌తో ఫోన్ సంభాషణ

**కరాచి,జూన్ 25:** భారత్‌తో తమకున్న వివిధ వివాదాస్పద అంశాలపై చర్చించేందుకు పాక్ సుముఖంగా ఉందన్న షరీఫ్ ఉగ్రవాదాన్ని నిర్మూలించే వరకు పాకిస్థాన్‌తో చర్చలు ఉండవన్న భారత్ ఉగ్రవాద కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేంత వరకు పాకిస్థాన్‌తో ఎలాంటి చర్చలు జరిపేది లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం చర్చల అంశాన్ని పదేపదే లేవనెత్తుతోంది. ఇరు దేశాల మధ్య పరిష్కారం కాని వివాదాలపై అర్థవంతమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మరోసారి ప్రకటించారు.

సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబిఎస్)తో ఇటీవల జరిపిన టెలిఫోన్ సంభాషణలో షరీఫ్ ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు రేడియో పాకిస్థాన్ తెలిపింది. జమ్మూకశ్మీర్ సమస్య, ఉగ్రవాదం, వాణిజ్య సంబంధాలు, జలాల పంపిణీ వంటి కీలక అంశాలపై చర్చించడానికి పాకిస్థాన్ సుముఖంగా ఉందని ఆయన పేర్కొన్నట్లు తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై సౌదీ యువరాజు ఎంబీఎస్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఫోన్‌లో చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా భారత్, పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను షరీఫ్ ప్రస్తావించారని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పినట్లు సమాచారం. గతంలో పహల్గామ్ ప్రాంతంలో ఉగ్రదాడి జరిగిన అనంతరం, భారత సైన్యం పాకిస్థాన్‌పై సైనిక చర్య చేపట్టింది.

ఈ పరిణామాల నేపథ్యంలో, అంతర్జాతీయ సమాజం నుంచి మద్దతు కూడగట్టేందుకు పాకిస్థాన్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా సౌదీ అరేబియా, ఇరాన్, అజర్‌బైజాన్ వంటి దేశాలను సంప్రదించింది. పాకిస్థాన్‌తో చర్చల అంశంపై స్పందించిన భారత్, సరిహద్దు ఆవలి నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోయే వరకు ఎలాంటి చర్చలు ఉండవని తేల్చి చెప్పింది.

ఉగ్రవాదం, చర్చలు ఏకకాలంలో కొనసాగడం అసాధ్యమని, నీరు, రక్తం కలిసి ప్రవహించలేవనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలని భారత్ గట్టిగా హెచ్చరించింది.

# మాకు దేశం ఫస్ట్...కొందరికి మోడీ ఫస్ట్

## శశిథరూర్ వ్యాసంపై మల్లికార్జున్ ఖర్గే చురకలు



**న్యూఢిల్లీ, జూన్25:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కాంగ్రెస్ నేత శశిథరూర్ ప్రశంసించడంపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. మాకు దేశమే ఫస్ట్, కానీ కొందరు వ్యక్తులకు మోడీయే ఫస్ట్ అంటూ శశిథరూర్‌ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతదేశం చేపట్టిన దౌత్యపరమైన చర్యలపై పత్రికలో శశిథరూర్ రాసిన వ్యాసం చుట్టూ జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాసంలో, ప్రధానమంత్రి మోడీ శక్తి, చైతన్యం, ప్రపంచ వేదికపై నిమగ్నమవ్వాలనే ఆయన తపన భారతదేశానికి ప్రధాన ఆస్తిగా నిలుస్తోందని, అయితే దీనికి మరింత మద్దతు అవసరమని థరూర్ పేర్కొన్నారు.

ఈవ్యాఖ్యలు కాంగ్రెస్‌పార్టీని ఇబ్బందికి గురిచేయడమే కాకుండా పార్టీ హైకమాండ్‌కు, థరూర్‌కు మధ్య దూరాన్ని మరింత పెంచాయి. పార్టీ లైన్‌కు అనుగుణంగా థరూర్ మాట్లాడకపోవడంపై హైకమాండ్ అసంతృప్తితో ఉంది. ఖర్గే మాట్లాడుతూ, శశిథరూర్ ఇంగ్లీష్ చాలా ధారాళంగా మాట్లాడతారు. నాకు ఇంగ్లీష్ అంత బాగా రాదు. ఆయన భాష చాలా బాగుంటుంది. అందుకే ఆయన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమించామని అన్నారు. 26 మంది అమాయకులు మరణించిన పహల్గామ్ దాడి తర్వాత, ప్రతిపక్షాలన్నీ సైన్యానికి అండగా నిలుస్తాయని చెప్పాయని ఖర్గే గుర్తుచేశారు. దేశం ముందు, పార్టీ తర్వాత అన్నాం. కానీ కొందరు వ్యక్తులు మోడీ ముందు, దేశం తర్వాత అని భావిస్తున్నారు.

మేమేం చేయగలమని ఆయన అన్నారు. మరోవైపు ఓ కార్యక్రమంలో థరూర్ మాట్లాడుతూ, తాను రాసిన వ్యాసాన్ని తాను బిజెపిలో చేరడానికి చేస్తున్న ప్రయత్నంగా చూడరాదని, అది జాతీయ ఐక్యత, దేశ ప్రయోజనాలు, భారతదేశానికి అండగా నిలవడమనే ఉద్దేశంతో చేసిందని స్పష్టం చేశారు.

# న్యూయార్క్ మేయర్‌గా భారత సంతతి నేత!



**న్యూయార్క్,జూన్ 25:** న్యూయార్క్ నగర రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బుధవారం వెలువడిన డెమోక్రటిక్ పార్టీ మేయర్ ప్రైమరీ ఎన్నికల ఫలితాల్లో భారత సంతతికి చెందిన 33 ఏళ్ల ముస్లిం యువకుడు, సోషలిస్ట్ భావజాలం కలిగిన జోహ్రాన్ మమ్దానీ సంచలన విజయం సాధించారు. రాజకీయ ఉద్దండుడు, మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోను ఓడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అమెరికాలోనే అతిపెద్ద నగరమైన న్యూయార్క్‌లో జరిగిన ఈ హోరాహోరీ పోరులో మమ్దానీకి 43.5శాతం ఓట్లురాగా, ఆండ్రూక్యూమో 36.3 శాతంతో వెనుకంజలో నిలిచారు. రిపబ్లికన్ల కంటే డెమోక్రాట్లు మూడు రెట్లు అధికంగా ఉన్న ఈ నగరంలో దాదాపు డజను మంది డెమోక్రటిక్ అభ్యర్థులు మేయర్ పీఠం కోసం పోటీ పడ్డారు. క్షేత్రస్థాయి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్న జోహ్రాన్ మమ్దానీ, ప్రఖ్యాత భారత అమెరికన్ చిత్రనిర్మాత మీరా నాయర్, ఉగాండాలో జన్మించిన భారతీయ విద్యావేత్త మహమూద్ మమ్దానీల కుమారుడు. డెమోక్రటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికా మద్దతుతో బరిలోకి దిగిన మమ్దానీ, తక్కువ ఖర్చుతో కూడిన గృహాలు, పోలీసు సంస్కరణలు, వాతావరణ మార్పులపై చర్యలు వంటి ప్రగతిశీల అంశాలతో ప్రచారం నిర్వహించారు. తన విజయానంతరం మమ్దానీ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, నెల్సన్ మండేలా మాటలను ఉటంకించారు. ఇది పూర్తయ్యే వరకు అసాధ్యంలానే కనిపిస్తుంది. మిత్రులారా ఇది పూర్తయింది. దాన్ని చేసింది మీరే. న్యూయార్క్ నగర మేయర్ పదవికి డెమోక్రటిక్ అభ్యర్థిగా ఎంపికైనందుకు నేను గర్వపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. గతేడాది డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవికి తిరిగి వచ్చిన నేపథ్యంలో డెమోక్రటిక్ పార్టీ అంతర్గత విభేదాలతో సతమతమవుతున్న ప్రస్తుత సున్నిత తరుణంలో ఈ ప్రైమరీ ఎన్నికలు జరిగాయి. చురుకైన సోషల్ మీడియా ప్రచారం, యువ ఓటర్లమద్దతుతో మమ్దానీ సాధించినఈ విజయం పార్టీలోని వామపక్ష వర్గాల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

# ఖాన్‌యూనిస్ నగరంలో ఇజ్రాయెల్ సైనికులపై హమాస్ దాడులు

## ఏడుగురు మృతి.. మృతదేహాల గుర్తింపు

**జెరూసెలం, జూన్ 25:** దక్షిణ గాజా నగరం ఖాన్‌యూనిస్‌లో జరిగిన పేలుడుకు ఏడుగురు ఇజ్రాయెల్‌సైనికులు మృతిచెందారని ఆదేశ మిలిటరీ ప్రకటించింది. మిలిటరీ నిబంధనలను అనుసరించి పేరు చెప్పని అధికారి మొత్తం ఆరుగురు సైనికుల పేర్లను గుర్తించి వారి మృతదేహాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మరొకరిని మాత్రం అత్యంత రహస్యంగా ఉంచారు. అంతకు ముందురోజే ఖాన్ యూనిస్‌లో ఒకసైనికుడు కాల్పుల్లో తీవ్ర గాయాల పాలయ్యాడు. హమాస్ మిలిటరీ విభాగం అల్‌ఖస్సామ్ బ్రిగేడ్స్ ఇజ్రాయెల్ సైనికులను చుట్టుముట్టామని, ఒక నివాసభవనంలో ఉన్నట్లు సమాచారం అందడంతో దక్షిణగాజాలో వీరిని చుట్టుముట్టి అంతంచేసామని ప్రకటించింది. యాస్సిన్ 105 క్షిపణిని ప్రయోగించినట్లు హమాస్ వెల్లడించింది. అల్‌ఖస్సమ్ ఫైటర్లు ఈ భవనాన్ని మెషిన్‌గన్లతోకూడా టార్గెట్‌చేసారు. 21నెలలపాటు ఇజ్రాయెల్ గాజపై జరిపిన దాడుల్లో మొత్తం 56,077 మందిని చంపివేసిందని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది. హమాస్ దక్షిణ ఇజ్రాయెల్‌పై చేసిన దాడితో ఈ దాడులుప్రారంభం అయ్యాయి. సుమారు 1200 మంది చనిపోయారు. ఎక్కువమంది పౌరులే కావడంతో ఇజ్రాయెల్ స్పందించింది. అంతేకాకుండా 251 మందిని కిడ్నాప్‌చేసింది. కాల్పుల విరమణ ఒప్పందాల తర్వాత వారిని విడుదలచేసింది. ఇజ్రాయెల్ పాలస్తీనా యుద్ధంలో అత్యధిక మరణాలు ఈ యుద్ధంలోనే జరిగాయి. గత మార్చినుంచి చూస్తే 5759 మంది కాల్పుల్లో చనిపోయినట్లు ప్రకటించింది. అయితే ఇజ్రాయెల్‌మాత్రం తాముకేవలం మిలిటెంట్లను మాత్రమే టార్గెట్‌చేసామని, అయితే హమాస్ మాత్రం అమాయక పౌరులను టార్గెట్ చేసిందని ఆరోపించింది. తమ దాడుల్లో ఇప్పటి వరకూ 20 వేలమందికిపైగా హమాస్ మిలిటెంట్లను ఏరివేసామని ప్రకటించినా ఇందుకు ఆధారాలు మాత్రం చూపించలేకపోయింది.

26-6Pg6exHMNWJQE.qxd:26-6Pg6exHMNWJQE.qxd 01/01/01 8:52 AM Page 1



# గిరిజనులకు ఆధార్, రేషన్ కార్డులు ఇళ్ల వద్దనే అందించేందుకు చర్యలు

## - ఆగిన పథకాలన్నీ పునరుద్ధరణ : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి




**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 25, ప్రభాతవార్త :** బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి సంధ్యారాణి గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. ఇటీవల అమానుష దాడిలో గాయపడి కోలుకుంటున్న చిన్నారిని హాస్పిటల్లో మంత్రి పరామర్శించారు. అనంతరం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు మూలాధారమని, మైదాన ప్రాంతమయిన టువంటి జిల్లాలో ఇప్పటికీ అమాయక గిరిజనులకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేకపోవడం భాధాకర మన్నారు. వెంటనే ఆధార్, రేషన్ కార్డులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. అదేవిధంగా మారు మూల పల్లెల్లో త్రాగు నీరు, సాగునీరు మౌలిక వసతుల కల్పనయే ఐటీడీఏల ప్రథమ కర్తవ్య మన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గిరిజన అభివృద్ధికి గత సంవత్సరం 1300 కోట్ల నిధులు వ్యయం చేశామన్నారు. అలాగే ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా 206 రోడ్లకు 550 కోట్ల నిధులు వ్యయం చేశా మన్నారు. నెల్లూరు ఐటీడీఏ పరిధిలోని కావలి, తిరుపతి, కె.వి పల్లి తదితర ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలల అభివృద్ధికి దాదాపు 18 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామన్నారు. గురుకుల పాఠశాలల్లోని 12 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు, ఏడుగురు ఐఐటీలలో సీట్లు సంపాదించడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలోని అన్ని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో త్రాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. పేద గిరిజనులు వెనుకబడిన తెగలుగా మిగిలిపోకుండా వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించి పైకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ఆపేసినటువంటి 16 గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకొని యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఐసిడిఎస్ ద్వారా 12 ప్రాజెక్టులు అమలవుతున్నాయని, 3000 అంగన్వాడి సెంటర్లలో బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర పథకాలను సమీక్షించామన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పౌష్టికాహార లోపం ఉన్న వారిని గుర్తించి వారికి సరైన పోషకాహారం అందిస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి అంగన్వాడిలలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం లక్ష రూపాయల నిధులు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న అంగన్వాడీలకు ప్రథమ ప్రాధాన్యమిచ్చి మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. రాష్ట్రంలోని 6800 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడంతో ప్రత్యేక టీచర్, ఆయాలను నియమిస్తున్నామన్నారు.

## ప్రజాస్వామ్యంలో నియంతలకు చోటు లేదు

# 'సంవిధాన్ హత్య దివస్'లో సీఎం చంద్రబాబు


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రబాబు

**విజయవాడ,జూన్25,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు. నాడు సాగిన అరాచక, అప్రజాస్వామిక పాలన నేటికీ దేశంపై మానని గాయంగా మిగిలిపోయింది. అందుకే సంవిధాన్ హత్య దివస్ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం. అలాగే రాష్ట్రంలో 6 ఏళ్ల క్రితం ఇదే రోజున ప్రజావేదిక కూల్చి గత ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంస పాలనకు తొలి అడుగు వేసింది. ఎమర్జెన్సీని మించిన నియంతృత్వ పాలనకు తెరలేపింది. అయితే ప్రజాస్వామ్యంలో నియంతలకు, విధ్వంసకారులకు చోటు లేదని.. రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు ద్వారా ప్రజలు నిరూపించారు. కూల్చివేతల పాలకులను కూల్చిన ప్రజలు...పునర్నిర్మాణ బాధ్యతను కూటమికి అప్పగించారు. అందుకే ఒక కసి, పట్టుదలతో రాష్ట్ర పునర్ నిర్మాణం చేస్తున్నాం. ప్రజావేదిక కూల్చివేతకు 6 ఏళ్ల అయిన సందర్భంగా నాటి ఘటనను గుర్తు తెచ్చుకుని... మరింత గట్టి సంకల్పంతో వికాసం వైపు ప్రయాణం చేద్దాం. 1975, జూన్ 25 భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన రోజుని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.విజయవాడ శ్రీ తుమ్మలపల్లి క్షేత్రయ్య గారి కళాక్షేత్రంనిర్వహించిన సంవిధాన్ హత్య దివాస్లో సీఎం చంద్రబాబు పాల్గొని అనేక కీలకంశాపై విషయాలపై ఉద్వేగంగా మాట్లాడారు,. నేటితో భారతదేశంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీకి 50 ఏళ్లు అని చెప్పిన చంద్రబాబు, ఎమర్జెన్సీని ఒక చీకటి రోజుగా అభివర్ణించారు. మంచి రోజులే కాదు, చీకటి రోజులు కూడా గుర్తు పెట్టుకోవాలి.. మంచి, చెడుకు మధ్య వ్యత్యాసం ప్రజలకు తెలియాలని చంద్రబాబు అన్నారు. అప్పట్లో ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితి విధించి దేశంలోని సామాన్య ప్రజల్ని హింసించారని చంద్రబాబు అన్నారు. అలహాబాద్ హై కోర్టు ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదు అని చెప్పిందన్న విషయాన్ని గుర్తు చేసిన చంద్రబాబు, ఎమర్జెన్సీ తరహాలోనే ఏపీలో గత ప్రభుత్వ పాలన జరిగిందన్నారు. దీంతో పవన్ కళ్యాణ్, నరేంద్ర మోదీతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని కాపాడుకున్నామని బాబు చెప్పారు. ఆడబిడ్డలకు పెళ్ళిళ్ళు చేయాలంటే ఐదారు తరాలు చూస్తారు. రాజకీయ నాయకుడిని ఎంపిక చేసేటప్పుడు ఎందుకు పాటించరు? అని చంద్రబాబు ప్రశ్నించారు. పాలన ఎలా ఉండకూడదో ఎమర్జెన్సీ ఓ కేస్ స్టడీ అయితే, పాలకులు ఎలా ఉండకూడదో జగన్ ఓ కేస్ స్టడీ అని చంద్రబాబు చెప్పారు చెడు పనులు చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారనటానికి ఎమర్జెన్సీనే ఓ ఉదాహరణ అని చంద్రబాబు చెప్పారు.

# విఆర్వోలకు పదోన్నతి కల్పించండి..

### మంత్రి నారా లోకేష్‌ను కోరిన రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు


మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న భూపతిరాజు రవీంద్రరాజు

**విజయవాడ, జూన్ 25, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 15వేల మంది గ్రామ రెవెన్యూ అధికారులు పనిచేస్తున్నారని, గ్రేడ్-1 విఆర్వోలు 8200మంది ఉన్నారని అన్నారు. గ్రేడ్-1 విఆర్వోలు సుమారు గత 17 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని, అర్హులైన వారికి పరీక్షలు నిర్వహించి పాస్ అయిన వారికి సీనియర్ సహాయకులుగా, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లుగా ప్రమోషన్లు కల్పించాలని కోరుచున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం అందిస్తూ కోరారు. గ్రేడ్-2 విఆర్వోలుగా సుమారు 6800 మంది పనిచేస్తున్నారని, వీరిని కూడా గ్రేడ్-1 విఆర్వోలుగా అప్‌గ్రేడ్ చేసి జూనియర్ అసిస్టెంట్ స్కేల్ ఇప్పించవలసినదిగా కోరుచున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సచివాలయాల రేషనలైజేషన్ పేరుతో రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రస్తుతం ఒక సచివాలయానికి విఆర్వో పనిచేస్తుంటే క్లస్టర్ విధానం వల్ల రెండు సచివాలయాలకి కలిపి ఒక విఆర్వో అవ్వడంతో, క్లస్టర్ విధానం వల్ల రెవిన్యూ డిపార్ట్‌మెంట్ ద్వారా పనిచేసే విఆర్వోలకు చాలా ఇబ్బంది కలుగుతోందని, గ్రామానికి ఒక రెవిన్యూ అధికారి లేకపోతే రెవెన్యూ సమస్యలు భూమి సమస్యలు పరిష్కారంలో చాలా నష్టం జరుగుతుందన్నారు. క్లస్టర్ విధానంలో రెవెన్యూ విలేజ్‌లను పరిగణలోకి తీసుకోకుండా అసంబద్ధంగా రూరల్ మండలాల్లో క్లస్టర్ విధానంలో చాలా తప్పులు జరుగుతున్నాయన్నారు. అర్బన్ మున్సిపాలిటీలో క్లస్టర్ విధానం వల్ల ఎటువటి ఇబ్బందులు ఉండవని, అక్కడ భూ విస్తీర్ణం ఎక్కువగా ఉండదు కాబట్టి అక్కడ రెండు మూడు వార్డు సచివాలయాలు కలిపి ఒక క్లస్టర్ చేసిన ఇబ్బందు లుండవన్నారు.

## తెలుగు రాష్ట్రాల మీదుగా గ్వాలియర్-బెంగళూరు మధ్య కొత్త రైలు ప్రారంభం

**గుంతకల్లు రైల్వే, జూన్ 25,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల మీదుగా గ్వాలియర్-బెంగళూరు మధ్య కొత్త రైలు సర్వీసులను నేటి(26-06-2025) నుంచి నడిపేందుకు రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాయలసీమ,తెలంగాణ మీదుగా నేటి నుంచి ప్రారంభం కాబోతున్న ఈ ప్రారంభోత్సవ రైలు సర్వీసు నిర్వహణకు సంబంధించి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గ్వాలియర్ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 11086వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం సాయంత్రం 4గంటలకు గ్వాలియర్ నుంచి బయలుదేరి కాచిగూడ శుక్రవారం సాయంత్రం 6.20/30, ధర్మవరం తెల్లవారుజామున 4.10/20,బెంగళూరుకు శనివారం ఉదయం 8.35గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు మార్గమధ్యలో శివపూరి, గుణ, అశోక్‌నగర్, బినా, విధిష, బేతుల్, నాగ్‌పూర్, సేవగ్రామ్, చంద్రాపూర్, బల్హార్షా, సిర్పూర్ కాగజ్ నగర్, బెల్లంపల్లి, కాజీపేట్, మహబూబ్ నగర్, గద్వాల, కర్నూలు, డోన్, అనంతపురం, హిందూపురం, యలహంక స్టేషన్లలో నిలుస్తుంది.

## విద్యుత్ షాక్‌తో తండ్రి, కొడుకు మృతి

**ఇల్లందు టౌన్, జూన్ 25, ప్రభాతవార్త:** ఇల్లందు మండలం మర్రిగూడెం గ్రామ పంచాయతీలోని ఎల్లాపురం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర విద్యుత్ షాక్ ఘటనలో తండ్రి, కొడుకు మృతి చెందారు. మరో మహిళ తీవ్రంగా గాయపడింది.గ్రామానికి చెందిన ఏనుగు నరసయ్య (55) తెల్లవారుజామున మూత్ర విసర్జన కోసం బాత్రూంకు వెళ్తుండగా, అనుకోకుండా విద్యుత్ తీగకు తగిలి షాక్‌కు గురయ్యాడు. తండ్రి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా గమనించిన అతడి కుమారుడు ప్రవీణ్ (30), తండ్రిని కాపాడేందుకు హుటాహుటిన వెళ్లి ప్రయత్నించాడు. దురదృష్టవశాత్తు ప్రవీణ్ కూడా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. నరసయ్య భార్య ఎర్రమ్మ వారిద్దరినీ కాపాడేందుకు ప్రయత్నించగా ఆమె కూడా విద్యుత్ షాక్‌కు గురై స్పృహ కోల్పోయి గాయాలతో బయటపడింది. గ్రామస్థులు ఈ ఘటనను గమనించి వెంటనే ఎర్రమ్మను ఇల్లందులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. విద్యుత్ షాక్‌కు కారణమైన సాంకేతిక లోపంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# దుర్గమ్మకు ఇఒ ఆషాఢం సారె

**ఇంద్రకీలాద్రి, జూన్ 25, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో జూన్ 26 నుండి జూలై 24వ తేదీ వరకు ఆషాడమాసం సందర్భంగా ఆషాడ మాసం సారె కార్యక్రమములో భాగంగా కనకదుర్గమ్మకు తొలి సారెను ఆలయ ఈవో వికె శీనా నాయక్ తెలిపారు. సారె సమర్పించే భక్త బృందాలవారు 1800425 9099 నెంబర్ ద్వారా ముందస్తుగా తమ వివరాలు తెలిపి నమోదు చేసుకోవాలని వివరించారు. - నేటి నుండి వారాహి నవరాత్రులు : దుర్గమ్మవారి ఆలయంలో నేటి నుండి జూలై 04 వరకు వారాహీ నవరాత్రులు నిర్వహిస్తామని ఈవో వికె శీనా నాయక్ తెలిపారు.

ఈ సందర్భంగా దుర్గమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన యాగశాలనందు జప, తర్పణ, హోమములు, ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## రేపు ప్రావిడెంట్ ఫండ్ సమావేశాలు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త :** ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వివిధ సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులకు జిల్లా అట్రీచ్ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించే విస్తృత లక్ష్యంతో 'నిధి ఆప్కే నికాబ్ - 2.0' (ఎన్ఎఎన్)ను నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పిఎఫ్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2025 నెలకు సంబంధించి ఈనెల 27వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు ఈ సమా వేశాలు జరుగుతాయి. వికారాబాద్ జిల్లాకు సంబంధించి తాండూరు మున్సిపల్ కార్యాలయంలోను, మహబూబ్‌నగర్ జిల్లా సమావేశం మెట్టుగూడ ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ కార్యాలయంలోను, రంగారెడ్డి జిల్లా సమావేశం ఆమన్‌గల్ మున్సిపల్ కార్యాలయంలో, నాగర్ కర్నూలు జిల్లా సమావేశం అచ్చంపేటలోని ఫారెస్ట్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్ డివిజన్ కార్యాల యంలోను జరుగుతాయి. అదేవిధంగా హైదరాబాద్ సమావేశం మణికొం డలోని గోల్డెన్ టెంపుల్ రోడ్డులో గల ప్రతిభ హైస్కూలులోను, నారాయణపేట జిల్లా సమావేశం మక్తల్ మున్సిపల్ కార్యాలయంలోను, గద్వాల జిల్లా సమావేశం నది అగ్రహారంరోడ్డులోని సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఆపరేషన్స్) కార్యాలయంలోను, వనపర్తి జిల్లా సమావేశం పెబ్బేరు మున్సిపల్ కార్యాల యంలోను జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ సమావేశాల్లో నిధి ఆప్కే నికాబ్ - 2.0 పథకానికి సంబంధించి యాజమాన్యాలకు, ఉద్యోగులకు అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన వివరించారు.

# 13గేట్ల ద్వారా దిగువకు.. జూరాలకు పెరుగుతున్న వరద

### 92,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు

**మహబూబ్‌గర్ బ్యూరో, జూన్ 25, ప్రభాతవార్త:** ప్రియదర్శిని జూరాల డ్యామ్ కు వరద క్రమంగా పెరుగుతున్నది. ఎగువ ప్రాంతం కర్ణాటక నుంచి వరద పోటెత్తడంతో జూరాల నిండుకుండలా మారింది. దీంతో 13 గేట్ల ద్వారా దిగువన శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల కొనసాగుతున్నది. బుధవారం జూరాలకు 92,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా ఏడు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. జూరాల కెపాసిటీ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 8.010 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 33,169 క్యూసెక్కులు స్పిల్ వే ద్వారా 51779 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు,ఎడవ కాలువకు 550, క్యూసెక్కులు, కుడి కాలువకు 298 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 85805 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

# సంవిధాన్ హత్యాదివస్‌కు 50 యేళ్లు

## జార్ఖండ్ ఝరియా మాస్టర్‌ప్లాన్‌కు 5940కోట్లు
## పుణె మెట్రో విస్తరణకు 3626 కోట్లు
## అంతర్జాతీయ పొటాటో సెంటర్ ఏర్పాటుకు రూ.115.5కోట్లు
## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



**న్యూఢిల్లీ,జూన్ 25:** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఆర్థికవ్యవహారాలకేబినెట్‌కమిటీ బుధవారం సమవాఏశం అయి నిర్ణయాలను ఆమోదించింది. సమావేశం ప్రారంభంకాగానే ముందు ఎమర్జెన్సీ బాధితులకు నివాళిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి.. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించింది. ఈ ఏడాదితో సంవిధాన్ హత్యాదివస్‌కు 50 ఏళ్ల పూర్తయిందని కేబినెట్ వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. శుభాంశు శుక్లాతో కూడిన మిషన్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతించింది. 140 కోట్లమంది భారతీయుల ఆశయాలను శుభాంసు అంతరిక్షంలోకి మోసుకెళ్లారని శుభాంశుతోపాటు ఇతర వ్యోమగాములందరినీ అభినందించింది. మరో తీర్మానానికి ఆమోదం తెలిపిన మంత్రివర్గం పుణె, ఆగ్రాలలో పలు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటనకు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర మంత్రివర్గం తీర్మానాన్ని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చదివి వినిపించారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఈ రోజు అత్యవసర పరిస్థితిపై పోరాడిన లెక్కలేనన్ని మంది త్యాగాలను గుర్తుంచుకోవాలని నిర్ణయించింది. రాజ్యాంగాన్ని హత్య చేసే ప్రయత్నాన్ని విఫలం చేసిన ఈ ప్రజాస్వామ్య వాదులకు కేంద్ర మంత్రివర్గం నివాళులర్పించిందని పేర్కొన్నారు. పుణే మెట్రో రైలు ప్రాజెక్టు దశ2ను కేబినెట్ ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లు 12.75 కి.మీ. విస్తరించి 13 స్టేషన్లు ఉంటాయని తెలిపారు. చాందినీ చౌక్, బవ్ధాన్, కోత్రుడ్, ఖరడి, వాఘోలి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాలను కలుపుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును నాలుగు సంవత్సరాలలోపు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అలాగే జార్ఖండ్‌లోని ఝరియా బొగ్గు గనుల నిర్వాసితుల పునరావాసానికి ఝరియా మాస్టర్ ప్లాన్‌కింద రూ.5,940 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. నిర్వాసిత కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన కల్పించడం కోసం నైపుణ్య శిక్షణ, స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలోని సింగ్నాలో దక్షిణాసియా ప్రాంతీయ కేంద్రం ఆఫ్ ది ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి రూ. 111.5 కోట్లు కేటాయించింది. ఆహారం, పోషకాహార భద్రత, రైతుల ఆదాయం, ఉపాధి కల్పనను పెంచడం దీని ప్రధాన ప్రధాన లక్ష్యప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగాళాదుంప ఉత్పత్తి చేస్తున్న దేశం భారత్ కాగా ఇందులో ఉత్తరప్రదేశ్ ముందువరుసలో ఉన్నది. పొటాటో సెంటర్ ఏర్పాటుతో బంగాళాదుంప ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్, విలువ గొలుసులో గణనీ యమైన ఉపాధి అవకాశాలను సృష్టించే సామర్థం పెరుగుతుందని పేర్కొ న్నారు. అలాగే, యూపీలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. యూపీ గౌతమ్‌బుద్ధ నగర్‌లో రూ.417కోట్లతో ఈఎంసీ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నది కేంద్రం.

# తరగతి గదిలోకి ఆవు మెదడు!

## వివాదాస్పదమైన ఓ టీచర్ ప్రదర్శన
## హిందూ సంఘాల ఆందోళన, టీచర్‌పై కేసు నమోదు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి,యాలాల, జూన్ 25, ప్రభాతవార్త :** తరగతి గదిలో విద్యార్థులకు ఆవు మెదడు తెచ్చి ప్రదర్శించిన ఓ సైన్స్ టీచర్ నిర్వాహకం వివాదాస్పదంగా మారింది. వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ టీచర్ ఖాసీంబీ మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంలో భాగంగా ఆవు మెదడు తెచ్చి దాని భాగాలను చూపించారు. ఇది ఆవు మెదడని, తన భర్త ఆవు మాంసం ఇంటికి తెచ్చారంటూ ఆమె విద్యార్థులకు చెప్పడంతో తరగతి గదిలో ఆందోళనకు గురైనారు. తరగతి గదిలో దుర్వాసన వ్యాపించడంతో సహచర ఉపాధ్యాయులు కూడా ఆమెను ప్రశ్నించగా ఆవు మెదడు అని సమాధానం ఇచ్చారు. దాంతో బుధవారం విద్యార్థుల తల్లి దండ్రులు, భజరంగ్‌దళ్, బీజేపీ, హిందూ వాహినీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యాలాల మండల కేంద్రంలో ఆందోళన వ్యక్తం చేశారు. స్కూలు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రూరల్ సీఐ నాగేష్, ఎస్సై గిరన్న సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా కూడా అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. దాంతో పరిస్థితి ఆదుపు లోకి వచ్చింది. పోలీసులు సమగ్ర విచారణ జరిపి టీచర్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు ప్రకటించారు. దాంతో హిందూ సంఘాలు ఆందోళన విరమించాయి.

**వివాదాస్పద సైన్స్ టీచర్ సస్పెన్షన్**

వివాదాస్పద నిర్ణయం తీసుకున్న యాలాల జడ్పీహెచ్ఎస్ (బాలికల) సైన్స్ టీచర్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో రేణుకాదేవీ ఆదేశాలు జారీ చేశారు. సైన్స్ టీచర్ ఖాసీంబీ తరగతి గదిలోకి ఆవు బ్రెయిన్‌ను తెచ్చి చూపిస్తూ పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని డీఈవో తెలిపారు.

ఈ సంఘటనపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా మండల విద్యాధికారి రమేష్ బుధ వారం ప్రాథమికంగా విచారణ జరిపారు.

స్కూల్‌లో పనిచేస్తున్న సహచర ఉపాధ్యా యులను, విద్యార్థులను అడిగి వివరాలు సేక రించారు. అనంతరం డీఈవోకు సమగ్ర నివేదిక సమర్పించారు. సీరియస్‌గా తీసుకున్న డీఈవో సదరు ఉపాధ్యాయురాలుపై వేటు వేశారు.

# అంజలి హత్యకేసులో ప్రధాన నిందితుడు శివ అరెస్టు

## సహకరించిన మైనర్లను జువెనైల్ కోర్టుకు తరలింపు
## వివరాలను వెల్లడించిన బాలానగర్ పోలీసు డిప్యూటీ కమిషనర్ సురేశ్‌కుమార్

**హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), జూన్ 25 ప్రభాతవార్త:** కన్నతల్లి తనపై చూపేప్రేమ కనుమగవటాన్ని జీర్ణించుకోలేని ఆ అమ్మాయి ప్రేమికుడితో కలిసి హత్యకు రూపకల్పన చేసిన తీరు తీవ్రకలకలం రేపింది. జీడిమెట్ల పరిధిలోని న్యూలాల్ బహాదూర్‌నగర్‌లో మంగళవారం జరిగిన అంజలి హత్యపలు మలుపులు తిరుగుతూ అనేక కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. బుధవారం బాలానగర్ డిప్యూటీ పోలీసు కమిష నర్ సురేశ్‌కుమార్ తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో హత్యలో మేయర్‌గా వున్న నిందితుడు సురేశ్‌అరెస్టువివరాలతో పాటు హత్యలో భాగస్వాములైన ఇద్దరు మైనర్ బాలిక, బాలుడి వివరాలను వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక విభాగంలో కళాకారిణిగా విధులు నిర్వర్తిస్తున్న అంజలికి ఇద్దరు కుమార్తెలు. మొదటి భర్త కుమార్తె పదవతరగతి చదువుతుంది. రోడ్డుప్రమాదంలో మొదటిభర్త చనిపోవడంతో మరో వివాహం చేసుకుంది. రెండవ భర్తకు కలిగిన చిన్న కుమార్తెపై ప్రేమ చూపుతూ మొ దటిభర్త కూతురునైన తన ప్రేమ చూపకపోగా చిన్నకూతురు ముందే పెద్దకూతురును తిట్టడంతోపాటు అవమానించే తల్లిపై తీవ్రంగా కలతచెందింది.అంజలి తన పెద్దకూతురును నిర్లక్ష్యం చేయడంలో పెద్దకూతురు తన పదవతరగతికే శివ (19) అనే డిజె ఆపరేటర్‌తో ప్రేమలో పడింది. గతంలో శివ అంజలి వున్నఇంట్లోనే పక్కింట్లో అద్దెకు ఉన్నసమయంలో శివతో పెద్దకూతరు ప్రేమాయనం సాగించింది. ఈవిషయం తల్లికి నచ్చచెప్పి తమకు పెళ్లి చేసిపంపించాలని కోరింది. మొదట పెళ్లికి అంగీకరించిన అంజలి తిరిగి పదవ తరగతికే ప్రేమలు,పెళ్లి ఏంటని మంద లించి కూతరును బుద్ధిగా చదువుకోవాలని మందలించింది. దీనిని వ్యతిరేకించిన పెద్దకూతురు ప్రేమించిన శివతో అతని నల్లగొండ జిల్లా కట్టంగూర్‌కు వెళ్లిపోయింది. తనకూతురు కనిపించడం లేదని ఈనెల19న అంజలిజీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయటం, పోలీసులు ప్రేమికులిద్దరితో మాట్లాడి రప్పించి మైనర్‌అయిన పెద్దకూతురును తల్లికి అప్పగించడం జరిగింది. దీనితో అంజలి పెద్దకుమార్తె తనతల్లి బతికివుండగా తమ పెళ్లి జరగదని ప్రియుడితో చర్చించి హత్యకు పథకం వేసింది. అయితే అంజలి తన కూతురు ప్రేమించిన శివ వద్దకూడా డబ్బులు వసూలుచేసేందుకు కుట్ర పన్నిందని తెలిసింది. దీనిలో భాగంగా సోమవారం సాయంత్రం తల్లి పూజ చేస్తున్న సమయంలో తన ప్రియుడు శివకు ఫోన్ చేయడం శివ తన మైనర్ సోదరుడిని తీసుకుని వచ్చి అం జలితో ప్రేమవ్యవహారంపై చర్చించడం ముగ్గురు కలిసి అంజలిని చు న్నీతో గొంతునులిమి చంపడం తెలిసిందే. ఈ కేసులో మైనంర్‌లు అయిన అంజలి పెద్దకుతురు, శివ తమ్ముడిని జువైనల్ హోమ్‌కు పంపి హత్యలో ప్రధానపాత్ర పోశించిన శివను కోర్టుకు పంపి అనంతరం చర్లపల్లికి జైలుకు తరలిం చారు. విలేకరులసమావేశంలో బాలానగర్ అడిషనల్ డిసిపి పి.సత్య నారాయణ, ఎసిపి రమేశ్‌రెడ్డి, జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డంమల్లేశ్,డిటెక్ట్యూ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ కనకయ్య పాల్గొన్నారు.

# సిపిఎస్‌యు భూముల సమస్యను పరిష్కరించండి

## నష్టపరిహారం చెల్లించకుండా ప్రైవేట్‌కు బదలాయిస్తే రాష్ట్రానికి నష్టం
## ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలంటూ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కోరిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ(సిపిఎస్‌యు)లకు కేటాయించిన భూముల సమస్య పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కలిసి వినతి పత్రం సమర్పించారు. 1960లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రా మికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం హైదరాబాద్ చుట్టుపక్కల, ఇతర ప్రాంతాల్లో విలువైన భూములను రాయితీ ధరకు హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్(324.87 ఎకరాలు), హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్(126.33 ఎకరాలు), ఐడిపిఎల్(551.03 ఎకరాలు), హెచ్ఎంటి(888.05 ఎకరాలు) సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (2,272.85 ఎకరాలు), ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ(3,020 ఎకరాలు) తది తర సంస్థలకు కేటాయించిందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రికి వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని సిపిఎస్‌యుల్లో కొన్ని మూత పడ్డాయి. మరికొన్నింటిలో ఉత్పత్తి నిలిచిపోయింది.

26-6P□g7exHMNWJQE.qxd:26-6P□g7exHMNWJQE.qxd 01/01/01 8:53 AM Page 1





బుధవారం బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటున్న యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్టోళ్ల ప్రశాంత్ పాటిల్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న హరీష్‌రావు

# వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు అధికారం తథ్యం

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** అబద్దాల్లో సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పోటీ పడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్టోళ్ల ప్రశాంత్‌పాటిల్ ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేటలో హరీష్‌రావు సమక్షంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ప్రశాంత్ పాటిల్‌కు బిఆర్ఎస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ 18 నెలలపాలనలో చేసిందేమిలేదన్నారు. కెసిఆర్ పేదలకు ఇచ్చిన పథకాలను రద్దు చేశారని తెలిపారు. రేవంత్‌రెడ్డి పాలన మాటలు ఎక్కువ పాలన తక్కువగా మారిందన్నారు. పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ బహిరంగ చర్చకు పోదాం అంటున్నారు ఎక్కడికి రమ్మంటాడో చెప్పాలని తాను సిద్దంగా ఉన్నానని తెలిపారు. సర్కారుకు దమ్ముంటే 40రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఖచ్చితంగా బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చితీరుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించుకొని అందరం ఐక్యతతో ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, విఠల్, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



బుధవారం జలసాధన కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# రైతుల కోసం ఎంతవరకైనా వెళ్తా

## దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

**దుబ్బాక, జూన్ 25, ప్రభాతవార్త:** రైతులకు న్యాయం చేయడానికి ఎంతవరకైనా వెళ్తానని, అవసరమైతే ఎమ్మెల్యే పదవి త్యాగానికి సిద్ధంగా ఉన్నానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని పెద్దగుండవెల్లి గ్రామంలో బుధవారం జలసాధన కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాను రైతు బిడ్డను వ్యవసాయంపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి 12 గ్రామాల రైతులకు సాగునీరు అందించే బాధ్యత తనపై ఉందన్నారు. ఉమ్మడి జిల్లా మంత్రికి, ఇన్‌చార్జి మంత్రికి సిద్దిపేట ప్రాంతంలోని మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయక సాగర్ రిజర్వాయర్లపై కనీస అవగాహన లేదన్నారు.

దుబ్బాక నియోజక వర్గంలో ఉన్న మల్లన్నసాగర్ నుంచి ఈ ప్రాంత రైతులకు సాగు నీరు ఎందుకు అందివ్వరని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

# తొలగించిన కేర్ టేకర్లను మళ్లీ తీసుకోవాలి

## రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 25, ప్రభాతవార్త:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుండి తొలగించిన అసిస్టెంట్ కేర్ టేకర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం అసిస్టెంట్ కేర్ టేకర్ల (అగనెస్ట్ వార్డెన్) ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో పది సంవత్సరాలుగా పనిచేస్తూ, పిల్లలకు తల్లి తండ్రులకు మాదిరిగా సేవలు అందించిన 263 మంది అసిస్టెంట్ కేర్ టేకర్లను విధుల నుండి తొలగించటం అన్యాయమన్నారు. తక్షణమే ప్రభుత్వం తొలగించిన కేర్ టేకర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ పది సంవత్సరాల నుండి ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ కేర్ టేకర్లను అకారణంగా తొలగించటం ఏమి న్యాయమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగంలో చేరిన వీరిపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం పున: ఆలోచన చేసి, తొలగించిన గురుకుల ఉద్యోగస్తులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో అసిస్టెంట్ కేర్ టేకర్ల ఐక్యవేదిక అధ్యక్షులు ప్యాందుల జయేందర్, ఉపాధ్యక్షులు నర్సింగరావు, విరూప, ప్రధాన కార్యదర్శి బి.కరుణాకర్, కార్యదర్శి వలియేటి రాజు, కోశాధికారి బి.రాజు, ప్రచారకార్యదర్శి వి.మల్లేష్, మహిళా నాయకులు మమత, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## వరకట్న వేధింపుల కేసు.. కుటుంబం అక్రమ నిర్బంధం

# ఇల్లందు ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పోలీసు స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసుకు సంబంధించి ఒక కుటుంబం మొత్తాన్ని పోలీసు స్టేషన్‌లో 12 గంటల పాటు నిర్భంధించి వారిపై ఒత్తిడితెచ్చి, రాజీ కుదుర్చుకోవాలని భయభ్రాంతులకు గురిచేసినందుకు ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణను మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19వ తేదీన రాంరెడ్డితో పాటు ఆయన భార్య ఇతర కుటుంబ సభ్యులను ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఎలాంటి కేసు నమోదు చేయకుండానే 12 గంటల పాటు అక్రమంగా నిర్భంధించారని ఫిర్యాదు అందింది. రాంరెడ్డి కోడలు చేసిన ఫిర్యాదుపై ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఎలాంటి విచారణ చేయకుండానే, కేసు నమోదు చేయకుండానే అందరిని నిర్భంధించి, భయభ్రాంతులకు గురిచేసినట్లు దీనిపై విచారించిన జిల్లా పోలీసు అధికారులు తేల్చారు. ఈ క్రమంలో రాంరెడ్డి భార్య పద్మజ పోలీసు స్టేషన్‌లోనే అనారోగ్యానికి గురై స్పృహతప్పగా ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రస్తుతం కోలుకుంటోంది. ఈ ఘటనపై విచారించిన జిల్లా పోలీసు అధికా రులు ఇందులో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ చట్ట వ్యతిరేకంగా వ్యవహరించినట్లు తేల్చారు. దీనిపై అందిన నివేదిక ఆధారంగా ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను ఐజి చంద్రశేఖర్ రెడ్డి సస్పెండ్ చేశారు.

# హోంగార్డులకు ఉన్ని జాకెట్లు, రెయిన్ కోట్లు

**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** వర్షాకాలం మొదలవడంతో రాష్ట్రంలోని ఆయా జిల్లాలలో విధులు నిర్వహించే హోంగార్డులకు ఎలాంటి ఇబ్బందులు లే కుండా వుండేందుకు పోలీసు శాఖ ఉన్ని జాకెట్లు, రెయిన్ కోట్లు అందించింది. డిజిపి కార్యాలయంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో హోంగార్డుల విభాగం అదనపు డిజి స్వాతి లక్రా వీటిని హోంగార్డులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమం కోసం సర్కారు ఎన్నో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తం గా వున్న అందరు హోంగార్డులకు ఉన్ని జాకెట్లు, రెయిన్ కోట్లు అందజేస్తామని ఆమె తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా బడ్జెట్ మంజూరయ్యిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పి అండ్ఎల్ ఐజి రమేష్‌తో పాటు హోంగార్డుల కమాండంట్ వెంకటేశ్వర్లు, డిఎస్‌పి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళికలు

## మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తూ ఈ రంగం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా మంత్రి జూపల్లి సోమశిల, అమరగిరి, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, నార్లాపూర్ రిజర్వాయర్, కొల్లాపూర్‌లోని మాధవస్వామి ఆలయం, జెటప్రోలు మదనగోపాల స్వామి దేవాలయాన్ని సందర్శించారు. పర్యాటక అభివృద్ధికి ఉన్నఅవకాశాలనుక్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ /యూనియన్ టెరిటరీస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(సాస్కి) పథకం కింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్ కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పర్యాటక శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కొల్లాపూర్ క్యాంప్ కార్యాలయంలో సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యాచరణపై పర్యాటక శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు కేవలం టూరిజం ద్వారానే అభివృద్ధి చెందాయని, రాష్ట్రాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వ యంతో ముందుకు వెళ్లాలన్నారు. త్వరలో టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. పర్యాటక రంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకెళ్తామని, ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని అన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. సోమశిల వెల్‌నెస్, స్పిరిచ్యువల్ రిట్రీట్ నల్లమల ప్రాజెక్టుకు స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్/ యూనియన్ టెరిటరీస్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(సాస్కి) పథకంకింద రూ.68.10 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆ నిధులతో పర్యావరణం, జల వనరులు, ఆలయాలు, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్స్‌కు పుష్కలమైన వనరులు ఉన్న సోమశిల, అమరగిరి ద్వీపం, మల్లేశ్వరం, ఈగలపెంటను అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. క్లస్టర్ 1: ఈగల పెంట అరైవల్ జోన్, ఈగలపెంట విహార యాత్ర, ఈగలపెంట రివర్ క్రూయిజ్, చెంచు ట్రైబల్‌ఎక్స్పీరియన్స్, క్లస్టర్ 2: సోమశిల వెల్నెస్ అండ్ స్పిరిచ్యువల్ రిట్రీట్ ఉంటాయని అన్నారు. సోమశిలలో బోటింగ్ జెట్టి, అమరగిరి ద్వీపంలో బోటింగ్ జట్టి, కాటేజీలు, స్విమ్మింగ్ పూల్, కేఫ్టీరియా, స్పా, వెల్ నెస్ సెంటర్, ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్, ఇతర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ కార్యక్ర మంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, కలెక్టర్ బదావత్ సంతోష్, ఇతర అధికారులు ఉన్నారు.

# ఘనంగా డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం..




**హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మాదక ద్రావ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం తెలంగాణ వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ అందరితో కలిసి డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాల్ని జరుపుకున్నారు. నక్లెస్ రోడ్డు జల వీహార్ ముందు నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక దినోవత్సవంలో తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ పాల్గొన్నారు. ఎక్సైజ్ శాఖ పోలీసులు, అధికారులు సీనియర్ సిటిషన్లు, విద్యార్థులు, యువత, పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి అన్ని జిల్లా కేంద్రాల్లో డ్రగ్‌ను వినియోగించ వద్దని ప్లా కార్డులతోను, బ్యానర్లతో ర్యాలీలు నిర్వహించారు. సభలు, సమావేశాలు నిర్వహించిడ్రగ్స్ వాడకం, అమ్మకం, రవాణ ఎన్‌పీడీఎస్ యాక్ట్ కింద నేరంగా పరిణనించబడుతుందని ప్రజలకు సమాచారం అందించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, జీవితాలు ఎలా ఉంటాయనే విషయాలపై ఎక్సైజ్ పోలీసులు యువతకు అవగహన కలిపించారు. నిజామాబాద్, వరంగల్ అర్బన్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, సిద్దిపేట, జనగామ, సిరిసిల్ల, నిర్మల్‌తో పాటు ఇతర జిల్లాల డిప్యూటి కమిషనర్లు, ఎక్సైజ్ సూపరిండెంట్లు పోలీసులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించారు. డ్రగ్స్ పై ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి డ్రగ్స్ పై అవగాహన కల్పిన ఎక్సైజ్ అధికారులకు, సిబ్బందికి అబ్కారీ శాఖ కమిషనర్ సి.హరి కిరణ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం డ్రగ్స్ నిషేదత దినోత్సవాన్ని తెలంగాణ వ్యాపంగా ఘనంగా నిర్వహించినందుకు అభినందించారు.

# ఏనుగుదంతాలు విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

**హైదరాబాద్, జూన్25, ప్రభాతవార్త:** ఏనుగులకు దంతాలు కట్‌చేసి అక్రమంగా విక్రయాలు జరుపుతున్న ముఠాను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై బుధవారం ఎల్బీనగర్ సీపీ క్యాంప్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. ఏపీలోని రాయచోటికి చెందిన రేకులకుంట ప్రసాద్, లోకేశ్వర్‌రెడ్డిలు ఒక ముఠాగా ఏర్పడి ఏనుగుదంతాలను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈ క్రమంలో తిరుపతి శేషాచల అడవుల్లో ఏనుగుల దంతాలను కొల్లగొట్టి నగరానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగా వారిపై అటవీశాఖ, ఎస్వోటీ పోలీసుల నిఘా ఏర్పాటు చేసి జాయింట్ ఆపరేషన్ చేయగా బస్సులో 5.6కేజీల రెండు ఏనుగు దంతాలను తరలిస్తుండడంతో తనిఖీ చేసి వెలుగుచూసిందన్నారు. ప్రసాద్‌ను అరెస్ట్ చేసి దంతాలను స్వాధీనం చేసుకున్నారు. ఇది అంతర్జాతీయ మార్కెట్లో సుమారు రూ.3కోట్ల పైబడే ఉంటుందని పేర్కొన్నారు. రూ. 60లక్షల వరకు బహిరంగమార్కెట్లో విక్రయిస్తున్నారన్నారు. అయితే ఇవి ఒరిజినల్ దంతాలా కాదా అని ఫారెస్ట్ వాళ్ళతో చెక్ చేయించినట్లు వివరించారు. వారిద్దరికీ జైల్లో పరిచయం కావడంతో విడుదలై ముఠాగా ఏర్పడి అక్రమదందాకు తెరలేపారని తెలిపారు. వైల్డ్ లైఫ్ యాక్ట్ 1972 ప్రకారం ఇది చట్టరీత్యా నేరమన్నారు. అక్రమకలాపాలపై ప్రత్యేకదృష్టిసారించామని పేర్కొన్నారు. లోకేశ్వర్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. త్వరలో పట్టుకుంటామని వివరించారు. గతంలో ఎర్ర చందనం స్మగ్లింగ్ కేసులో ప్రసాద్ నిందితుడిగా ఉన్నాడని సుధీర్‌బాబు తెలిపారు.

# రాష్ట్రంలో భారీగా భూ సమస్యలు, 8 లక్షలకు పైగా దరఖాస్తులు

**హన్మకొండ బ్యూరో, జూన్ 25 ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్రంలో తలపెట్టిన రెవెన్యూ సదస్సులు ఇటీవల ముగిసిన విషయం తెలిసిందే. భూ సమస్యలపై 8 లక్షలకుపైగా దరఖాస్తులు అందాయి. 3 దశల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భారీగా అప్లికేషన్లు వచ్చాయి. ఏప్రిల్ 17 నుంచి 30 వరకు నాలుగు మండలాల్లో ముందుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆ తర్వాత రెండో దశ కింద మరో 28 మండలాల్లో దరఖాస్తులను స్వీకరించారు. మూడో విడతగా మిగిలిన మండలాల్లో నిర్వహించారు. మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు 4మండలాల్లో నిర్వహించిన 72 రెవెన్యూ సదస్సుల్లో 12వేల దరఖాస్తులు అందాయి. రెండవ దశలో మే 5వ తేదీ నుంచి 28 మండలాల్లో నిర్వహించిన 414 సదస్సుల్లో 46 వేల దరఖాస్తులు అందాయి. సాదాబైనామాల అంశం మినహా సుమారు 60 శాతంపైగా సమస్యలకు పరిష్కారం చూపారు. జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 561 మండలాల్లో 10,239 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించి 8 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా మూడు విడతల్లో 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో 8.58 లక్షల దరఖాస్తులు వచ్చాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేలు, భద్రాద్రి కొత్తగూడెం 61వేలు, వరంగల్ 54 వేలు, జయశంకర్ భూపాలపల్లి 48వేలు, నల్గొండ 42వేల దరఖాస్తులు అందాయి. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులను పంపిణీ చేశారు. స్వీకరించిన వాటికి రశీదులను అందజేశారు. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు


## తక్షణమే 42 బిసి రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు జరపండి

### బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

**హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** రాష్ట్ర హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 30వ తేదీలోపు జరిపించాలని ఇచ్చిన తీర్పు, ప్రజాస్వామ్యాన్ని అవమానించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక చెంపపెట్టు లాంటిదని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ తొలి నుంచి ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని, 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు అధికారాలు, నిధులు కల్పించిన ఘనత భారతీయ జనతా పార్టీదే అన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో గత 18 నెలలుగా స్థానిక ఎన్నికలు జరపకపోవడం అప్రజాస్వామికం అన్నారు. ప్రజా ప్రతినిధి లేకపోవడం వల్ల గ్రామాల్లో ఎక్కడికక్కడ అభివృద్ధి కుంటుపడిందని, కనీస సౌకర్యాలు లేవు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా మేలుకుని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం 42 బిసి రిజర్వేషన్‌ను స్థానిక సంస్థల్లో అమలు చేస్తూ వెంటనే ఎన్నికలు నిర్వహించాలని అన్నారు.

# హరీష్! ధైర్యం ఉంటే బనకచర్లపై ప్రత్యేక చర్చకు డిమాండ్ చెయ్

## పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి



**హైదరాబాద్, జూన్25, ప్రభాతవార్త:** హరీష్‌రావు నీకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి మీ పార్టీ నుంచి లేఖ ఇచ్చి డిమాండ్ చేయ్ మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బనకచర్ల పైన చర్చకు సిద్ధమా అని సూటిగా, స్పష్టంగా సవాల్ విసిరారని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడూతూ హరీష్‌రావు నువ్వు నోటికొచ్చినట్లు వాగుతున్నవు బనకచర్ల పైన అసెంబ్లీ సమావేశానికి ఎందుకు నువ్వు, నీ మామ భయపడుతున్నరని నిలదీశారు. తెలంగాణకు గత పదేళ్లలో నీటి వాటాల విషయంలో మీరు చేసిన ద్రోహాన్ని అసెంబ్లీ సాక్షిగా బట్టబయలు చేస్తామన్న భయమా? అనిఆయన నిలదీశారు. మీరు పెట్టిన అడ్డగోలు సంతకాలతో కృష్ణా జలాల్లో కేవలం 299 టిఎంసిల వాటా మాత్రమే తెలంగాణ కు వచ్చిం దన్న విషయంపైన నిలదీస్తమని భయమా.? అని ఆయన అన్నారు. గోదావరిలో 3000 టీఎంసీ ల మిగులు జలాలు ఉన్నాయని, అవి వాడుకొని రాయలసీమను రతనాల సీమ చేయమని నీ మామ చెప్పిన బడాయి కబుర్లు బయటకు వస్తాయని టెన్షనా మీకు?!! అని ఎద్దేవా చేశారు. గోదావరిలో మిగులు జలాలు మీ ఇష్టం వచ్చినట్లు వాడుకోమని నాటుకోడి, రాగి సంగటి కింద రాసిచ్చిన విషయాలు చర్చకు వస్తాయని చర్చకు రాకుండా తప్పించుకొంటున్నారాఅని ఆయన ఎద్దేవా చేశారు. కమిషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరాన్ని కూల్చిన దద్దమ్మలు, సన్నాసులు మీరని విమర్శించారు. దద్దమ్మ హరీష్ రావు ముందు మేడి గడ్డ ఎందుకు కుంగిపోయిందో సమాధానం చెప్పు అని ఆయన కోరారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ఎంత వరకు వచ్చిందో అందరూ చూస్తున్నారు? కల్వకుర్తి, నెట్టెం పాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులు ఆ నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపడితే మీరు పూర్తి చేయలేకపోయారని ఆవేదన చెందారు.

# బూర్గంపాడు ఘటనలో నివేదిక కోరాం

## మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ జూన్ 25 ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి ఫారెస్ట్ బీట్లో లోని కొసగుంపు వలస ఆదివాసీ గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటనపై తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఫారెస్ట్ భూమికి కందకాలు తవ్వేందుకు వెళ్లిన జేసీబీని కొసగుంపుకు చెందిన వలస ఆదివాసీ మహిళలు అడ్డుకున్న నేపథ్యంలో చోటు చేసుకున్న ఘర్షణ విషయంలో మంత్రి సురేఖ, జిల్లా అటవీ అధికారులను, జిల్లా ఉన్నతాధికారులను నివేదిక కోరుతానని చెప్పారు. ఈ మేరకు మంత్రి సురేఖ మీడియాకి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కందకాలు తవ్వకుండా జేసీబీకి అడ్డుగా మహిళలు బైఠాయించగా, ఫారెస్ట్ అధికారులు మహిళలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వలస ఆదివాసీ మహిళలకు, ఫారెస్ట్ అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నదని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. కాగా, ఇదే విషయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి అనసూయ సీతక్క కూడా మంత్రి సురేఖతో ప్రత్యేకంగా ఫోన్‌లో మాట్లాడారు. నివేదిక వచ్చిన తర్వాత తదనుగుణంగా ముందుకు వెళదామని అటవీ మంత్రి సురేఖ, సీతక్కకు హామీనిచ్చారు.

# ఢిల్లీలో జరిగే బోనాల ఉత్సవాలకు రండి

## టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌కు మహంకాళీ దేవాలయ కమిటీ ఆహ్వానం



**హైదరాబాద్, జూన్25, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీ తెలంగాణ భవన్ లో ఈ నెల 30, జులై 1,2 తేదీల మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలకు రావాలని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయం కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం గాంధీ భవన్‌లో మహేష్ కుమార్ గౌడ్ ను ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్లు కె.విష్ణు గౌడ్, కె.వెంకటేష్, సాంస్కృతిక కార్యదర్శి ఎ.వినోద్ కుమార్, గడ్డం రవి, కాంగ్రెస్ నేత డి.ఎల్.నర్సింగ్ గౌడ్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ఆహ్వాన పత్రిక ను అందజేశారు. ఢిల్లీలో గత పది సంవత్సరాల నుండి తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆయనకు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేశారు.

# నక్సలైట్ల హత్యలపై మాట్లాడే పౌరహక్కుల సంఘం లవ్ మర్డర్లపై ఎందుకు గొంతు విప్పరు?

## ఎన్ఎస్‌యుఐ కో-లివింగ్‌పై దృష్టి సారించాలి

### మాజీ ఎంపి వి.హనుమంతరావు



**హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** నక్సలైట్ల హత్యలపై మాట్లాడే పౌరహక్కుల సంఘం వాళ్ళు లవ్ మర్డర్లపై ఎందుకు గొంతు విప్పరని మాజీ ఎంపి వి. హనుమంతరావు ధర్మసందేహం వ్యక్తంచేశారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ హైటెక్ సిటీలో కొలివింగ్‌ను ఆపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ను కోరినారు. ఒకే హాస్టల్ లో ఆడపిల్ల, మగ పిల్లలు కలిసి ఉంటుంన్నారని హనుమంతరావు ఆవేదన చెందారు. హైదరాబాద్ నెంబర్ వన్ సిటీ కావాలంటే ఇలాంటి వాటిని కట్టడి చేయాలని ఆయన కోరారు. ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం కోలివింగ్ మీద దృష్టి పెట్టాలని అన్నారు. గతంలో ఫ్యాక్షన్ మర్ధర్స్ ఉండేవి, ఇప్పుడు సొంత భర్తను, కూతురు తల్లిని చంపడం అనేది దారుణం అన్నారు. ఇప్పుడు లవ్ మర్ధర్స్ జరుతున్నాయని అన్నారు. ఇలాంటి వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దని రిక్వెస్ట్ చేశారు. సమాజం ఎటు వైపు పోతుందని భయమేస్తుందని ఆవేదనచెందారు. ఇలాంటి మర్ధర్స్‌ను హ్యూమన్ రైట్స్ టేక్ అప్ చేయాలి సైకాలజిస్ట్‌లు, ఇంటలెక్చవల్స్ ఆలోచన చేయాలని అన్నారు. తప్పు జరుగు తుందని అన్నారు. సవిత్రిభాయ్ పూలే ను ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు.

26-6pg10.qxd:26-6pg10.qxd 01/01/01 7:55 AM Page 1



# ర్యాంకింగ్స్‌లో 7వ స్థానానికి రిషబ్



## ఆల్ రౌండర్ల అగ్రస్థానంలో రవీంద్ర జడేజా

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌తో తొలి టెస్టుల్లో బ్యాక్‌టుబ్యాక్ సెంచరీలతో చెలరేగిన భారత స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా ఏడో ప్లేస్‌కు చేరుకున్నాడు. ఈ మేరకు ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ సైతం టాప్20లోకి ప్రవేశించాడు. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో గిల్ సెంచరీ చేశాడు. టాప్ 20 టెస్ట్ బ్యాట్స్‌మెన్ జాబితాలో భారతదేశం నుంచి ముగ్గురు బ్యాట్స్‌మెన్ మాత్రమే ఉన్నారు. పంత్, గిల్‌తో పాటు యశస్వి జైస్వాల్ నాలుగోస్థానంలో ఉన్నాడు. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి సైతం సెంచరీ చేశాడు. అయితే టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు జరుగలేదు. హెడింగ్లీ టెస్ట్‌లో 14వసారి ఐదు వికెట్లు తీసిన తర్వాత భారత ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ విజయంలో కీలకపాత్ర పోషించిన బెన్ డకెట్ ఐదు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ ఓలీ పోప్ మూడు స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి, జామీ స్మిత్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 27వ స్థానానికి చేరుకున్నారు. ఇంగ్లండ్ సీనియర్ ప్లేయర్ జో రూట్ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. హ్యారీ బ్రూక్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ మూడోస్థానంలో ఉన్నాడు. లీడ్స్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బాల్, బ్యాట్‌తోనూ రాణించగా, ఆల్‌రౌండర్ల జాబితాలో మూడుస్థానాలు మెరుగుపరుచుకొని ఐదోప్లేస్‌కు చేరాడు. టెస్ట్ ఆల్ రౌండర్ల జాబితాలో టీమిండియా ప్లేయర్ రవీంద్ర జడేజా అగ్రస్థానంలో ఉన్నాడు. గాలె టెస్టులో 163 పరుగులు చేసిన బంగ్లా ప్లేయర్ ముష్ఫికర్ రహీమ్ 11 స్థానాలు ఎగబాకి 28వ స్థానానికి చేరుకోగా, నజ్ముల్ హుస్సేన్ శాంటో ఒకే మ్యాచ్‌లో రెండు సెంచరీలు చేసి 21 స్థానాలు ఎగబాకి 29వ స్థానానికి చేరుకున్నాడు.



## ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ అథ్లెట్ల పతకాల జోరు

**న్యూఢిల్లీ:** సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో 3వ రోజు భారత్ అథ్లెట్ల పతకాల జోరు కొనసాగింది. వివిధ ఈవెంట్లలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించారు. ఈ టోర్నీలో కర్ణాటకకు చెందిన ఎస్ రుజుల అత్యంత వేగవంతమైన ఈత అమ్మాయిగా నిలిచి అత్యుత్తమ భారతీయ ప్రదర్శన ఇచ్చింది. 2008లో సింగపూర్‌లో శిఖా టాండన్ నెలకొల్పిన 0.01 సెకన్ల రికార్డును రుజుల 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో 26.36 సెకన్లలో పూర్తి చేసి బద్దలు కొట్టింది. రైల్వేస్‌కు చెందిన అవంతిక సుధీర్ చవాన్ (26.58సె), కర్ణాటకకు చెందిన దేశింఘు (26.69సె) వరుసగా రజత మరియు కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల 400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో గుజరాత్‌కు చెందిన ఆర్యన్ నెహ్రా 3:55.96 సెకన్ల సమయంతో స్వర్ణాన్ని సాధించాడు. ఢిల్లీకి చెందిన కుషాగ్ర రావత్ (3:56.84సె), కర్ణాటకకు చెందిన అనీష్ ఎస్ గౌడ (3:57.17సె) వరుసగా రజత, కాంస్యం గెలుచుకున్నారు. మహిళల 200 మీటర్ల బటర్‌ఫ్లై పోడియంను రైల్వేకు చెందిన ఆస్తాచౌదరి (2:20.63సె), తమిళనాడుకు చెందిన రోషిణి బాలసుబ్రమణియన్ (2:20.77సె), ఒడిశాకు చెందిన శ్రుష్టి ఉపాధ్యాయ (2:23.11సె) సొంతం చేసుకున్నారు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో శ్రీహరి నటరాజ్ 25.70 సెకన్లలో సాధించాడు. మహారాష్ట్రకు చెందిన రిషబ్ అనుపమ్ (26.02సె), కర్ణాటకకు చెందిన ఆకాష్ మణి (26.12సె) వరుసగా రజత, కాంస్యం గెలుచుకున్నారు. 200 మీటర్ల బటర్‌ఫ్లైలో ఒలింపియన్ సజన్ ప్రకాష్ 1:58.98 సెకన్లతో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. రైల్వేకు చెందిన బిక్రమ్ చాంగ్‌మై (2:02.13 సెకన్లు), కర్ణాటకకు చెందిన దర్శన్ ఎస్ (2:03.11 సెకన్లు) వరుసగా రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు. మహిళల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కర్ణాటకకు చెందిన విహిత (29.99 సెకన్లు) స్వర్ణం, గోవాకు చెందిన సంజన ప్రభుగాంకర్ (30.68 సెకన్లు) రజతం, బెంగాల్‌కు చెందిన సౌబ్రిటీ మండల్ (30.70 సెకన్లు) రజతం సాధించారు. ఢిల్లీకి చెందిన భవ్య సచ్‌దేవా 17:35.07 సెకన్లలో గమ్యాన్ని చేరుకోవడం ద్వారా 10 ఏళ్ల మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టైల్ మీట్ రికార్డును బద్దలు కొట్టింది. ఇది ఛాంపియన్‌షిప్‌లలో భవ్యకు రెండవ స్వర్ణం మరియు మొత్తం మీద మూడవ పతకం. అంతకుముందు ఆమె 400 మీటర్ల ఫ్రీస్టైల్‌లో స్వర్ణం మరియు 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజతం సాధించింది. ఇక రజతం కోసం హోరాహోరీగా జరిగిన రేసులో తెలంగాణకు చెందిన వృత్తి అగర్వాల్ (17:41.36) కర్ణాటకకు చెందిన తాన్య షడక్షరిని (17:41.45) ఓడించింది.

## అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మురాద్, అనుష్కలకు స్వర్ణాలు



**న్యూఢిల్లీ:** జాతీయ అండర్ 20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో మురాద్ కొత్త మీట్ రికార్డును నెలకొల్పగా, మహిళల హ్యామర్ త్రోలో అనుష్క అదే స్థానాన్ని దక్కించుకుంది. ప్రయాగ్‌రాజ్ లోని మదన్ మోహన్ మాలవ్య స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 23వ జాతీయ జూనియర్ (అండర్ 20) ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లలో గుజరాత్‌కు చెందిన మురాద్ సిర్మాన్ మరియు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అనుష్క యాదవ్ కొత్త మీట్ రికార్డులను సృష్టించారు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్‌లో మురాద్ 50.75 సెకన్ల అద్భుతమైన సమయంతో స్వర్ణం సాధించాడు, 2012లో దుర్గేష్ కుమార్ పాల్ నెలకొల్పిన 51.26 సెకన్ల మీట్ రికార్డును బద్దలు కొట్టాడు. అలాగే మహిళల హ్యామర్ త్రోలో, అనుష్క 60.46 మీటర్ల దూరం నమోదు చేయడం ద్వారా అంచనాలను అధిగమించింది. 2022 నుండి తాన్యచౌదరి కలిగి ఉన్న 57.09 మీటర్ల మీట్ మార్కును అధిగమించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో జరిగిన 2025 ఉత్తరాఖండ్ జాతీయ క్రీడలలో 62.89 మీటర్లు విసిరి అనుష్క ఇప్పటికే జూనియర్ జాతీయ రికార్డును కలిగి ఉండగా, ఇక్కడ ఆమె ఫామ్ ఆమె ఆధిపత్యాన్ని మరింత ధృవీకరించింది.



## టెస్టుల్లో టీమిండియా చెత్త రికార్డు

### బ్యాటర్లు రాణించినా ఫీల్డింగ్, బౌలర్ల వైఫల్యం

**న్యూఢిల్లీ:** టెస్టు క్రికెట్‌లో టీమిండియా చెత్త రికార్డును నమోదు చేసుకుంది. అంతకుముందు ఈ చెత్త రికార్డు ఆస్ట్రేలియా పేరిట ఉండేది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఓటమి చెందడంతో టెస్టు క్రికెట్‌లో భారత్ చెత్త రికార్డు సంపాదించింది. ఒక టెస్టు మ్యాచ్‌లో ఐదు సెంచరీలు చేసి ఓటమిపాలైన తొలి జట్టుగా భారత్ నిలిచింది. ఐదు టెస్టు మ్యాచ్‌ల్లో భాగంగా లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో ఇండియా ఓటమిపాలైంది. ఇందులో భారత్ బ్యాటర్లు అద్భుతంగా రాణించి సెంచరీల మోత మోగించారు. కానీ, ఫీల్డింగ్, బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో ప్రదర్శన కనబర్చలేదు. రెండో ఇన్నింగ్స్‌లో 371 పరుగుల భారీ లక్ష్యాన్ని ఐదోరోజు మ్యాచ్‌లో ఇంగ్లాండ్ సునాయసంగా ఛేదించింది. దీంతో తొలి టెస్టులో విజయాన్ని అందుకుంది. తొలి ఇన్నింగ్స్ రిషబ్ పంత్ 134, రెండో ఇన్నింగ్స్‌లో 118 పరుగులు చేశాడు. యశస్వీ జైస్వాల్ తొలి ఇన్నింగ్స్‌లో 101, శుభ్‌మన్ గిల్ తొలి ఇన్నింగ్స్‌లో 147, కేఎల్ రాహుల్ రెండో ఇన్నింగ్స్‌లో 137 పరుగులు. ఇలా రెండు ఇన్నింగ్స్‌లలో ఐదుగురు బ్యాటర్లు సెంచరీలు చేసినా టెస్టు మ్యాచ్‌లో భారత్ జట్టు ఓటమిచెందింది. అయితే ఈ చెత్త రికార్డు ఇప్పటి వరకూ ఆస్ట్రేలియా పేరిట ఉండేది. 1928-29లో జరిగిన యాషెస్ మ్యాచ్‌లో నాలుగు సెంచరీలు చేసినప్పటికీ ఆ జట్టు ఓడిపోయింది. డాన్ బ్రాడ్‌మాన్ ఆ మ్యాచ్‌లో తన తొలి సెంచరీ చేశాడు. ఇక ప్రస్తుత టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 471 పరుగుల భారీస్కోరు చేయగా, ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌటైంది. ముఖ్యంగా ప్రసిద్ధ్ కృష్ణ, శార్దూల్ ఠాకూర్ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. కర్ణాటక పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ తొలి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లు బౌలింగ్ చేసి 3 వికెట్లు పడగొట్టినప్పటికీ, ఏకంగా 128 పరుగులు ఇచ్చాడు. అతని ఎకానమీ రేటు 6.40గా నమోదైంది. ఇది టెస్ట్ క్రికెట్‌లో అత్యంత చెత్త గణాంకాలలో ఒకటిగా నిలిచింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లోనూ ప్రసిద్ధ్ తన వైఫల్యాన్ని కొనసాగించాడు. 6 ఓవర్లు వేసి వికెట్ తీయకుండా 38 పరుగులు ఇచ్చాడు. మరోవైపు, పేస్ ఆల్‌రౌండర్‌గా జట్టులోకి వచ్చిన లార్డ్ శార్దూల్ ఠాకూర్ బంతితో పాటు బ్యాట్‌తోనూ విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అతనికి కేవలం 6 ఓవర్లు మాత్రమే ఇచ్చాడు. అందులో శార్దూల్ వికెట్ తీయకుండా 38 పరుగులు సమర్పించుకున్నాడు (ఎకానమీ 6.33)గా ఉంది. రెండో ఇన్నింగ్స్‌లో అయితే పరిస్థితి మరింత దారుణంగా మారింది. కేవలం 3 ఓవర్లు వేసి 17 పరుగులు ఇచ్చాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు.

## 'నేషన్స్ హాకీ'లో భారత్ ఓటమి

### 1-5 తేడాతో స్పెయిన్ విజయం

**న్యూఢిల్లీ:** 4నేషన్స్ హాకీ టోర్నమెంట్‌లో భారత జూనియర్ పురుషుల జట్టు స్పెయిన్ చేతిలో పరాభవం చెందింది. ఈ టోర్నీలో భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు తమ మూడవ మరియు చివరి పూల్ దశ మ్యాచ్‌లో స్పెయిన్ చేతిలో 1-5 తేడాతో ఓడిపోయింది. స్పెయిన్ ఫ్రంట్ ఫుట్ ద్వారా ఆటను ప్రారంభించింది, మొదటి నిమిషాల్లోనే వరుసగా రెండుసార్లు గోల్ చేసింది. 2వ నిమిషంలో పెరె అమాట్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత శాంటి మార్టిన్ 3వ నిమిషంలో ఫీల్డ్ గోల్ చేసి స్పెయిన్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. రెండవ క్వార్టర్‌లో రెండు జట్లు ఎండ్‌టుఎండ్ హాకీలో పాల్గొన్నాయి. ఇరు జట్లు గోల్ కోసం ప్రయత్నిస్తూ ఆధిక్యాన్ని పెంచుకోవాలని చూసినా ఏ జట్టు కూడా తమ అవకాశాలను మలచుకోలేకపోయింది. దీంతో హాఫ్ టైం ముగిసే సమయానికి స్కోరు 2-0తో స్పెయిన్‌కు అనుకూలంగా ఉంది. మూడో క్వార్టర్‌లో స్పెయిన్ తిరిగి నియంత్రణ సాధించి,




భారత్ రక్షణాత్మక లోపాలను సద్వినియోగం చేసుకుంది. పెరే అమత్ (42వ నిముషం) మరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడం ద్వారా మ్యాచ్‌లో తన రెండవ గోల్‌ను జోడించాడు. ఒక నిమిషం తర్వాత, జోసెప్ మార్టిన్ (43వ నిముషం)తో స్పెయిన్ ఆధిక్యాన్ని 4-0కి పెంచి ఫీల్డ్ గోల్ చేశాడు. ఇక నాల్గవ మరియు చివరి క్వార్టర్‌లో, మారియో మెనా (51వ నిముషం) చేసిన మరో పెనాల్టీ కార్నర్ ద్వారా స్పెయిన్ ఐదవ గోల్‌తో అంతరాన్ని మరింత పెంచింది. అరైజీత్ సింగ్ హుండాల్ (52వ నిముషంలో) ఫీల్డ్ గోల్ చేసి లోటును తగ్గించి క్లీన్ స్వీప్‌ను నివారించడంతో భారత్ దాదాపు వెంటనే ఒక గోల్‌ను వెనక్కి తీసుకోగలిగింది. ఈ ఫలితంతో, భారతదేశం తన పూల్ దశ మ్యాచ్‌లను ముగించింది.

# వాణిజ్యం

## టాటాప్లేకు పెరుగుతున్న నష్టాలు

### ఈ యేడాదిలోనే 529.43 కోట్ల నష్టం

**ముంబై, జూన్ 25:** డిజిటల్ రంగంలో మూడో అతిపెద్ద కంపెనీగా ఉన్న టాటాప్లే నష్టాలు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం నష్టం 529.43 కోట్లకుపెరిగింది. ఇతర డిటిహెచ్ ఆపరేటర్లు డిష్‌టివి, ఎయిర్‌టెల్ డిజిటల్‌టివి, డివి ఫ్రీడిష్‌లతో ఇపుడు పోటీపడుతోంది. 2024లో కంపెనీకి 353.88 కోట్లునష్టం వాటిల్లింది. కార్యకలాపాల ద్వారా వచ్చే రాబడులు 5.15 శాతం తగ్గి 4082.5కోట్లకు పెరిగాయి. నష్టాలకు తగిన కారణాలు మాత్రం కంపెనీ చెప్పలేకపోతోంది. మొత్తం ఆదాయం అన్ని వనరులనుంచి వచ్చిన రాబడులు కూడా 5.03శాతం తగ్గి 4109.3 కోట్లకు చేరింది. టాటాప్లే వ్యాపార ప్రకటనల ప్రమోషన్ ఖర్చులు 29.2 శాతం తగ్గి 124.28 కోట్లకు చేరాయి. అంతకుముందు ఏడాది 175.54 కోట్లుగా ఉన్నాయి. మొత్తం వ్యయాలు కూడా గణనీయంగా తగ్గించుకోగలిగింది. 3శాతం తగ్గి 4619.22కోట్లకు చేరాయి. అయితే కంపెనీ తన రుణభారాన్ని గణనీయంగా తగ్గించుకుంటున్నది. 3445.60 కోట్లనుంచి 4010.21 కోట్లుగా ఉంది. కంపెనీ మాతృసంస్థ టాటాసన్స్‌కు 60శాతం వాటాలున్నాయి. గత ఏడాది టాటాప్లేలో బైట్రీ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా 10శాతం వాటాలు కొనుగోలు చేసింది. ఈ డీల్‌లో 100 మిలియన్ డాలర్ల డీల్‌గా నిలిచింది. టాటాసన్స్ తర్వాత నెట్‌వర్కక డిజిటల్ డిస్ట్రిబ్యూషన్ సర్వీసెస్ ఎఫ్‌జడ్, టిఎస్ ఇన్వెస్ట్‌మెంట్స్ కంపెనీలో రెండో అతిపెద్ద వాటాదారులు వారు 20శాతంచొప్పున వాటాలు కలిగి ఉన్నారు. ప్రస్తుతం టాటాసన్స్, టిఎస్ ఇన్వెస్ట్ రెండే అతిపెద్ద ప్రమోటర్లుగా ఉన్నారు. ఎయిర్‌టెల్, టాటాప్లేరెండింటినీ విలీనంచేయాలని గతంలో చర్చలు జరిగాయి. తర్వాత సంతృప్తికరంగా చర్చలు లేకపోవడంతో విలీనం డీల్‌ను రద్దు చేసుకుంటున్నట్లు తెలిపారు.




## అనిల్ అంబానీ బకాయిలు చెల్లింపు

**న్యూఢిల్లీ, జూన్ 25:** ఒకప్పుడు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న అనిల్ అంబానీ కంపెనీ ఇప్పుడు సరికొత్తగా మార్కెట్లోకి తిరిగొస్తోంది. అనిల్ అంబానీ కంపెనీ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ సంస్థ జెఆర్ టోల్ రోడ్ ప్రైవేట్ లిమిటెడ్ (జెఆర్‌టిఆర్) ఇటీవల వడ్డీతో సహా రూ.273 కోట్ల బకాయి రుణాన్ని తిరిగి చెల్లించింది. ఇది యెస్ బ్యాంక్ ఇచ్చిన రుణం. ఇది మాత్రమే కాదు, గ్రూప్‌లోని మరో కంపెనీ ఇప్పుడు ఫ్రాన్స్‌కు చెందిన ప్రసిద్ధ ఏరోస్పేస్ కంపెనీ డసాల్ట్ ఏవియేషన్‌తో కలిసి ఇండియాలో బిజినెస్ జెట్‌లను తయారు చేయబోతోంది. 2013 సంవత్సరంలో జెఆర్‌టిఆర్ జైపూర్ నుండి రింగాస్ వరకు 52 కి.మీ పొడవైన హైవేను నిర్మించింది. ప్రారంభంలో అంతా బాగానే జరిగింది, కానీ కాలక్రమేణా ఖర్చు పెరిగింది, ఆదాయం తగ్గింది. రుణం తిరిగి చెల్లించడంలో డిఫాల్ట్‌లు జరిగాయి. బ్యాంక్ ఈ రుణాన్ని విశితి అంటే బ్యాడ్ లోన్‌గా ప్రకటించింది. పరిస్థితి చాలా తీవ్రంగా మారింది, కంపెనీ ఎన్‌హెచ్‌ఎఐపై కూడా కేసు వేసింది. జెఆర్‌టిఆర్ ఎస్ బ్యాంక్‌తో ఒప్పందం కుదుర్చుకుని మొత్తం రుణాన్ని తిరిగి చెల్లించింది. ఇప్పుడు ఆ గ్రూప్‌లోని మరో కంపెనీ రిలయన్స్ ఏరోస్ట్రక్చర్ లిమిటెడ్ (ఆర్‌ఎఎల్), డస్సాల్ట్ ఏవియేషన్‌తో కలిసి నాగ్‌పూర్‌లో



ఫాల్కన్ 2000 బిజినెస్ జెట్‌లను తయారు చేయనున్నట్లు ప్రకటించింది. మొదటి మేడ్ ఇన్ ఇండియా ఫాల్కన్ జెట్ 2028 నాటికి విమానాలను తయారు చేస్తుందని అంచనా. ఈ ప్లాంట్ ఫాల్కన్ 2000 తయారీకి మాత్రమే కాకుండా, డస్సాల్ట్ ఫాల్కన్ 6ఎక్స్, 8ఎక్స్ వంటి ఇతర మోడళ్ల తయారీకి కూడా అత్యుత్తమ కేంద్రంగా మారుతుంది. ఇది భారతదేశం అమెరికా, ఫ్రాన్స్, కెనడా, బ్రెజిల్ వంటి సొంత వ్యాపార జెట్‌లను తయారు చేసే దేశాల లీగ్‌లోకి తీసుకువస్తుంది.

## 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్: పియూష్ గోయల్

**న్యూఢిల్లీ, జూన్ 25:** 2027 నాటికి భారత్ మూడో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో భారత్ 5 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీని సాధించే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం, వ్యాపార సంఘాలు, పరిశ్రమలు సహా 140 కోట్ల మంది భారతీయులు.. ప్రధాని మోడీ వికసిత్ భారత్ దార్శనికతతో ముందుకు వెళ్తున్నారని అన్నారు. శక్తివంతమైన ఆర్థికవ్యవస్థగా మారేందుకు భారత్ సున్నితమైన సమస్యలు ఉన్న ప్రతిచోటా.. ప్రపంచదేశాలతో పోటీపడగలిగేలా తనను తాను మలుచుకుందని గోయల్ అన్నారు. నేడు భారత్ అంతర్జాతీయంగా అత్యున్నతస్థాయిలో ఉందని పేర్కొన్నారు. విదేశాలలో భారతీయ పౌరుల భద్రతకు ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతకు ఇటీవల కేంద్రప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సింధు ఉదాహరణ అని తెలిపారు. ఆపరేషన్ సింధు ద్వారా ఇరాన్, ఇజ్రాయెల్‌లలో చిక్కుకున్న భారతీయులను మోడీ ప్రభుత్వం సురక్షితంగా తమ స్వస్థలాలకు తీసుకువచ్చిందని అన్నారు. బలమైన స్థూల ఆర్థిక పునాదితో దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ దృఢంగా ఉందని గోయల్ అన్నారు. ఇప్పటివరకు లేని విధంగా దేశంలో ద్రవ్యోల్బణం అత్యల్పంగా 3 శాతానికి తగ్గిందని తెలిపారు. భారత్ 5 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీని అందుకోవడం కోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో




తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టిసారించడం వంటి చర్యలు ఎంతో కీలక మని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్.. రాబోయే దశాబ్ద కాలంలో భారత్‌కు చాలా కీలకమన్నారు. మార్చి కల్లా వైమానిక దళానికి 6 తేజస్ విమానాలు ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించిందని ఇటీవల నీతిఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4.19 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.356 లక్షల కోట్ల)కు చేరుకుందని.. జపాన్ కంటే 4.187 బిలియన్ డాలర్లు (సుమారు రూ.35,600 కోట్లు) అధికంగా మన ఆర్థికవ్యవస్థ ఉందన్న అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా గణాంకాలను ఆయన ఉదహరించారు.

## రాణించిన అన్ని రంగాల షేర్లు

**ముంబై, జూన్ 25:** ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు చల్లారిన వేళ దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. చమురు ధరలు దిగి రావడమూ మన మార్కెట్ సూచీలకు కలిసొచ్చింది. అన్ని రంగాల షేర్లు రాణించగా.. ఐటీ, మీడియా రంగ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లు కూడా ఒకటిన్నర శాతం మేర రాణించాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 700 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ 25,250 స్థాయికి చేరువైంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలమైన సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 82,448.80 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,055.11) వద్ద ఓ మోస్తరు లాభాల్లో ప్రారంభమైందది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 82,815.91 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 700 పాయింట్ల లాభంతో 82,755.51 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 200 పాయింట్ల లాభంతో 25,244.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.07గాఉంది. బీఈఎల్, కోటక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టైటాన్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.60 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3340డాలర్లవద్ద ట్రేడవుతోంది.




## ఇంధన రంగంలో అతిపెద్ద జాయింట్ వెంచర్!

**ముంబై, జూన్ 25:** అదానీ టోటల్‌గ్యాస్, జియోబిపిలు వ్యూహాత్మక భాగస్వామ్యంలోకి వచ్చాయి. ఇకపై సంయుక్తంగా రిటైల్ ఔట్‌లెట్ల మార్కెటింగ్‌లో కొనసాగుతాయి. పెట్రోలు, డీజిల్, సిఎన్‌జిలను వాటి చమురు ఔట్‌లెట్లలో జాయింట్ విక్రయాలు జరుపుతాయి. దీని ప్రనకారం అదాని టోటల్‌గ్యాస్ పెట్రోలు బంకుల్లో జియోబిపి హైలెవ్ పెట్రోలు, డీజిల్‌లను కూడా విక్రయిస్తారు. అలాగే జియోబిపి ఔట్‌లెట్లు అదానీ టోటల్‌గ్యాస్‌కు సంబంధించిన సిఎన్‌జిని విక్రయిస్తాయి. అదానీగ్రూప్, ఫ్రెంచ్ మేజర్ టోటల్ ఎనర్జీస్ సంస్థలు జాయింట్ వెంచర్‌లో అదానీ టోటల్ కొనసాగుతోంది. ఇపుడు ఈ కంపెనీ బయోగాస్, ఈవీఛార్జింగ్ స్టేషన్‌లు, రవాణా రంగానికి ఎల్ఎన్‌జిలను సరఫరా చేస్తోంది. అలాగే జియో బిపి అంటే రిలయన్స్, గ్లోబల్ ఎనర్జీ దిగ్గజం బ్రిటిష్ పెట్రోలియం కంపెనీతో జాయింట్ వెంచర్‌లో నడుస్తోంది. ఇంధన రిటైలింగ్, తక్కువ కర్బన ఉద్గారాలు వదిలే ఇంధన ఉత్పత్తులు తమతమ స్టోర్లలో విక్రయిస్తోంది. ఇకపై జాయింట్ వెంచర్ వల్ల కస్టమర్లకు హైక్వాలిటీ ఇంధన ఉత్పత్తులను అందించగలుగుతామని జియోబిపి ఛైర్మన్ శార్థక్ మెహూరియా వెల్లడించారు. అదానీ గ్యాస్‌కు సంబంధించి సిఇఒ సురేష్ పి మంగ్లాని మాట్లాడుతూ, కస్టమర్లకు మరిన్ని ప్రయోజనాలు అందించ గలుగుతున్నట్లు వెల్లడించారు. ఆదానికంపెనీకి ప్రస్తుతం 650 సిఎన్‌జి స్టేషన్లు ఉన్నాయి. జియోబిపికి 2000 కుపైగా ఇంధన స్టేషన్లున్నాయి. ఈ రెండు కలిపి జాయింట్ వెంచర్‌లో ఇపుడు మొబిలిటీ రంగానికి అత్యంత విలువైన ఇంధన ఉత్పత్తులు అందించ గలుగుతున్నట్లు వెల్లడించాయి. కంపెనీకి 125 జిల్లాల్లో 53 జిఎ స్టేషన్లు ఉన్నాయి.



## ఎయిరిండియా రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ

**ముంబై, జూన్ 25:** ఎఐ 171 విమాన దుర్ఘటనను టాటా సంస్థ చాలా సీరియస్‌గా తీసుకొంది. ఎయిరిండియా రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతను నేరుగా టాటాసన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ చేతుల్లోకి తీసు కొన్నారు. సంస్థకు ఈ దుర్ఘటన పెనుసవాలుగా మారడంతో ఆయన ఈనిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంతో సంబంధాలు, ప్రయాణికుల సురక్షితను అంచనా వేయడం, విమానాల నిర్వహణ, సిబ్బంది సంక్షేమం వంటివి ఆయన పరిధిలోకి రానున్నాయి. తమ సంస్థలు కష్టాల్లో ఉన్నప్పుడు ఛైర్మన్లు స్వయంగా రంగంలోకి దిగి వాటిని ఎదుర్కోవడం టాటా గ్రూపులో ఎప్పటి నుంచో వస్తున్నసంప్రదాయం. 1989లో టాటాస్టీల్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకొని దాదాపు 50 మంది చనిపోయారు.నాడు జేఆర్‌డీ టాటా స్వయంగా రంగంలోకి దిగి ఈ సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. ఇక టాటా ఫైనాన్స్ కుంభకోణం, 26/11 తాజ్ హోటల్‌పై ఉగ్రదాడి సందర్భంగా ఆ వ్యవహారాలను నాటి ఛైర్మన్ రతన్ టాటా స్వయంగా పర్యవేక్షించారు. ఎన్.చంద్రశేఖరన్‌కు కూడా టీఎస్ఎస్‌ను సంక్షోభాల నుంచి బయట పడేసిన రికార్డు ఉంది. ఎయిరిండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్, టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో కలిసి పనిచేయనున్నా రు. ఆ గ్రూపులో ఎయిరిండియా సంస్థకు ఇప్పుడు ప్రజల విశ్వాసం చూరగొనేందుకు వేగంగా, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉంది. అది గ్రూప్ ఛైర్మన్ మాత్రమే చేయగలరు. ఈ నేపథ్యంలో ఆయనే ఎయిర్‌లైన్స్ ప్రధాన కార్యాలయం నుంచి పనిచేయనున్నట్లు తెలుస్తోంది. భద్రతకు సంబంధించినఅంశాలపై ప్రస్తుతం సీఈవో వివిధ విభాగాల అధిపతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14